www.velthuru.com
RNI TEL TEL/ 2019 / 78609
రంగారెడ్డి
VELTHURU TELUGU DAILY
# వెలుతురు
శుక్రవారం 27 డిసెంబర్ 2024
సంపుటి :06 సంచిక : 209 , పేజీలు : 12 వెల:రూ.5/-
తెలుగు దినపత్రిక
TELANGANA, ANDHRA PRADESH



## కంప్యూటర్ శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే పాయల్ శంకర్

**ఆదిలాబాద్ వెలుతురు డిసెంబర్ 26:** వనవాసి కళ్యాణ్ పరిషత్ ఆధ్వర్యంలో కంప్యూటర్ శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ కార్యక్రమాన్ని గురువారం ఆదిలాబాద్ లోని సరస్వతి శిశు మందిర్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. నేటి కంప్యూటర్ యుగంలో కంప్యూటర్ విద్య ఎంతో అవసరమని పేర్కొన్నారు. కంప్యూటర్తోని ప్రపంచమంతా ముందుకు వెళు తుందన్నారు. వనవాసి కళ్యాణ పరిషత్ కు అవసరమయ్యే కంప్యూటర్లు అందించే విధంగా కృషి చేస్తామన్నారు. ఆదివాసులు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ప్రధాని నరేంద్ర మోడీ ప్రధానమంత్రి జన్ మన్ పథకం ద్వారా గ్రామాలలో ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నారు అన్నారు. కార్యక్రమంలో వనవాసి కల్యాణ పరిషత్ నాయకులు.. జంగు, అజయ్. నాగేశ్వర్ తదితులున్నారు



# తెలంగాణ రాష్ట్ర పురోభివృద్ధి సాధించడం లో సినిమా పరిశ్రమ ఎంతో కీలకమైనది

## - సీఎం రేవంత్ రెడ్డి

- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క , మంత్రి వెంకట్ రెడ్డి లతో కలిసి
- సినిమా పరిశ్రమ ప్రముఖులతో సమావేశం





( రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో,డిసెంబర్ 26:** తెలంగాణ రాష్ట్రం పురోభివృద్ధి సాధించడంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఫార్మా రంగాలతో పాటు సినిమా పరిశ్రమకు కూడా ప్రజా ప్రభుత్వం తగిన ప్రాధాన్యతను ఇస్తోందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తెలుగు సినిమా పరిశ్రమకు ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి మంత్రివర్గ ఉపసంఘం నియమిస్తున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు.తెలుగు చిత్రసీమకు సంబంధించి అంశాలు చర్చించడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి భట్టి ,మంత్రి కోమటిరెడ్డి లతో కలిసి సినిమా పరిశ్రమకు చెందిన ముఖ్యులతో కమాండ్ కంట్రోల్ సెంటర్లో గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేస్తామని చెప్పారు,సినిమా పరిశ్రమ అభివృద్ధి చెందడానికి ప్రజా ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రోత్సాహం అందిస్తోందని గుర్తుచేశారు. పరిశ్రమ పురోభివృద్ధికి, ఒక సానుకూల వాతావరణం ఏర్పాటుకు సినీ పరిశ్రమ వైపు నుంచి కూడా ఒక కమిటీని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ పలు విషయాలను చెప్పారు.తెలుగు సినిమా పరిశ్రమకు ప్రపంచ వ్యాప్తంగా ఒక బ్రాండ్ క్రియేట్ చేయాలని నిర్ణయం తీసుకున్నాం. పరిశ్రమబాగుండాలనికోరుకుంటున్నాం. సినీ రంగానికి హైదరాబాద్ ఒక కేంద్ర బిందువుగా ఉండేలా హాలీవుడ్, బాలీవుడ్ సైతం హైదరాబాద్ వచ్చేలా చర్యలు చేపడతామని సీఎం తెలిపారు,హైదరాబాద్లో పెద్ద సదస్సు నిర్వహించి ఇతర సినిమా పరిశ్రమలను ఆకట్టునే ప్రయత్నం చేస్తున్నాం. 2 లో..



## మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి

- తీవ్ర ద్రిగ్బాంతి వ్యక్తం చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్

(రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, డిసెంబర్ 26:** మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణం పట్ల రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర ధ్రిగ్బాంతి వ్యక్తం చేశారు. 15 వ లోక్ సభ లో ఆయన ప్రధాని గా నేను లోక్ సభ సభ్యుడిగా 2 లో..

## బీసీ కులగణనపై బీజేపీ వైఖరి చెప్పాలి

- ఎంఎల్ సి కవిత



**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, డిసెంబర్ 26:** బీసీల హామీలు, కామారెడ్డి డిక్లరేషన్పై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీజేపీ ఎందుకు నిలదీయడం లేదు?అని బీఆర్ఎస్ ఎంఎల్ సి కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు,ఆమె జాగృతి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్య క్రమంలో కవిత మాట్లాడారు, తెలంగాణ రాష్ట్రం లో బీసీలంటే బీజేపీకి లెక్క లేదా? అని ప్రశ్నించారు.బీసీల సంక్షేమాన్ని గాలికొదిలేసిన సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం పై బీజేపీ నాయకులు ఎందుకు నోరు మెదపడం లేదన్నారు ఈ సందర్భంగా బీఆర్ఎస్ 2 లో..

## "నర్వ" మండల రూపురేఖలు మార్చండి



- పీహెచ్ సీలో తక్షణమే డాక్టర్ ను నియమించండి
- ఫర్నీచర్ అందించండి
- స్కూళ్లో మిడ్ డే మీల్ వంట పాత్రలు సమకూర్చండి
- నారాయణపేట జిల్లా కలెక్టర్ ను ఆదేశించిన కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్
- ఎంపీ డీకే అరుణతో కలిసి నర్వ మండల కేంద్రంలో పర్యటన
- బ్రహ్మరథం పట్టిన ప్రజలు...
- నారాయణపేట కలెక్టర్ తో కేంద్ర మంత్రి భేటీ



**నారాయణపేట వెలుతురు డిసెంబర్ 26:** సమగ్రత అభియాన్ లో భాగంగా ఎంపికైన ఆకాంక్షిత మండల కేంద్రం నర్వాను అన్ని విధాలా అభివృద్ధి చేసి ప్రజలకు మౌలిక సదుపాయాలన్నీ కల్పించాలని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ నారాయణపేట జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు. అందులో భాగంగా నర్వా మండల కేంద్రంలోని రోడ్లును అభివృద్ధి చేయడంతోపాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రెగ్యులర్ డాక్టర్ ను నియమించాలని కోరారు. దీంతోపాటు పీహెచ్ సీలో ఫర్నీచర్ ను ఏర్పాటు చేయాలని సూచించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ గురువారం రోజున స్థానిక ఎంపీ డీకే అరుణతో కలిసి నారాయణపేట జిల్లా నర్వా మండల కేంద్రంలో పర్యటించారు. నర్వ మండలాన్ని కేంద్రం ఆస్పిరేషన్ బ్లాక్(ఆకాంక్షిత మండలం) గా ఎంపికైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బండి సంజయ్ నర్వ మండల కేంద్రంలోకి రాగానే వేలాది మంది ప్రజలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. పూలు చల్లి నీరాజనం పలికారు. వేలాది మంది వెంటరాగా వారితో కలిసి మండలం కేంద్రంలోని అంగన్ వాడీ సెంటర్ ను సందర్శించారు. చిన్నారులతో ముచ్చటించారు. పిల్లలకు అందిస్తున్న పోషకాహారం వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంగన్ వాడీ కేంద్రంలోని గర్భిణీలకు సీమంతం 2 లో..

## షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన మంత్రి

- - సత్తుపల్లి లో పర్యటించిన మంత్రి శ్రీనివాస రెడ్డి



( రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, డిసెంబర్ 26:** సత్తుపల్లి నియాజకవర్గ పర్యటనలో భాగంగా పెనుబల్లి మండలంలో రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటన చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మంత్రి శ్రీనివాస రెడ్డి సహచర ప్రజా ప్రతినిధులతో కలిసి కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణి చేశారు, ఈ కార్యక్రమం లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడం జరిగింది, అదేవిధంగా ఖమ్మం జిల్లాలో ఉన్న ప్రతి ఒక్క గ్రామానికి అభివృద్ధి పనులు చేయాలని ప్రజా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం జరిగిందని మంత్రి శ్రీనివాస రెడ్డి తెలిపారు, అలాగే తనతో పాటుగా జిల్లా కు చెందిన మంత్రి తో కలిసి జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానని మంత్రి శ్రీనివాస రెడ్డి తెలిపారు, రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు, రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసమే తాము పనిచేస్తున్నామని మంత్రి శ్రీనిసవా రెడ్డి తెలిపారు, పేదలకు షాదీ ముబారక్, కళ్యాణమస్తు పథకాల ద్వారా పేదలకు ప్రయోజనం చేకూరుతుందని మంత్రి తెలిపారు, ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు,



## ప్రమాదంలో మహాత్మాగాంధీ వారసత్వం

- పరోక్షంగా బిజెపి, ఆర్ఎస్లపై సోనియా ధ్వజం
- రాజ్యాంగ సంస్థలను గుప్పట్లో పెట్టుకున్నారన్న ఖర్గే
- బెళగావిలో సిడబ్ల్యూసి సమావేశాలు ప్రారంభం




**బెంగళూరు,డిసెంబర్26 వెలుతురు:** మహాత్మాగాంధీ వారసత్వం ముప్పులో ఉందని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్పర్సన్ సోనియా గాంధీ ఈ రోజు అన్నారు. ఢిల్లీలో అధికారంలో ఉన్న వారు, వారికి మద్దతు ఇచ్చే సంస్థల నుంచి మహాత్మా గాంధీ వారసత్వం ముప్పును ఎదుర్కొంటోందని అన్నారు. పరోక్షంగా బీజేపీ, దాని మాతృసంస్థ ఆర్ఎస్ఎస్పై సోనియా గాంధీ దాడి చేశారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రదేశాల్లో గాంధీ సిద్ధాంతాలు, సంస్థలు దాడులకు గురవుతున్నాయని అన్నారు. ఈ శక్తుల్ని ఎదుర్కోవడానికి మన సంకల్పాన్ని పునరుద్ధరించడం తమ పార్టీ పవిత్ర కర్తవ్యమని ఆమె చెప్పారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశాలు కర్ణాటక బెలగావిలో జరుగుతోంది. శతాబ్దం క్రితం ఇదే వేదికగా మహాత్మాగాంధీ కాంగ్రెస్కి అధ్యక్షత వహించారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశానికి అనారోగ్య కారణాల వల్ల సోనియా గాంధీ హాజరుకాలేదు. ఈ సందర్భంగా లిఖితపూర్వక ప్రకటనలో రాజ్యాంగ విలువలు, గాంధీ ఆశయాలను పరిరక్షించడం 2 లో..

## గ్రూప్ -1అభ్యర్థులకు తెలంగాణ హైకోర్టు షాక్

**హైదరాబాద్,డిసెంబర్26 వెలుతురు:** గ్రూప్ -1 అభ్యర్థులకు తెలంగాణ హైకోర్టు షాకిచ్చింది. గ్రూప్-1 అభ్యర్థుల పిటిషన్ను హైకోర్టు ధర్మాసనం కొట్టివేసింది. రిజర్వేషన్లతో పాటు పలు అంశాలపై హైకోర్టును గ్రూప్-1 అభ్యర్థులు ఆశ్రయించారు. వారి పిటిషన్పై గురువారం హైకోర్టులో విచారణకు వచ్చింది. ఇప్పటికే గ్రూప్-1 పరీక్షలు పూర్తి అయ్యాయి. దీంతో రిజర్వేషన్ల తేలేంత వరకు గ్రూప్-1 ఫలితాలను ఆపాలంటూ దాఖలు చేసిన పిటిషన్ను హైకోర్టు కొట్టివేసింది.

## చలితో ఉత్తరాది గజగజ

2 లో..

- దారుణంగా పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- రోడ్లపై మంచు దుప్పటి.. రాకపోకలకు తీవ్ర అంతరాయం



## మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి

ఉన్నప్పుడు ఆయన తో కలిసి అనేక సమావేశాల్లో పాల్గొన్నానని గుర్తు చేసుకున్నారు. మన్మోహన్ సింగ్ గొప్ప రాజనీతిజ్ఞుడు భారత ఆర్థిక వ్యవస్థలు నిలదొక్కుకోవడానికి ఆయన ఎన్నో సంస్కరణలు చేశారని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. 2004 – 14 మధ్య దేశ ప్రధాని గా ఆయన ఎన్నో సేవలు చేశారని ఉపాధి హామీ , సమాచార హక్కు చట్టం తదితర చట్టాలు తెచ్చి దేశ రూపురేఖలు మార్చారని మంత్రి పొన్నం ప్రభాకర్ గుర్తు చేసుకున్నారు. 10 సంవత్సరాలు ప్రధాని గా చేసిన అత్యంత నిరడంబరుడుగా ఉండేవారని గుర్తు చేసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో మన్మోహన్ సింగ్ పాత్ర మరవలేనిది అని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మరణం పట్ల తీవ్ర ద్రిగ్బాంతి వ్యక్తం చేస్తూ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు .వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# బీసీ కులగణనపై బీజేపీ వైఖరి చెప్పాలి

ఎమ్మెల్సీ కవితను శాలివాహన మరియు ఆరెకటిక సంఘం నేతలు కలిశారు, అనంతరం ఆమె మాట్లాడుతూ తెలంగాణ లో బీసీ లపై హామీలు, ఇతర సమస్యలపై చర్చలే తప్ప పోరాటాలు చేయలేదని లేదని కవిత అన్నారు, కాంగ్రెస్ కామారెడ్డి డిక్లేరేషన్ ను బీజేపీ నాయకులు ఎందుకు కాంగ్రెస్ పార్టీ ని అడగడం లేదని ఆమె ప్రశ్నించారు, ఈ కార్యక్రమంలో బిఆర్ ఎస్ పార్టీ నాయకులు మరియు జాగృతి సంస్థ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు,

# ప్రమాదంలో మహాత్మాగాంధీ వారసత్వం

పార్టీ కర్తవ్యమని పేర్కొన్నారు. మహాత్మా గాంధీ బెలగావిలో కాంగ్రెస్ అధ్యక్షుడవ్వడం పార్టీకి, స్వాతంత్య్ర ఉద్యమానికి మలుపు అని ఆమె తన సందేశంలో పేర్కొన్నారు. స్వాతంత్యం÷–ర కోసం ఎలాంటి పోరాటం చేయని సంస్థలు మహాత్మా గాంధీని తీవ్రంగా వ్యతిరేకించాయని, ఒక విషతుల్యమైన వాతావరణాన్ని ఏర్పాటు చేశాయని, వీటి వల్లే ఆయన హత్య జరిగిందని, కేంద్రంలో అధికారంలో ఉన్న వారి వల్ల గాంధీ ఘటన ప్రమాదంలో పడిందని అన్నారు. న్యూఢిల్లీలో అధికారంలో ఉన్నవారు, వారి సిద్ధాంతాలు, సంస్థల నుంచి మహాత్ముడి వారసత్వానికి ముప్పు ఉందని చెప్పారు. ఇదే వేదిక నుంచి భాజపాపై కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర విమర్శలు చేశారు. రాజ్యాంగపరమైన సంస్థలను తమ గుప్పిట్లో ఉంచుకునేందుకు ఆ పార్టీ విశ్వ ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. 'జవహర్‌లాల్ నెహ్రూ, గాంధీ సిద్ధాంతాలు, బీఆర్ అంబేద్కర్ గౌరవం కోసం చివరి శ్వాస వరకు మేమంతా పోరాడుతాం. ఎన్నికల సంఘం వంటి రాజ్యాంగపరమైన సంస్థలను భాజపా తన గుప్పిట్లో పెట్టుకునేందుకు ప్రయత్నిస్తోంది. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం క్రమంగా సన్నగిల్లుతోంది. ఈసీ నిష్పాక్షికతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఎన్నికల నియమావళిలో మార్పుల ద్వారా కేంద్రం ఏం చేయాలను కుంటోంది..?' అని ఖర్గే ప్రశ్నించారు. వచ్చే ఏడాదిలో పార్టీలో ఖాళీగా ఉన్న స్థానాలను భర్తీ చేస్తామని మల్లికార్జున ఖర్గే తెలిపారు. ఎన్నికల్లో నెగ్గేందుకు అవసరమైన నైపుణ్యాలతో పార్టీని మరింత బలంగా సన్నద్ధం చేస్తాం. కేవలం శ్రమిస్తే మాత్రమే సరిపోదు. సమయానుకూలంగా వ్యూహాలు ఉండాలి. ఒక నిర్దిష్ట మార్గం అవసరం. కొత్త నాయకత్వానికి అవకాశం ఇవ్వాలి' అని పేర్కొన్నారు. కాగా.. బెళగావిలో 'నవ సత్యాగ్రహ్ బైఠక్' (సీడబ్ల్యూసీ సమావేశం) ప్రారంభమైంది. జెండా ఎగురవేసి కార్యక్రమాన్ని ఖర్గే ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ సీనియర్ నేతలు రాహుల్ గాంధీ, జైరాం రమేశ్, సిద్ధరామయ్య, డీకే శివకుమార్, భూపిందర్ హుడా, రాజీవ్ శుక్లా తదితరులు హాజరయ్యారు.

# చలితో ఉత్తరాది గజగజ

న్యూఢిల్లీ, డిసెంబర్ 26 : జమ్ము కశ్మీర్, హిమాచల్ ప్రదేశ్ , ఉత్తరాఖండ్ సహా ఉత్తరాది రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు దారుణంగా పడిపోయాయి. ముఖ్యంగా హిమాచల్ ప్రదేశ్‌ను మంచు దుప్పటి కప్పేసింది. ఎడతెరిపి లేకుండా మంచు వర్షం కురుస్తూనే ఉంది. దీంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రోడ్లపై అడుగుల మేర మంచు పేరుకుపోయింది. అప్రమత్తమైన అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా రహదారులను తాత్కాలికంగా మూసివేశారు. హిమాచల్ ప్రదేశ్‌లో మూడు జాతీయ రహదారులు సహా మొత్తం 226 రోడ్లను మూసివేశారు. ఇందులో సిమ్లాలో 123 రోడ్లు, లాహౌల్, స్పితిలో 36, కులులో 25 రోడ్లు ఉన్నాయి. 173 ట్రాన్స్‌ఫార్మర్లకు అంతరాయం ఏర్పడింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సరఫరాపై తీవ్ర ప్రభావం పడినట్లు అధికారులు తెలిపారు. మరోవైపు రాష్ట్రంలో తీవ్రమైన చలి పరిస్థితుల కారణంగా భారత వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా దట్టమైన పొగమంచు కొనసాగే అవకాశం ఉందని తెలిపింది. ఇక ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో మంచు దట్టంగా కురుస్తోంది. దీంతో త్యుని–చక్రతా–ముస్సోరీ జాతీయ రహదారి, ధరణాధర్–కోటి కనసర్ రహదారి పూర్తిగా మంచుతో కప్పుకుపోయింది. జమ్ము కశ్మీర్‌లోని పలు ప్రదేశాలు చలికి అల్లాడిపోతున్నాయి. శ్రీనగర్‌లో మైనస్ 7 డిగ్రీల సెల్సియస్‌గా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు భారత వాతావరణ విభాగం తెలిపింది. రాబోయే రెండు రోజుల్లో ఇది మరో 2 నుంచి 3 డిగ్రీల వరకూ తగ్గే అవకాశం ఉందని అంచనా వేసింది.

# విద్యుత్ ఛార్జీల పాపం జగన్‌దే

- జెన్‌కోను సర్వనాశనం చేసారు
- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి



**అమరావతి,డిసెంబర్26( వెలుతురు):** మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ హయాంలోనే ఆంధ్రప్రదేశ్ విద్యుత్ ఉత్పత్తి సంస్థ (ఏపీ జెన్‌కో) సర్వనాశనం అయ్యిందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ మండిపడ్డారు. తాను పెంచిన విద్యుత్ చార్జీలపై జగన్ ధర్నాకు పిలుపునిచ్చారని ఆయన విమర్శించారు. ట్రూ అప్ చార్జీల భారం కచ్చితంగా జగన్ రెడ్డిదే అని, సీఎంగా జగన్ చేసిన పాపాలే ప్రజలకు శాపాలుగా మారాయని ఆయన ఎద్దేవా చేశారు. రెండేళ్ల క్రితమే విద్యుత్ చార్జీలు పెంచాలని జగన్ ఈఆర్సీని కోరారని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పేర్కొన్నారు. 'తుగ్లక్ చర్యల్లో వైఎస్ జగన్ మరో మైలురాయి దాటారు. తాను పెంచిన విద్యుత్ చార్జీలపై తానే ధర్నాకు పిలుపునిచ్చారు. ట్రూ అప్ చార్జీల భారం కచ్చితంగా జగన్ మోహన్ రెడ్డిదే. సీఎంగా జగన్ చేసిన పాపాలే ప్రజలకు శాపాలుగా మారాయి. పీపీఏల రద్దు, సోలార్, విండ్ పెట్టుబడిదారులను బెదిరించి విద్యుత్ లోటుకు కారణం అయ్యారు. జగన్ హయాంలోనే ఏపీ జెన్కో సర్వనాశనం అయ్యింది. రెండేళ్ల క్రితమే విద్యుత్ చార్జీలు పెంచాలని జగన్ ఈఆర్సీని కోరారు. నేడు ప్రజలను తప్పుదోవ పట్టించేలా కూటమి ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారు. జగన్ హయాంలోనే వసూళ్లకు డిస్కంలు అనుమతి కోరాయి. వాయిదా వేస్తూ కమిషన్ ముగిసే మూడు రోజుల ముందుగా వసూళ్లకు ఆదేశాలు ఇచ్చారు' అని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు.

## తెలంగాణ రాష్ట్ర పురోభివృద్ధి సాధించడం లో

# సినిమా పరిశ్రమ ఎంతో కీలకమైనది

(మొదటి పేజీ తరువాయి..)

ముంబైలో వాతావరణం కారణంగా బాలీవుడ్ అక్కడ స్థిరపడింది. దేశంలోని కాస్మోపాలిటన్ సిటీల్లో సినిమా పరిశ్రమ ఎదుగుదలకు హైదరాబాద్ బెస్ట్ సిటీ అని సీఎం తెలిపారు,తెలంగాణలో అవార్డులు ఇవ్వడం లేదని తెలిసి గద్దర్ పేరుతో అవార్డును ఏర్పాటు చేశాం. ప్రభుత్వం, సినిమా పరిశ్రమకు అనుసంధాన కర్తగా ఉండేందుకు దిల్ రాజు ను ఎఫ్‌డీసీ ఛైర్మన్‌గా నియమించామన్నారు,తెలంగాణలో ఎక్కడైనా షూటింగ్ చేసుకుని హైదరాబాద్ కు రెండు గంటలల్లో రావొచ్చు. తెలంగాణలోని ఎకో టూరిజం, టెంపుల్ టూరిజాన్ని ప్రమోట్ చేయండి అని సీఎం అన్నారు, పరిశ్రమను నెక్స్ట్ లెవల్‌కు తీసుకెళ్లడమే మా ఉద్దేశం. గంజాయి, డ్రగ్స్‌తో పాటు సామాజిక అంశాలపైన సినిమా పరిశ్రమ ప్రచారం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు,గతంలో సినిమా పరిశ్రమకు ఏది చేసినా కాంగ్రెస్ ప్రభుత్వాలే చేశాయి. సినిమా స్టూడియోలకు స్థలాలు, నిర్మాణాలు, నివాస స్థలాలు, ఫిల్మ్ నగర్, చిత్రపురి కాలనీ, కార్మికులకు ఇండ్లు, ఇతర సౌకర్యాలు కాంగ్రెస్ ప్రభుత్వాలే ఇచ్చాయని తెలిపారు,ఆ వారసత్వాన్ని కొనసాగిస్తాం. సినిమా పరిశ్రమను ప్రోత్సాహించడమే మా ముఖ్య ఉద్దేశం. ముఖ్యమంత్రిగా చట్టాన్ని అమలు చేయాల్సిన




బాధ్యత నాపై ఉంటుంది. నాకు వ్యక్తిగత ఇష్టాయిష్టాలు లేవు అని సీఎం చెప్పారు,తెలుగు సినిమా పరిశ్రమ తెలుగుకే పరిమితం కాకుండా అన్ని భాషల సినిమాల నిర్మాణానికి అంతా కలిసి అభివృద్ధి చేద్దాం. మా ప్రభుత్వం సినిమా పరిశ్రమకు ఎల్లప్పుడు అండగా ఉంటుందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు,సినిమా పరిశ్రమ కూడా తమ సామాజిక బాధ్యతను గుర్తు పెట్టుకోవాలి. ప్రభుత్వ కార్యక్రమాల్లో, రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కోరుకుంటున్నామని సీఎం తెలిపారు,ఈ సమావేశంలో తెలంగాణ ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు ,హోం శాఖ ముఖ్య కార్యదర్శి రవి గుప్తా ,డీజీపీ జితేందర్ ,సినీ రంగానికి నిర్మాతలు, దర్శకులు, నటులు పాల్గొన్నారు. సినీ పరిశ్రమకు చెందిన సురేష్ బాబు ,కేఎల్ నారాయణ ,మురళీమోహన్ ,కే.రాఘవేందర్ రావు ,కొరటాల శివ ,వెంకటేశ్ ,నాగార్జున ,అల్లు అరవింద్ ,త్రివిక్రమ్ తోపాటు పలువురు ప్రతినిధులు హాజరయ్యారు.

# "నర్వ" మండల రూపురేఖలు మార్చండి

(మొదటి పేజీ తరువాయి..)









సందర్భంగా వారికి పండ్లను అందజేశారు. వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అనంతరం అంగన్ వాడీ కేంద్రంలో మొక్కను నాటారు. అక్కడి నుండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లిన బండి సంజయ్ అక్కడ డాక్టర్ లేరని ప్రజలు చెప్పడంతో... తక్షణమే రెగ్యులర్ డాక్టర్ ను నియమించాలని ఆదేశించారు. పీహెచ్ సీలో కనీసం ఫర్నీచర్ కూడా లేకపోవడంతో రోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ప్రజలు విన్నవించడంతో వెంటనే ఫర్నీచర్ ను సమకూర్చాలని కలెక్టర్ ను ఆదేశించారు. అనంతరం బయటకు వచ్చిన సంజయ్ ను స్థానిక ప్రజలు కలిసి మండల కేంద్రానికి రోడ్డు సౌకర్యం లేదని మొరపెట్టుకున్నారు. అక్కడి నుండి స్థానిక పాఠశాలను సందర్శించిన బండి సంజయ్ అక్కడ మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులతో కలిసి ముచ్చటించారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. భోజనం ఎలా ఉందని అడిగారు. మధ్యాహ్నం భోజనం వండేందుకు వంట పాత్రలు లేవని నిర్వాహకులు చెప్పడంతో... వెంటనే వాటిని సమకూర్చాలని కలెక్టర్ ను కోరారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలన్నీ కల్పించాలని సూచించారు.

అనంతరం డీకే అరుణతో కలిసి బండి సంజయ్ నేరుగా నారాయణపేట జిల్లా కలెక్టరేట్ కు విచ్చేశారు. కలెక్టర్ స్నిగ్ధ తో భేటీ అయ్యారు. ఆస్పిరేషనల్ బ్లాక్ గా నర్వ ఎంపికనైందున మండల కేంద్రం రూపురేఖలు మార్చాల్సిందేనని కోరారు. "ముఖ్యంగా గత 3 నెలల్లో యాంటినేటల్ కేర్ (ANC) కోసం ఎంత మంది గర్భిణీ(ప్రెగ్నెంట్స్) లను రిజిస్టర్ చేశారు? ఏయే గ్రామాలకు వెళ్లారు? ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఎంత మంది పేర్లను రిజిస్టర్ చేశారు? 2024 ఫస్ట్ త్రైమాసికంలో స్టేట్ యావరేజ్ (88.7 శాతం) ఉంటే ఈ మండలంలో 77.1 శాతం మాత్రమే నమోదైంది. కారణాలేమిటి?"అనే అంశంపై ఆరా తీశారు.దీంతోపాటు " బీసీ, షుగర్ టెస్టుల్లో, పోషకాహారం అందించడంలో, మహిళా సంఘాలకు రివాల్వింగ్ ఫండ్ అందించడంలో కూడా 3 నెలల్లోనే 100 శాతం లక్ష్యాన్ని చేరుకున్నట్లు చూపుతున్నారు. ఎట్లా సాధ్యమైంది? మీరు తీసుకున్న చర్యలేమిటి? అట్లాగే భూసార పరీక్షల శాంపిల్స్ తీసుకోలేదని మీ రిపోర్ట్ లో ఇచ్చారు. కొన్ని బ్లాకుల్లో శాంపిల్స్ తీసుకున్నారు కదా? మీరెందుకు సేకరించలేకపోయారు?" అనే అంశంపై అధికారుల నుండి వివరాలు తీసుకున్నారు.అనంతరంర "సమగ్రతా అభియాన్" కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ ను ఉద్దేశించి నర్వ మండల కేంద్రంలో ప్రజలు తనతో మొరపెట్టుకున్న సమస్యలన్నీ పరిష్కరించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని బండి సంజయ్ సూచించారు. వచ్చే ఏడాదిలో మార్చి లేదా ఏప్రిల్ లో మళ్లీ నర్వాకు విచ్చేస్తానని, ఆలోపు రోడ్డు నిర్మాణంతోపాటు కనీస సౌకర్యాలన్నీ కల్పించాలని చెప్పారు.

అంతకుముందు బండి సంజయ్ నర్వా మండల కేంద్రంలో స్థానిక మీడియాతో మాట్లాడుతూ "సబ్ కా సాత్..సబ్ కా వికాస్...సబ్ కా విశ్వాస్...". నినాదంలో భాగంగా 'నీతి అయోగ్' చేపట్టిన కార్యక్రమమే ఈ "సంపూర్ణతా అభియాన్"అని వివరించారు. దేశంలో ఎక్కడైతే నిర్లక్ష్యానికి గురైన ప్రాంతాలున్నాయో, అక్కడి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పర్చేందుకు తీసుకొచ్చిన కార్యక్రమమే ఈ 'సంపూర్ణతా అభియాన్'అని పేర్కొన్నారు. "2018లో మొదటి సారిగా దేశవ్యాప్తంగా 112 ఆస్పిరేషన్ (ఆకాంక్షిత) జిల్లాలను గుర్తించినం. ఈ కార్యక్రమాన్ని మరింతగా క్షేత్ర స్థాయి వరకు విస్తరించాలనే లక్ష్యంతో 2023 జనవరి 7న 500 బ్లాక్/ మండలాలను గుర్తించినం. మన రాష్ట్రంలో 3 జిల్లాలను 'ఆస్పిరేషనల్ డిస్ట్రిక్ట్స్ గా", 10 మండలాలను 'ఆస్పిరేషనల్ బ్లాక్'లుగా గుర్తించి కార్యక్రమాలను ప్రారంభించినం. ఈ జిల్లాలో ఎంపికైన నర్వా మండలంలో కార్యక్రమాల ప్రోగ్రెస్ ఎట్లా ఉందో తెలుసుకుని రావాలని మోదీజీ ఆదేశించడంతో ఇక్కడికి వచ్చిన. ప్రజలతో మాట్లాడిన. సమస్యలను అడిగి తెలుసుకున్న. అంగన్ వాడీ, పీహెచ్ సీ, ప్రభుత్వ పాఠశాలలను సందర్శించిన. అక్కడున్న సమస్యలను పరిష్కరించాలని అధికారులను కోరారు. అంతిమంగా నర్వ మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషి చేస్తా."అని వివరించారు.

## జగన్ అవినీతితో లక్షా 29 వేల కోట్లు విద్యుత్ భారం

- విద్యుత్ ఛార్జీల పెంపు భారం జగన్‌దే
- ఐదేళ్ల పాపాలను మోస్తున్న సిఎం చంద్రబాబు
- జగన్ తీరుపై మండిపడ్డ వర్ల రామయ్య

**అమరావతి,డిసెంబర్26( వెలుతురు):** జగన్ రెడ్డి ఐదేళ్ల పాలన అంతా అవినీతిమయమని వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌పై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య మరోసారి మండిపడ్డారు. గురువారం అమరావతిలో వర్ల రామయ్య విలేకర్లతో మాట్లాడుతూ.. ఐదేళ్ల పాలన పాపాలను బాబు మోస్తున్నారని అభివర్ణించారు. ఆయన మాట్లాడే ప్రతి మాట అబద్దాల మూట అని పేర్కొన్నారు. వైఎస్ జగన్ అవినీతి వలన ప్రజలపై రూ. లక్షా 29 వేల కోట్లు విద్యుత్ భారం పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విద్యుత్ ఛార్జీల పెంపు పాపం.. జగన్ రెడ్డిదేనని ఆయన స్పష్టం చేశారు. దీనిపై చర్చకు వచ్చే ధైర్యం ఉందా? అంటూ వైఎస్ జగన్‌కు వర్ల రామయ్య సవాల్ విసిరారు. వైఎస్ జగన్ ధర్నా చేస్తానంటూ చేసిన వ్యాఖ్యలపై వర్ల రామయ్య మండిపడ్డారు. ఎవరి మీద ధర్నా చేస్తావు నువ్వు అంటూ జగన్ రెడ్డిని సూటిగా ప్రశ్నించారు. మీరు చేసిన అవినీతి పరిపాలన మీద ధర్నా చేసుకుంటావా? అంటూ వైసీపీ అధినేతను ఈ సందర్భంగా నిలదీశారు. మీ పార్టీ రాజ్యసభ సభ్యుడు విజయసారెడ్డికి చెందిన నాసిరకం బొగ్గు కొనుగోళ్ల వలనే జన్ కో ఎ÷–లాంట్లలో విద్యుత్ ఉత్పత్తి తగ్గిందని గుర్తు చేశారు. మొత్తంగా 1,29,503 కోట్ల నష్టంతో.. నేడు ప్రజలపై ఈ విద్యుత్ భారం పడిందన్నారు. మీ పాలనలో ఏదైనా ఒక్క కొత్త విద్యుత్ ఎ÷–లాంట్ ప్రారంభించారా? అంటూ జగన్ రెడ్డిని బల్లగుద్ది మరి ప్రశ్నించారు. విద్యుత్ వెలుగులకు ఆద్యుడు టీడీపీ జాతీయ అధ్యక్షుడు, సీఎం నారా చంద్రబాబు నాయుడని ఈ సందర్భంగా వర్ల రామయ్య గుర్తు చేశారు. 1995 ? 2024 చంద్రబాబు పాలనలో 5 మెగావాట్ల విద్యుత్ ఉత్తత్పిని పెంచారన్నారు. అలాగే రాష్ట్ర విభజన అనంతరం అంటే.. 2014 –2019లో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 9,463 మెగావాట్లు పెంచారని చెప్పారు. రాష్ట్రంలో మొత్తం విద్యుత్ ఉత్పత్తిలో చంద్రబాబు పెంచిన విద్యుత్ ఉత్పత్తే 15 వేల మెగావాట్లని ఈ సందర్భంగా వర్ల రామయ్య వివరించారు. రాష్ట వ్యాప్తంగా 21 లక్షల వీధి దీపాలను ఏర్పాటు చేసిన ఘనత చంద్రబాబు నాయుడిదేనని తెలిపారు. మీ ఐదేళ్ల పాలనలో ఒక్క వీధి దీపమైన పెట్టారా? దీనిపై బహిరంగ చర్చకు వస్తారా? అంటూ మరోసారి జగన్ రెడ్డికి వర్ల రామయ్య సూటిగా సవాల్ విసిరారు. 1998లో ఏపీలో విద్యుత్ సంస్కరణల చట్టం తీసుకు వచ్చిందే చంద్రబాబు నాయుడన్నారు. అయితే మీ పాపాన్ని నాడు ఏసు ప్రభువు శిలువ మోసినట్లు నేడు చంద్రబాబు మోస్తున్నారని పేర్కొన్నారు. ఈ ఐదేళ్ల పాలనలో.. మీరు తొమ్మిది సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచారన్నారు. నాడు మీరు మార్కెట్‌లో విచ్చలవిడిగా విద్యుత్ కొనుగోళ్లు చేసి 2022–23లో రూ. 6,072 కోట్లు, 2023–24 లో రూ. 9,412 కోట్లు ప్రజలపై భారం మోపింది.. మీరు కాదా జగన్ రెడ్డి అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది మీ పాపం కాదని చెప్పే ధైర్యం మీకు ఉందా? అని వైసీపీ అధినేతను ఆయన ప్రశ్నించారు. ఇక మాజీ మంత్రి ఆర్కే రోజా సైతం.. వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్‌రెడ్డిని బిజినెస్ మ్యాన్, ఫ్యామిలీ మ్యాన్‌గా సక్సెస్ అయ్యారంటూ చేసిన వ్యాఖ్యలపై వర్ల రామయ్య తనదైన శైలిలో స్పందించారు. అవునండి వైఎస్ జగన్ మంచి బిజినెస్ చేసి రూ. 43 వేల కోట్ల ప్రజాధనం కొట్టేశారని సీబీఐ సైతం చెప్పిందని ఆయన వ్యంగ్యంగా పేర్కొన్నారు. తల్లిని, చెల్లిని, బాబాయి కూతుర్ని, బాబాయిని, బామ్మర్ధులను కాదన్న ఈయన ఏ విధంగా ఫ్యామిలీ మెన్ ? అంటూ ఆర్కే రోజా చేసిన వ్యాఖ్యలపై సందేహం వ్యక్తం చేశారు. ఫ్యామిలీ అంటే జగన్ రెడ్డి, ఆయన భార్య భారతీ రెడ్డిగారేనా? అంటూ వ్యంగ్యంగా ప్రశ్నించారు. ఫ్యామిలీ అంటే చంద్రబాబు ఫ్యామిలా ఉండాలని వర్ల రామయ్య ఈ సందర్భంగా వైఎస్ జగన్‌కు సూచించారు.

# మాజీ ఎంపీ మంద జగన్నాథం ఆరోగ్యం విషమం



( రాపర్తి భాస్కర్ గౌడ్ )

వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, డిసెంబర్ 26 :

ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా నాగర్ కర్నూల్ మాజీ ఎంపీ, సీనియర్ నాయకుడు మంద జగన్నాథం ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది,మంద జగ్నాథం గత కొంతకాలం క్రితం గుండె పోటుతో ఆయన తీవ్ర అస్వస్థతకు గురైన నిమ్స్ ఆసుపత్రిలో చేరారు, ఆయన ఆరోగ్యం క్షీణించడంతో ఆయనకు వెంటిలేటర్ పై చికిత్స అందిస్తున్నారు,ఇది ఇలావుండగా మంద జగ్నాథం ను ఆసుపత్రిలో బీఆర్ ఎస్ పార్టీ నాయకులు పరామర్శించారు, అనంతరం ఆయన కు జరుగుతున్న చికిత్స పై ఆరా తీశారు.

# కూటమి తప్పుడు ప్రచారం వల్లే ఓడాం

- జైల్లో పెట్టుకుంటావా పెట్టుకో...చూసుకుంటాం
- పార్టీ సమావేశంలో మాజీమంత్రి రోజా సవాల్

నగరి,డిసెంబర్26( వెలుతురు):

ఎన్నికల్లో తప్పులు చేసి మనం ఓడిపోలేదు.. కూటమి ప్రభుత్వ తప్పుడు ప్రచారం వల్ల ఓడిపోయాం అని మాజీమంత్రి, నటి రోజా అన్నారు. ఈసారి కచ్చితంగా మన ప్రభుత్వం అధికారంలోకి వస్తుంది అని పార్టీ శ్రేణులకు ఆమె ధైర్యం చెప్పారు. ఈ మేరకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కీలక నేత ఆర్కే రోజా మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. గురువారం నగరిలో జరిగిన వైఎస్సార్ సిపి పార్టీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఏపీ సిఎం చంద్రబాబునుద్దేశించి 'జైల్లో పెడతావా..? పెట్టుకో.. కేసులు పెడతావా? పెట్టుకో.. ఉద్యోగాలు తీసేస్తావా తీసేసెయ్..! ' అని సవాల్ విసిరారు. మళ్లీ మా ప్రభుత్వం వస్తుంది.. వడ్డీతో సహా తిరిగి ఇస్తామని' ఆమె కూటమి ప్రభుత్వాన్ని ఆమె హెచ్చరించారు. ఈ ప్రభుత్వ హయాంలో ఇబ్బందులు పడ్డ కార్యకర్తల పేర్లను గుడ్ బుక్‌లో రాసి పెట్టుకుంటాం.. వారిని గుర్తుపెట్టుకుంటామని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మన ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఉద్యోగస్తులందరూ ఎగిరెగిరి పడ్డారు.. మన ప్రభుత్వాన్ని దించేంతవరకు ఉద్యోగులందరూ కంకణం కట్టుకొని పనిచేశారు. ఇప్పుడు ఈ ప్రభుత్వంలో వారే నరకయాతన అనుభవిస్తున్నారు. పవన్ కల్యాణ్‌కు, చంద్రబాబుకు, లోకేష్ కు మాత్రమే ఉద్యోగాలు వచ్చాయి. ఏపీ యువతకు ఉద్యోగాలు రాలేదు రోజా ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా ఆమె.. మనం తప్పులు చేసి ఓడిపోలేదు.. ఆరు నెలల్లోనే కూటమి ప్రభుత్వం ఆలీబాబా ఆరడజను దొంగల్లా మారిందని విమర్శించారు. ఏపీ ప్రజలకు నరకం అంటే ఎంటో కూటమి ప్రభుత్వం చూపిస్తుందన్నారు.. జగన్‌ను ఓడించి తప్పుచేశామని ప్రజలు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు.. పశ్చాత్తాప పడుతున్నారని వ్యాఖ్యానించారు.. సంపద సృష్టిస్తా అని చెప్పిన చంద్రబాబు అప్పుల మీద అప్పులు సృష్టిస్తున్నారు? ఎన్నికల ప్రచారంలో పచ్చ చొక్కాలు వేసుకుని, పచ్చ చీరలు కట్టుకుని నీకు 15 వేలు నీకు 15 వేలు అంటూ టిడిపి నేతలు అబద్దాలు చెప్పారని ఆమె మండిపడ్డారు. జగన్ బిజినెస్ మాన్ గా, పార్టీ అధినేతగా, ఫ్యామిలీ మెన్ గా సక్సెస్ అయిన వ్యక్తి అని ఆమె అభివర్ణించారు. మరోవైపు పార్టీ కీలక నేత, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఉద్దేశించి మన పార్టీలోని కొందరు చేసిన దిగజారుడు రాజకీయాల వల్ల ఎప్పుడూ అత్యధిక స్థానాలు గెలిచే జిల్లాలో ఈసారి గెలవలేకపోయామన్నారు. వచ్చే ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడిగా భుమన కరుణాకర్ రెడ్డి ఆధ్వర్యంలో కుప్పంతో సహా 14 స్థానాలను గెలుస్తామని రోజా ధీమా వ్యక్తం చేశారు.

# 10 నుండి 19 వరకు వైకుంఠ ద్వార దర్శనం

- వైకుంఠ ఏకాదశికి ప్రత్యేక కౌంటర్ల ద్వారా టిక్కెట్ల విక్రయం

తిరుమల,డిసెంబర్26( వెలుతురు):



తిరుమల శ్రీవారి ఆలయంలో జనవరి 10 నుండి 19వ తేదీ వరకు వైకుంఠ ద్వార దర్శనానికి సంబంధించి తిరుపతి, తిరుమలలో సర్వదర్శనం టైంస్లాట్ టోకెన్లు జారీ చేయనున్నట్లు టీటీడీ ఈవో శ్యామలరావు వెల్లడించారు. జనవరి 10, 11, 12వ తేదీలకు సంబంధించి మొదటి మూడు రోజులకు జనవరి 9వ తేదీన ఉదయం 5 గంటల నుండి 1.20 లక్షల టోకెన్లు భక్తులకు జారీ చేస్తామని, తదుపరి రోజులకు ఏరోజుకారోజు ముందు రోజు టోకెన్లు జారీ చేస్తామని ఈవో తెలిపారు. తిరుపతిలోని రామచంద్ర పుష్కరిణి, భూదేవి కాంప్లెక్స్, జీవకోన హైస్కూల్, ఇందిరా మైదానం , శ్రీనివాసం, విష్ణునివాసం, బైరాగిపట్టెడలోని రామానాయుడు స్కూల్, ఎంఆర్ పల్లి స్కూల్‌లతో పాటు తిరుమలలో బాలాజీ నగర్‌లోని కమ్యూనిటీ హాల్‌లో తిరుమల స్థానికుల కొరకు కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తిరుపతిలోని 8 కేంద్రాలలో 87 కౌంటర్లు, తిరుమలలో 4 కౌంటర్లు కలుపుకుని మొత్తం 91 కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. భక్తులు తమ ఆధార్ కార్డు చూపించి టోకెన్లు పొందాలని, టోకెన్లు పొందిన భక్తులకు ఈసారి వారి ఫోటో గుర్తింపుతో కూడిన స్లిప్‌లను జారీ చేస్తామని తెలిపారు. టోకెన్లు లేని భక్తులకు ఈ 10 రోజులలో శ్రీవారి దర్శనం ఉండదని తెలిపారు. కౌంటర్లు ఏర్పాటు చేస్తున్న ప్రాంతాల్లో ప్రత్యేకంగా క్యూలైన్లు, బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నామని, వేచి ఉండే భక్తులకు తాగునీరు, మరుగుదొడ్లు తదితర సదుపాయాలు కల్పిస్తున్నామని వివరించారు. సర్వదర్శనం టోకెన్ల కలిగిన భక్తులు తమకు కేటాయించిన సమయానికి తిరుమలకు వచ్చి స్వామివారి దర్శించుకోవాలని విజ్ఞప్తి చేశారు. తిరుపతిలో ఏర్పాటు చేస్తున్న కౌంటర్ల కేంద్రాలను టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, టీటీడీ జేఈవో గౌతమి, జిల్లా కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు, సివిఎస్వో శ్రీధర్‌లతో కలిసి ఈవో తనిఖీ చేశారు. ఈవో వెంట సీఈ సత్యనారాయణ, ఎస్ఈ వెంకటేశ్వర్లు, మనోహర్, ట్రాన్స్‌పోర్ట్ జీఎం శేషారెడ్డి, తదితర టీటీడీ అధికారులు, పోలీసు, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

# స్నేహ చికెన్ పరిశ్రమ దుర్మార్గాలపై విచారణ జరపాలి

- అధికారుల అండదండలు.. ప్రజా ప్రతినిధుల అభయహస్తం
- అండగా చూసుకుని రెచ్చిపోతున్న స్నేహా కంపెనీ యాజమాన్యం
- పర్యావరణ కాలుష్యం, పంటలు నాశనం
- భూముల కబ్జాలు.. డెడ్ స్టోరేజీలో జల దోపిడీ
- స్థానికులకు ఉపాధి కరువు.. ఒకే కులం వారికి చేయూత
- కంపెనీ నుంచి వస్తున్న కంపుతో ఊపిరి తీసుకోలేక శ్వాసకోశ సమస్యలు
- నిబంధనలకు తూట్లు పొడుస్తూ...ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్న కంపెనీపై చర్యలు తీసుకోవాలి
- బిసి పొలిటికల్ జెఎసి చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్



వనపర్తి జిల్లా వెలుతురు డిసెంబర్ 26:

ప్రభుత్వ నిబంధనలకు తూట్లు పొడుస్తూ...భూ కబ్జాలు, జల దోపిడీతో దౌర్జన్యం చేస్తూ... వాయు కాలుష్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న స్నేహ చికెన్ కంపెనీపై చర్యలు తీసుకోవాలని బిసి పొలిటికల్ జెఎసి చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలో స్థానిక రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాచాల మాట్లాడుతూ మహబూబ్ నగర్, వనపర్తి జిల్లాల సరిహద్దు ప్రాంతంలో కొన్నేళ్ల క్రితమే స్నేహా చికెన్ ఫౌల్ట్రీ పరిశ్రమను స్థాపించారని,చిన్నగా ప్రారంభమైన ఈ కంపెనీ ఇప్పుడు తన పరిధిని విస్తృతం చేసుకున్నదన్నారు. పెద్దమందడి మండలం వెల్టూరు శివారులోని 22/1 లో ప్రభుత్వ భూమిని స్నేహ చికెన్ పరిశ్రమ ఆక్రమించి, అక్కడ కొన్ని నిర్మాణాలు కూడా చేపట్టిందని ఫిర్యాదు చేస్తే అధికారులు సర్వే నిర్వహించి.. రికార్డులు పరిశీలించిన తర్వాత వెల్టూరు శివారులోని సర్వే నెంబర్ 22/1లో 1.25 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేశారని నిర్ధారించి, ప్రభుత్వ భూమిని ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను ఎందుకు తొలగించకూడదో.. వివరణ ఇవ్వాలని స్నేహా చికెన్ కంపెనీ ఎండీ రాంరెడ్డికి ఫిబ్రవరి 28, 2024 న నోటీసులు జారీ చేశారన్నారు. నోటీసులు జారీ చేసి 10 నెలలు గడుస్తున్నా వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదో చెప్పాలన్నారు. స్నేహా చికెన్ కంపెనీ భీమా రెండో దశలో అంతర్భాగంగా నిర్మించిన శంకర్ సముద్రం రిజర్వాయర్ నుంచి రోజుకు 10 లక్షల లీటర్ల చొప్పున కంపెనీ, అలాగే అందులో ఉండే క్వార్టర్స్ గృహ అవసరాలకు తరలించుకునేందుకు అనుమతి తీసుకున్నదని, ఈ నీటి తరలింపు సంవత్సరంలో 0.01289 టీఎంసీలను మించకూడదనే నిబంధన ఉన్నప్పటికి స్నేహా కంపెనీ దౌర్జన్యంగా అధికంగా నీటిని తరలిస్తోందని ఆరోపించారు. తాగునీటికి నీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా పట్టించుకోకుండా ప్రభుత్వ నిభందనలు తుంగలో తొక్కి డెడ్ స్టోరేజీలో కూడా దౌర్జన్యంగా పరిశ్రమకు తీసుకెళ్లారని మండిపడ్డారు.

**ర్యావణానికి తూట్లు...**

అధికారుల అండదండలు...ప్రజాప్రతినిధుల అభయ హస్తంతో స్నేహ ఫార్మ్స్ యాజమాన్యం రెచ్చిపోతుందని, పర్యావరణ నిబంధనలకు తూట్లు పొడుస్తూ...స్నేహ ఫార్మ్స్ నుంచి వచ్చే వ్యర్థ పదార్థాలు పొలాలలో వదలడంతో అవి పెద్దమునగల్ చేడు వాగులో కలిసి కలుషితమై సరళసాగర్ మీదుగా రామన్‌పాడు డ్యామ్‌లోకి వెళ్తున్నాయన్నారు. రామన్‌పాడు డ్యామ్ నుంచి సరఫరా అయ్యే కలుషితమైన నీరు తాగి పలువురు క్యాన్సర్, ఇతర రోగాల బారిన పడుతున్నారన్నారు పెద్దమునగల్ చేడ్, బలీదుపల్లి శివారు మధ్యలో జహంగీర్ పీర్ దర్గా దగ్గర జాతీయ పక్షి నెమలులు, రాష్ట్ర జంతువైన జింకలు ఎక్కువగా ఉంటాయని, ఈ కలుషిత నీరు త్రాగి వీటితో పాటు పశువులు, గొర్రెలు కూడా చనిపోతున్నాయన్నారు. కావున ప్రభుత్వ నిభందనలకు తూట్లు పొడుస్తూ... ప్రజల జీవితాలలో చెలగాటమాడుతున్న స్నేహ కంపెనీని మూసివేయాలన్నారు. పరిశ్రమ స్థాపన కొసం అన్ని వర్గాల రైతులతో భూములు తీసుకొన్న యాజమాన్యం, తమ పరిశ్రమ నుంచి వచ్చే చికెన్ ను అందరికీ అమ్ముకుంటున్న యాజమాన్యం ఉపాధి అవకాశాలు కల్పించే విషయంలో మాత్రం ఒకే కులం వారికి మంచి ఉద్యోగాలు కల్పిస్తూ...పేద వర్గాలను విస్మరిస్తూ అరకొర అవకాశాలు కల్పిస్తున్నారని మండిపడ్డారు... ఈ కార్యక్రమంలో బిసి పొలిటికల్ జెఎసి నాయకులు రమేష్ సాగర్, చాకలి రమేష్, అంజన్న యాదవ్,మహేందర్ నాయుడు, మ్యాదరి రాజు, దేవర శివ, కుర్వ నరసింహ, శాఖ కొండన్న, గండి చంద్రయ్య, మూలమల్ల రాములు, రాజేష్, బోయ వినయ్, బోయ దాసు, పీటర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ దేశాలకు సేవలందిస్తూ.. 'విపత్తు హెచ్చరిక' వ్యవస్థల్లో అగ్రగామిగా నిలిచిన భారత్

**- డాక్టర్ జితేంద్ర సింగ్**

- ప్రపంచవ్యాప్తంగా తీరప్రాంతాల భద్రతకు తోడ్పాటు.. విపత్తులను ఎదుర్కొనే దీటైన వ్యవస్థలతో ముందుకెళ్తున్న భారత్ - డాక్టర్ జితేంద్ర సింగ్
- 'డీప్ సీ మిషన్' వంటి వినూత్న పథకాలతోపాటు ఈ రంగానికి ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ అత్యధిక ప్రాధాన్యం
- శరవేగంగా పురోగతి సాధిస్తున్న ఇన్ కోయిస్ - ఈ తరహా సంస్థల్లో ప్రపంచంలోకెల్లా అత్యాధునికమైనదిగా గుర్తింపు
- 'వికసిత భారత్' లక్ష్యం దిశగా మహాసముద్రాల అన్వేషణ కీలకం: మంత్రి
- మహా సముద్రాలపై పరిశోధన, విపత్తు సంసిద్ధతల్లో భారత పురోగతిని ఇన్ కోయిస్ లో ప్రముఖంగా ప్రస్తావించిన డాక్టర్ జితేంద్ర సింగ్





హైదరాబాద్, వెలుతురు డిసెంబర్ 26:

విపత్తు హెచ్చరికలో భారత్ నేడు అంతర్జాతీయ స్థాయిలో అగ్రగామిగా అవతరించిందనీ, ప్రపంచవ్యాప్తంగా ఇతర దేశాలకూ సేవలందిస్తోందనీ కేంద్ర శాస్త్ర-సాంకేతికతల శాఖ సహాయ (స్వతంత్ర హోదా), భౌగోళిక విజ్ఞాన శాఖ, పీఎంవో సహాయక, అణుశక్తి శాఖ, అంతరిక్ష శాఖ, సిబ్బంది వ్యవహారాలు, ప్రజా ఫిర్యాదులు, పింఛన్ల శాఖ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. 2004లో సంభవించిన హిందూ మహా సముద్ర సునామీకి 20 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో.. ఇన్ కోయిస్ (భారత జాతీయ మహాసముద్ర సమాచార వ్యవస్థా కేంద్రం)లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.2004లో సునామీ విషాదం అనంతరం ఏర్పడిన ఇన్ కోయిస్.. 2014 తర్వాత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నుంచి లభించిన స్థిరమైన సహకారం, ఆయన ఈ సంస్థకు ఇచ్చిన ప్రాధాన్యం వల్ల వేగంగా పురోగతి సాధించిందని మంత్రి గుర్తుచేశారు. ఈ తరహా సంస్థల్లో ప్రపంచంలో అత్యాధునికమైనదిగా గుర్తింపు పొందిందన్నారు.'డీప్ సీ మిషన్' సహా స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధానమంత్రి మోదీ ప్రకటించిన సముద్ర సంబంధిత కార్యక్రమాలను డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రశంసించారు. సముద్ర పరిశోధన, విపత్తుల సన్నద్ధతలో భారత్ సాధించిన పురోగతిని ఆయన ప్రముఖంగా పేర్కొన్నారు.ప్రపంచ స్థాయి విపత్తు హెచ్చరిక వ్యవస్థలను అందించడంలో భారత్ అంతర్జాతీయ స్థాయిలో అగ్రగామిగా నిలుస్తోందని మంత్రి ఉద్ఘాటించారు. భద్రత, సుస్థిరతలను పెంపొందించడంలో శాస్త్రీయ పురోగతి పాత్ర అత్యంత కీలకమైనదని స్పష్టం చేశారు.భారత్ లో 10,749 మందినీ, ప్రపంచవ్యాప్తంగా 2,30,000 మంది ప్రాణాలను బలిగొన్న విపత్కర సునామీ విలువైన పాఠాలు నేర్పిందనీ, అనంతరం ఈ పరిస్థితిలో మార్పు తెచ్చే దిశగా విధానాలు రూపొందాయనీ డాక్టర్ జితేంద్ర సింగ్ వ్యాఖ్యానించారు. "ఈ విషాదం.. ఇన్ కోయిస్ వంటి సంస్థల స్థాపన ఆవశ్యకతను తెలియజేసింది. జీవన భద్రత, జీవనోపాధికి భరోసానివ్వడంలో భారత నిబద్ధతకు ఇప్పుడీ సంస్థ నిదర్శనంగా నిలుస్తోంది" అన్నారు.అంతర్జాతీయంగా ప్రశంసలు పొందిన భారత ముందస్తు సునామీ హెచ్చరిక వ్యవస్థ భారత విపత్తు సన్నద్ధతకు మూలాధారంగా నిలిచింది.యునెస్కోతో ప్రస్తుత సహకారాన్నీ, అత్యంత ప్రభావిత ప్రాంతాల్లో సామాజిక పునరుద్ధరణను పెంచడం లక్ష్యంగా పెట్టుకున్న సునామీ సంసిద్ధతా చర్యలనూ మంత్రి ప్రస్తావించారు. ఈ కార్యక్రమం కింద 24 భారతీయ సమూహాలను గుర్తించడాన్ని.. సమాజ కేంద్రీకృత విధానానికి నిదర్శనంగా పేర్కొన్నారు. తీరప్రాంతంలో, సమృద్ధిగా ఉన్న వనరులను సుస్థిరమైన మార్గాల్లో అన్వేషించి, వాటిని పరిరక్షించాలని సూచించారు. "సముద్ర లోతుల్లో అన్వేషణ, బయోఈ3 (పర్యావరణం, ఉపాధి, ఆర్థికవ్యవస్థల కోసం బయోటెక్నాలజీ) లాంటి మా కార్యక్రమాలు జీవవైవిధ్యాన్ని పెంపొందించడమే కాకుండా జాతీయ శ్రేయస్సుకు దోహదం చేసే వ్యవస్థను సృష్టిస్తున్నాయి" అని ఆయన చెప్పారుభవిష్యత్తులో అంతరిక్షం, సముద్ర కార్యకలాపాల్లో ఏకకాలంలో పురోభివృద్ధి సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేస్తూ, ఈ రెండు రంగాల్లో భారత్ అగ్రగామిగా మారుతుందని మంత్రి ఆకాంక్షించారు. "సముద్ర అంతర్భాగంలోకి ఒక భారతీయున్ని, అంతరిక్షంలోకి మరొకరిని పంపించేందుకు మేం ప్రణాళిక సిద్ధంచేస్తున్నాం. బహుశా 2026 నాటికి ఈ చారిత్రక మైలురాయిని మనం చేరుకోవచ్చు" అని ఆయన ప్రకటించారు. విధానాలకు, శాస్త్రానికి మధ్య సమన్వయాన్ని డా.జితేంద్ర సింగ్ ప్రశంసిస్తూ, అంతరిక్షం, సముద్ర విజ్ఞాన శాస్త్రం లాంటి రంగాల్లో వేగంగా సాధిస్తున్న అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహమే కారణమని అన్నారు.యునెస్కో కేటగిరీ 2 శిక్షణా కేంద్రాన్ని నిర్వహించే ఇన్‌కాయిస్ ద్వారా అంతర్జాతీయ సహకారంలో భారత్ పోషిస్తున్న చురుకైన పాత్రను డా. జితేంద్ర సింగ్ ప్రధానంగా ప్రస్తావించారు. ఇది సామర్థ్య నిర్మాణ కేంద్రంగా, సముద్ర ఆధారిత విపత్తు నిర్వహణలో విజ్ఞానాన్ని పంచుకునే కేంద్రంగా వ్యవహరిస్తుంది. 2030 నాటికి 100 శాతం సునామీని ఎదుర్కొనే సమాజాన్ని సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్న ఓషన్ డికేడ్ సునామీ కార్యక్రమంలో ఇన్‌కాయిస్ పోషిస్తున్న చురుకైన భాగస్వామ్యాన్ని ఆయన గుర్తించారు. "ఇలాంటి కార్యక్రమాల ద్వారా అంతర్జాతీయ భాగస్వామ్యాలను బలోపేతం చేయడం మాత్రమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా స్థిరమైన తీరప్రాంత సమూహాలను ఏర్పాటు చేసేందుకు మార్గం సుగమం చేస్తున్నాం" అని ఆయన పేర్కొన్నారు.వీటికి అదనంగా ఉప్పెనలు, పెద్ద అలలు లాంటి సముద్ర సంబంధిత ప్రమాదాలతో సహా సునామీ హెచ్చరికలను సమగ్ర బహుళ విపత్తు హెచ్చరికల వ్యవస్థగా ఏకీకృతం చేయాల్సిన అవసరం గురించి మంత్రి ప్రధానంగా చర్చించారు. ఈ తరహా కార్యక్రమాలు భారత సునామీ హెచ్చరికల సామర్థ్యాలను మెరుగుపరచడంతో పాటు పెరుగుతున్న సముద్ర విపత్తుల సంక్లిష్టతను పరిష్కరిస్తుంది. "ఇలా ముందుచూపుతో వ్యవహరించే విధానం, భవిష్యత్తులో ఎదురయ్యే విపత్తుల నుంచి ప్రాణాలను, జీవనోపాధి వ్యవస్థలను రక్షిస్తుంది" అని ఆయన వివరించారు.2047 భారత్ లక్ష్యంలో ఇన్‌కాయిస్ ముఖ్య పాత్ర పోషిస్తుందని మంత్రి ప్రసంగాన్ని ముగించారు. "నిరుపయోగంగా ఉన్న వనరులను అన్వేషించి, విపత్తులను ఎదుర్కొనేందుకు సంసిద్ధమవడం ద్వారా స్వావలంబన సాధించిన, స్థిరమైన భారత్ ను నిర్మించడంలో ఇన్‌కాయిస్ కీలకపాత్ర పోషిస్తుంది" అని స్పష్టం చేశారు.భౌగోళిక శాస్త్ర మంత్రిత్వ శాఖ కార్యదర్శి డా.ఎం. రవిచంద్రన్, ప్రముఖ శాస్త్రవేత్తలు, విధాన రూపకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇది సమగ్ర, స్థిరమైన అభివృద్ధికి మార్గం నిర్దేశిస్తూనే, రెండు దశాబ్దాలుగా సాధించిన విజయాలను జరుపుకోవడానికి వేదికగా ఈ కార్యక్రమం నిలిచింది.

# సంపాదకీయం..

## దర్యాప్తు సంస్థలను బలోపేతం చేయాలి !

కేంద్ర దర్యాప్తు సంస్థలు సిబిఐ, ఇడిలను బలోపేతం చేయడంతో పాటు నిజాయితీగా పనిచేసే సంస్థలుగా తీర్చిదిద్దాల్సి ఉంది. మెరికలైన అధికారులను వీటికి కేటాయించాలి. ఎలాంటి కేసునైనా ఛేదించి ఫలితం చూపేలా తయారు చేయాలి. దేశంలో అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారి గుండెల్లో రైళ్లు పరుగెత్తిం చాల్సి అవసరం ఉంది. కానీ ఇప్పుడు రాజకీయ పార్టీలకు ఇడి, సిబిఐలు అంటే భయం లేకుండా పోయాయి. వీటి సమర్థతపై ఉన్న అనుమానాలే దీనికి కారణమని వేరుగా చెప్పనక్కరలేదు. ఈ విషయంలో మోడీ ప్రభుత్వం చిత్తశుద్ధిని చాటుకోవాల్సి ఉంది. కేవలం రాజకీయ కక్ష తీర్చుకునేందుకు వీటిని ఉపయోగిస్తున్నారన్న ఆరోపణల నుంచి బయటపడాలి. ఇప్పటివరకు ఏ ఒక్క కేసులోనూ నిగ్గు తేల్చిన దాఖలాలు లేవు. మద్యం కేసు కావచ్చు..ఇతర అవినీతి కేసులు కావచ్చూ..ఏవీ ముందకు సాగడం లేదు. అంతెందుకు వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసును ఆరేళ్లయినా నిగ్గు తేల్చలేదు. అందుకే దర్యాప్తు సంస్థల ప్రతిష్టను పెంచేందుకు చిత్తశుద్ధితో పనిచేయాలి. ఇకపోతే ఢిల్లీ ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ విమర్శలకు పదను పెడుతున్నారు. బిజెపికి కేజ్రీవాల్ సవాళ్లు విసురుతున్నారు. ఇదే క్రమంలో ఢిల్లీ సిఎం అతిషిపైనా కేసులు తప్పకపోవచ్చన్న ప్రకటన చేశారు. బిజెపి కేసులతో లొంగదీసుకోవాలని చూస్తోందని మండిపడ్డారు. నిజానికి బిజెపి ముందు ఇప్పుడు ఢిల్లీ ఎన్నికలు తప్ప మరో ఎన్నిక లేదని చెప్పాలి. ఢిల్లీలో మరోమారు అధికారం కోసం కేజ్రీవాల్ చెమటోడుస్తున్నారు. అయితే గతంతో పోలిస్తే అంత సులభంగా విజయం దక్కక పోవచ్చు. ఆప్‌కు చెందిన అనేకులు పార్టీని వీడి బిజెపిలో చేరారు. అయితే రాజకీయ ప్రత్యర్థులను వేధించడమే లక్ష్యంగా మోడీ సర్కారు కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేయడానికి బరితెగిస్తోందన్న విమర్శలు వస్తున్నాయి. తమకు అనుకూలంగా ఉన్నవారిని ఒక రకంగా లేనివారిని మరో రకంగా చూస్తున్నారు. జగన్, కెసిఆర్ విషయంలో మాత్రం బిజెపి ఎందుకనో వెనకడుగు వేసింది. ఈ ఇద్దరిపైనా అవినీతి ఆరోపణలు చేసినా, పెద్దగా పట్టించుకోలేదు. ఇప్పటికీ బిఆర్ఎస్‌తో లోపాయకారి అవగాహన ఉందన్న ప్రచారం ఉంది. ఇక్కడ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎండగట్టడంతో పాటు, తెలంగాణలో ఓ ప్రాంతీయ పార్టీ అవసరం ఉందని బిజెపి గుర్తించివుంటుంది. అందుకే బిఆర్ఎస్ అవినీతిపై మాట్లాడినా పెద్దగా పట్టించుకోవడం లేదు. కవిత విసయంలో కూడా కేసు పెద్దగా బలంగా లేదన్న వాదనలు ఉన్నాయి. ఈ కేసులో కేజ్రీవాల్, కవితలు ఇద్దరూ బెయిల్‌పై బయలకు వచ్చారు. అందుకే గత కెస్ ప్రభుత్వంపై వచ్చిన అవినీతి ఆరోపణలపై బిజెపి నేతలు స్పందించడం లేదు. జగన్ లోపాయకారిగా బిజెపికి అనుకూలంగా ఉన్నాడని విమర్శలు ఉన్నాయి. తెలంగాణలో కూడా కెసిఆర్ అనుకూలంగా ఉన్నందువల్లే ఆయనపైనా ఈగ వాలనీయడంలేదని అంటున్నారు. ఈ విషయమై ఎన్ని విమర్శలు చేసినా కేంద్ర ప్రభుత్వ వైఖరిలో నామమాత్రపు మార్పు కూడా కనిపించడంలేదు. గతంలో విపక్షాలపై అదేపనిగా కేసులు పెట్టడంతో ప్రతిపక్షాలన్నీ కలిసి మూకుమ్మడిగా అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సి వచ్చింది. ఇడి, సిబిఐ వంటి సంస్థలను తమ జేబు సంస్థలుగానే మోడీ ప్రభుత్వం భావిస్తోందని ఇండియా కూటమి బాహాటంగానే విమర్శిస్తోంది. ప్రతిపక్షనేతలను నయానో, భయానో లొంగదీసుకోవడానికి, అలా లొంగని వారిని కేసులతో వేధించడానికి ఆ సంస్థలను దుర్వినియోగ పరుస్తున్న తీరుపై రాజకీయ పార్టీలో ఆందోళన చెందుతున్నాయి. జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను కేసుల్లో ఇరికించినా ఆయన మళ్లీ అధికారం చేపట్టగలిగారు. బిజెపి నిరంకుశ పోకడలకు వ్యతిరేకంగా గట్టిగా పోరాడుతున్నందునే ఇడిని ఉపయోగించి కేసులు పెడుతున్నారని ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ ఎప్పటినుంచో ఆరోపిస్తోంది. దేశ రాజధాని ఢిల్లీలోనూ ఇదే స్థితి. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, ఆప్ అధ్యక్షుడు కేజ్రివాల్‌తో పాటు ఆ పార్టీకి చెందిన పలువురు నాయకులు ఇడి బాధితులుగా మారడానికి కారకులెవరో అందరికీ తెలిసిందే. ఇలా చెప్పుకుంటూ పోతే బిజెపి దుర్నీతికి, దుర్వినియోగానికి ఉదాహరణాలెన్నో! 2014వ సంవత్సరంలో నరేంద్రమోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుండి గత ఏడాది జనవరి వరకు దేశ వ్యాప్తంగా 121 మంది రాజకీయ నేతలపై ఇడి కేసులు పెట్టి విచారణ చేపట్టింది. వీరిలో 115 మంది అంటే 95 శాతం మంది ప్రత్యర్థి రాజకీయ పార్టీలకు చెంది, బిజెపిని గట్టిగా వ్యతిరేకించే వారే కావడం గమనార్హం. ఇలా కేసులు నమోదైన వారు బిజెపిలో చేరితే వెంటనే వారిపై నమోదైన కేసులను ఎత్తివేయడం, వారిలో కొందరికి ప్రభుత్వ పదవులను సైతం కట్టబెట్టడం మోడీ సర్కారు బరితెగింపునకు మరో నిదర్శనం. మరోవైపు ఇడి కేసుల్లో నేరం రుజువై శిక్షపడినవి చాలా తక్కువ. అధికారిక లెక్కల ప్రకారం 2011 నుండి ఇడి 1600 కేసులు నమోదు చేసి, 1800 దాడులను ఇడి నిర్వహించింది. అయినా, భయపడుతున్నారంటే ఇతర దర్యాప్తు సంస్థలకు లేని ప్రత్యేక అధికారాలు ఇడి కి ఉండటమే కారణం. ముఖ్యంగా న్యాయస్థానాల అనుమతి లేకుండానే ఆస్తులు జప్తు చేసే అధికారం ఒక సారి కేసు నమోదైతే నేరం చేయలేదని రుజువు చేసుకునే బాధ్యత నిందితునిపైనే మోపడం వంటి అధికారాలను ఇ.డి కి అప్పగించారు. ప్రస్తుత పార్లమెంటులోని ప్రతిపక్ష సభ్యుల్లో దాదాపు 90 శాతం మంది ఏదో ఒక కేంద్ర దర్యాప్తు సంస్థ నిఘానీడలో ఉన్నట్లు ఇటీవల విడుదలైన ఒక నివేదిక పేర్కొంది. తీవ్ర స్థాయిలో జరుగుతున్న ఈ అధికార దుర్వినియోగాన్ని అరికట్టి, దర్యాప్తు సంస్థల నిష్పాక్షికతపై ప్రజానీకంలో తిరిగి నమ్మకం కలిగించాల్సి ఉంది. దర్యాప్తు సంస్థలకు స్వయం ప్రతిపత్తి మాత్రమే దీనికి పరిష్కారం. ఇలా చేయడం వల్ల నిజంగానే తప్పులు చేసిన వారి భరతం పట్టవచ్చు.

---

### నల్గొండ జిల్లాలో ఫ్లోరోసిస్ శాశ్వత పరిష్కారం కొరకు శ్రీశైలం ఎడమగట్టు సొరంగం పూర్తిచేసి

# డిండి ఎత్తిపోతల ద్వారా సాగునీరు అందించాలి



నల్గొండ జిల్లాలో ఫ్లోరోసిస్ సమస్య శాశ్వత పరిష్కారం కావాలంటే కృష్ణానది జలాలు త్రాగునీరు మరియు సాగునీరు అందించినప్పుడే ఫ్లోరోసిస్ సమస్య శాశ్వతంగా పరిష్కారం అవుతుంది. గత 35 సంవత్సరాలుగా నల్గొండ జిల్లాలో ఫ్లోరోసిస్ సమస్య శాశ్వత పరిష్కారం కొరకు ఫ్లోరోసిస్ విముక్తి పోరాట సమితి ఆధ్వర్యంలో అనేక పోరాటాలు చేస్తూ ఎన్నోవేదికల ద్వార ప్రజాచైతన్య కార్యక్రమాలు చేయడమే కాకుండా కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెస్తూన్నది. శ్రీశైలం ఏడమకాలువ ద్వారా సొరంగం తోవ్వి నల్గొండ జిల్లాకు బువ్వ పెట్టు నల్లగొండ బిడ్డలం నేరమేమీ చేసినాము నదుల నీళ్లకు నోచుకోని పాపమేమి చేసినాము . అనే నినాదంతో గతఆరేడు దశాబ్దాల నుంచి కొనసాగుతూ వస్తుంది. 1980లో అప్పటి ముఖ్యమంత్రి టి. అంజయ్య అలియాస్ తాళ్ల రామకృష్ణారెడ్డి శంకుస్థాపన చేసినారు అదేవిధంగా నందమూరి తారక రామారావు, వైయస్ రాజశేఖర్ రెడ్డి , కోట్ల విజయభాస్కర్ రెడ్డి నేదురుమిల్లి జనార్దన్ రెడ్డి కొనుగేటి రోశయ్య శంకుస్థాపనలు చేసినారు. నేటికీ సొరంగం ఉత్సవ విగ్రహం లాగా మిగిలిపోయింది. రాష్ట్రాలు మారినై ఎందరో ముఖ్యమంత్రులు మారినారు కొందరు ముఖ్యమంత్రులు కాలగర్భంలో కలిసిపోయినారు. సొరంగము నేటికి పూర్తికాక ఉత్సవ విగ్రహం లాగా మిగిలిపోయింది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమ నాయకులు తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు అయినా తర్వాత కల్వకుంట్ల చంద్రశేఖర రావు ముఖ్యమంత్రి డిండి ఎత్తిపోతల ద్వారా గొట్టిముక్కుల ,కిష్టరాయన్ పెల్లి మరియు శివన్నగూడెం ప్రాజెక్టుల ద్వారా దేవరకొండ మరియు మునుగోడు నియోజకవర్గాలలోని మూడులక్షల యాభై వేయిల ఎకరాలకు సాగునీరు అందించుట కొరకు తేది 12-07-2015 రోజున శివన్నగూడలో శంకుస్థాపన చేశారు. రెండు సంవత్సరాల్లో ఈ ప్రాజెక్టులను పూర్తిచేయాలని టెండర్లు పిలిచినారు. రాఘవ కన్స్టక్షన్ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇప్పటి మంత్రివర్యులు టెండర్ దక్కించుకున్నారు. రెండు సంవత్సరాలలో పూర్తి చేయలేక పోయినారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చింది. దక్షిణ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రాజెక్టును పూర్తి చేసి సాగునీరు త్రాగునీరు అంటించినట్లయితే ఈ సమస్య శాశ్వతంగా పరిష్కారం అవుతుంది. మిషన్ భగీరద పైలాన్ చౌటుప్పల్ మండల కేంద్రంలో ఏర్పాటుచేసి మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి త్రాగునీరు అందిస్తున్నారు. దీని ద్వారా కొంత ఉపశమనం జరుగుతుంది. మిషన్ భగీరథ ద్వారా త్రాగునీరు అందిస్తున్నప్పటికీ నల్గొండ జిల్లాలో వ్యవసాయం మొత్తము భూగర్భ జలాలమీద ఆధారపడి ఉంది. నల్గొండ జిల్లాలో వాల్టా చట్టం ప్రకారము పర్మిషన్ తీసుకున్న రైతులు 25 లక్షల బోర్లు వేసినారు. బోళ్ల ద్వారా వ్యవసాయం చేస్తూఉన్నారు ఫ్లోరైడ్ నీటి ద్వారా పంటలు పండించడంతో ఆహారం ద్వారా కూడా ఫ్లోరోసిస్ వ్యాధి సంక్రమిస్తుంది . ప్రభుత్వాలు ఎన్ని సర్వేలు చేసినా ఎన్ని ప్రభుత్వాలు మారినా శాశ్వత పరిష్కారము త్రాగునీరు సాగునీరు అందించినట్లయితే నల్గొండ జిల్లాలో ఉన్న ఫ్లోరోసిస్ సమస్య శాశ్వతంగా పరిష్కారం అవుతుంది. మిషన్ భగీరథ ద్వారా కృష్ణానది నీళ్లు ఇంటింటికీ నల్గొండ జిల్లాలో 10 సంవత్సరాలుగా ఇస్తున్నారు. కాబట్టి ఉమ్మడి నల్గొండ జిల్లాలో 3477 ఆవాసాలు ఉన్నాయి మొత్తం సర్వే చేయాలని కలెక్టర్ గారికి విజ్ఞప్తి చేస్తున్నాను. ఫ్లోరోసిస్ సమస్యను ఓటు బ్యాంకుతో కాకుండా సమస్య గుర్తించి ఆలోచించి సత్వరపరిష్కారం చేసినట్లయితే సమస్య నల్గొండ జిల్లా నుండి విముక్తి అవుతుంది. అంతిమంగా ప్రభుత్వాలు అన్ని డిపార్ట్మెంట్ల ద్వారా పూర్తిసమాచారం సేకరించి నల్గొండ డిక్లరేషన్ చేయవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది. పోరాటాల ఖిల్లా నల్గొండ జిల్లాలో మొత్తం కాంగ్రెస్ పార్టీ నాయకులనే గెలిపించుకున్నారు. వారు అధికారంలో ఉన్నారు చిత్తశుద్ధితో పనిచేస్తే ఎప్పుడోఈ సమస్య శాశ్వతంగా పరిష్కారం అయ్యి ఉండేది. నల్గొండ జిల్లా నాయకులు చిత్తశుద్ధితో ఆలోచించాలి దక్షిణ తెలంగాణ ప్రాంతం వెనుకబాటు కారణం కూడా ఫ్లోరోసిస్ సమస్య ప్రధానమైనది దీనిపైన దృష్టి సాదించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాము.

**మిషన్ భగీరథ ద్వారా నల్గొండ జిల్లా లోని అన్ని గ్రామాలకు కృష్ణానది జలాలను క్రమంతప్పకుండా త్రాగునీరు అందించాలి.**

**ఫ్లోరోసిస్ సమస్య శాశ్వతపరిష్కారం కొరకు కృష్ణానది జలాలను త్రాగునీరు మరియు సాగునీరు అందించాలి.**

**ఉమ్మడి నల్గొండ జిల్లాలో 3477 ఆవాసాలు ఉన్నాయి అన్ని ఆవాసాల లో సర్వే చేసి ఫ్లోరోసిస్ వ్యాధి కస్తులను గుర్తించి సదరం సర్టిఫికెట్ ఇవ్వాలి.**

**ప్రతి అంగనవాడి సెంటర్ విద్యార్థులకు అదేవిధంగా పాఠశాలలోని విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి.**

**ఫ్లోరోసిస్ వ్యాధిగ్రస్తులకు ప్రత్యేకమైన 30% వికలాత్వం ఉన్న ఫ్లోరోసిస్ వ్యాధి సోకిన వారికి పింఛన్లు 15 వేల రూపాయల వరకు అందించాలి.**

**ఫ్లోరోసిస్ వ్యాధిగ్రస్తులకు ఇందిరమ్మ గృహాల కింద పక్కా ఇల్లు మంజూరు చేయాలి.**

**శ్రీశైలం ఎడమకాలువ స్వరంగం పూర్తిచేసి డిండి ఎత్తిపోతల ద్వారా గొట్టిముక్కుల కృష్ణరాయన్ పెల్లి మరియు శివన్నగూడెం ప్రాజెక్టుల ద్వారా మునుగోడు మరియు దేవరకొండ నియోజకవర్గాలలోని 3,50,000 ఎకరాలకు సాగునీరు అందించాలి.**

**ఫ్లోరోసిస్ వికలాంగులకు ప్రభుత్వ ఖర్చుల చేత వైద్య పరీక్షలు మరియు ట్రీట్మెంట్ చేయించాలి.**

**శివన్నగూడెం మరియు కిష్టరాయనపల్లి ప్రాజెక్టుల భూనిర్వాసితులను వెంటనే ప్రభుత్వం ఆర్ఎన్ఆర్ ప్యాకేజ్ కింద ఆదుకోవాలి.**

**నల్గొండ జిల్లాలో వున్న అన్నీ ప్యూరిఫైయర్ వాటర్ ఫిల్టర్లను మూసివేయాలని ఫ్లోరోసిస్ విముక్తి పోరాడు సమితి డిమాండ్ చేస్తుంది.**



**డాక్టర్ కంచుకట్ల సుభాష్**
రాష్ట్ర కన్వీనర్ ఫ్లోరోసిస్ విముక్తి పోరాట సమితి
తెలంగాణ రాష్ట్రం.
(9440829506,7702576204)

---

# మహాకుంభమేళాకు భారీగా ఏర్పాట్లు

- ముఖ్య అతిథుల కోసం ప్రత్యేకంగా విభాగాలు
- అడర్ టన్నెట్ డ్రోన్లతో ప్రమాదాల నివారణ చర్యలు

**అలహాబాద్,డిసెంబర్26 వెలుతురు:**



మహాకుంభమేళ.. 12 ఏళ్లకు నిర్వహించే వేడుక. సాధువులు, భక్తులు, పర్యాటకులు భారీగా కుంభమేళాకు తరలివస్తారు. ఈసారి 45 కోట్ల మంది రావచ్చనే అంచనాల మేరకు యూపి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. .అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లపై దృష్టి పెట్టింది. ఈ వేడుకను విజయవంతం చేసేందుకు ఈసారి విరివిగా ఆధునిక టెక్నాలజీని వాడుతున్నారు. జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు ప్రయాగ్ రాజ్‌లో జరిగే మహాకుంభమేళాకు ఉత్తరప్రదేశ్ సర్కార్ పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది. ప్రత్యేకంగా హైఎండ్ టెక్నాలజీని వాడుతున్నారు. అండర్ వాటర్ డ్రోన్లను అందుబాటులోకి తెస్తున్నారు. సీసీ కెమెరా నిఘా నేత్రాలు ఎటూ వుంటాయి. ఐతే ఈసారి సరికొత్తగా అండర్‌వాటర్ డ్రోన్లను వినియోగించబోతున్నారు. ట్రయిల్స్ కూడా నిర్వహించారు.ఎవరైనా నీళ్లలో మునిగిపోతే వెంటనే గుర్తించే వారిని కాపాడేలా అండర్ వాటర్ డ్రోన్లను వినియోగంలోకి తెస్తున్నారు. ఇప్పటికే ప్రయాగ్‌రాజ్‌లో పర్యాటకుల వసతి సహా భద్రత కోసం పకడ్బందీ ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తలెత్తకుండా .. మహాకుంభమేళ-2025ని విజయవంతం చేసేలా చర్యలు చేపడుతున్నారు అధికారులు.ప్రయాగ్‌రాజ్‌లో నిర్వహించనున్న మహా కుంభ మేళా 2025 సందర్భంగా భారతదేశం నుంచి మాత్రమే కాదు విదేశాల నుంచి కూడా లక్షలాది మంది భక్తులు అలాగే భారీ సంఖ్యలో సెలబ్రేటీలు పాల్గొనే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ప్రయాగ్‌రాజ్ ఫెయిర్ అథారిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఈ మహా కుంభమేళాలో పాల్గొనే ప్రముఖులందరికీ ఆహ్లాదకరమైన అనుభూతిని అందించడానికి, వారి బస, ఇతర ప్రోటోకాల్‌లకు సంబంధించిన సౌకర్యాలు కల్పించడానికి సన్నాహాలు చేయబడ్డాయి. మహాకుంభమేళా 2025 మొదటి ప్రధాన స్నానోత్సవం (పుష్య మాసం పౌర్ణమి) నుండి అంటే 13 జనవరి 2025న ప్రారంభమవుతుంది. చివరి ప్రధాన స్నానోత్సవం (మహాశివరాత్రి) 26 ఫిబ్రవరి 2025న జరగనుంది. ఈ మహా కుంభ మేళాను మొత్తం 45 రోజుల పాటు నిర్వహించనున్నారు.మహా కుంభమేళా జరిగే సమయంలో యాత్రికులు, పర్యాటకులు, భారతదేశం, విదేశాల నుంచి ప్రముఖులు, సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు వస్తారు. జాతర ప్రాంతంలో విశిష్ట/అతి విశిష్ట వ్యక్తుల రాక సమయంలో సౌలభ్యం కోసం, 24 గంటల పాటు అందుబాటులో ఉండేలా కంట్రోల్ రూం ఏర్పాటు చేయబడింది. ఇక్కడ అధికారులు, ఉద్యోగులు మోహరించనున్నారు. జాతరకు వచ్చే ప్రముఖుల ప్రోటోకాల్ ఏర్పాట్ల కోసం ప్రభుత్వ స్థాయిలో ముగ్గురు అదనపు జిల్లా మెజిస్ట్రేట్లు, ముగ్గురు డిప్యూటీ జిల్లా మెజిస్ట్రేట్లు, ముగ్గురు నాయబ్ తహసీల్దార్లు, నలుగురు అకౌంటెంట్లను నియమించారు. దీనితో పాటు డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారులను మొత్తం 25 సెక్టార్‌లలో సెక్టార్ మేజిస్ట్రేట్‌లుగా నియమించారు. వారు వారి సంబంధిత రంగాలలో ప్రోటోకాల్ ఏర్పాట్లను నిర్ధారిస్తారు. ప్రత్యేక ప్రముఖులకు ప్రోటోకాల్ ప్రకారం మహా కుంభ మేళా -2025 సందర్భంగా 50 మంది టూరిస్ట్ గైడ్‌లను , ఇతర సహాయక సిబ్బందిని నియమించడం కూడా జరుగుతుంది. జాతరకు వచ్చే ప్రముఖులకు వసతి సౌకర్యాలు కల్పించేందుకు జాతర ప్రాంతంలో ఐదు చోట్ల 250 టెంట్ల సామర్థ్యంతో సర్క్యూట్ హౌస్ లను ఏర్పాటు చేశారు. జాతరకు వచ్చే విశిష్ట, అతి విశిష్ట ప్రముఖుల సౌకర్యార్థం టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా 110 కాటేజీలతో కూడిన టెంట్ సిటీ, ఉత్తరప్రదేశ్ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో అభివృద్ధి చేస్తున్నారు. 2200 కాటేజీలతో టెంట్ సిటీని అభివృద్ధి చేస్తున్నారు. దీని బుకింగ్ ప్రయాగ్‌రాజ్ ఫెయిర్ అథారిటీ ద్వారా చేయబడుతుంది. దీనిని వెబ్‌సైట్ ద్వారా నావిగేట్ చేయవచ్చు. నదిలో స్నానానికి ఘాట్ సిద్ధం చేయడమే కాదు.. జెట్టీ, మోటారు బోటు సౌకర్యం కల్పించనున్నారు. జాతర ప్రాంతంలో కేంద్ర ప్రభుత్వానికి చెందిన మొత్తం 15 శాఖలు తమ సొంత శిబిరాలను నిర్మించుకున్నాయి, వీటిలో శాఖల అధికారులు రాక బస చేసేందుకు కాటేజీలు ఏర్పాటు చేశారు. అదేవిధంగా ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి చెందిన మొత్తం 21 శాఖలు జాతర ప్రాంతంలో తమ సొంత శిబిరాలను ఏర్పాటు చేశాయి, అందులో డిపార్ట్‌మెంటల్ అధికారులు వచ్చే సమయంలో బస చేసేందుకు కాటేజీలు ఏర్పాటు చేశారు. అంతేకాదు జిల్లా పరిపాలన అధికారులు ప్రయాగ్‌రాజ్‌లో అందుబాటులో ఉన్న 21 అతిథి గృహాలలో వీఐపీలు వసతి కోసం మొత్తం 314 గదులను ఏర్పాటు చేశారు.

## నమ్మిన సిద్ధాంతం కోసం పనిచేసిన నాయకుడు వంగవీటి మోహన రంగా...

● మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత రావు



**కూకట్ పల్లి డిసెంబర్ 26 వెలుతురు:**
నమ్మిన సిద్ధాంతం కోసం పనిచేసిన ప్రజా నాయకుడు దివంగత నేత వంగవీటి మోహన రంగా అని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత రావు అన్నారు. గురువారం మోహన రంగా వర్ధంతి సందర్భంగా కూకట్ పల్లి హౌసింగ్ బోర్డ్ కాలనీ లోని టెంపుల్ బస్ స్టాప్ లో కాపు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వర్ధంతి వేడుకలకు ఆయన హాజరై మోహన రంగా విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సందర్భంగా మైనంపల్లి మాట్లాడుతూ నాయకుడంటే నమ్మిన వారికి, ప్రజలకు కష్ట, సుఖాలలో వెన్నంటి ఉన్నవారే నాయకులని ఆ కోవలో మోహన రంగా ముందు వరుసలో ఉంటారన్నారు. బడుగు బలహీన వర్గాల నాయకున్ని ప్రజలు అభిమానులు నాయకులు ఎప్పటికీ మరువ లేరని అన్నారు. సూర్యచంద్రులు ఉన్నంత వరకు వంగవీటి మోహన రంగా ప్రజల్లో నిలిచి ఉంటారన్నారు. ఆయన రాజకీయ జీవితం పేద ప్రజల అభ్యున్నతికి, పేదల జీవితాల్లో వెలుగు నింపేందుకు కృషి చేశారని కొనియాడారు.ఆయన ధైర్యానికి, సాహసానికి నిలువెత్తు సాక్ష్యం అన్నారు. ఈ తరం నాయకులు రంగాను ఆదర్శంగా తీసుకుని ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి, బి. బ్లాకు అధ్యక్షులు తూము వేణు, కమిటీ సభ్యులు భరత్, ఎల్ రాజా, డి రంగారావు, గంధం రాజు, ప్రవీణ్ కుమార్, ఫణీంద్ర కుమార్, రేష్మ, నితీష్ గౌడ్, గిరి నాయుడు, శ్రీధర్ చారి, తదితరులు పాల్గొన్నారు.

## శివరామ్ మిత్రమండలి ఆధ్వర్యంలో ఘనంగా సీనియర్ జర్నలిస్ట్ శివరామ్ వర్ధంతి వేడుకలు...



**కూకట్ పల్లి డిసెంబర్ 26 వెలుతురు:**
సీనియర్ జర్నలిస్ట్ శివరామ్ ఐదవ వర్ధంతి సందర్భంగా శివరామ్ మిత్ర మండలి వారి ఆధ్వర్యంలో శ్రద్ధాంజలి ఘటించి గురువారం మయూరి లేఅవుట్ ఆశ్రయ ఓల్డ్ ఏజ్ హోమ్ లోని అనాధ పిల్లలు, వృద్ధులకు పండ్లు, చిన్నారులకు పాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శివరామ్ మిత్రమండలి మిత్రబృందం మాట్లాడుతూ మా మిత్రుడు సీనియర్ జర్నలిస్టు శివరామ్ అకాల మరణం పొంది మా మధ్య లేకపోవడం చాలా దురదృష్టకరమని వారిని మేము చాలా మిస్ అవుతున్నామన్నారు. అన్నా అని పిలిస్తే నేనున్నానని మా వెంట నిలబడి మాకు సహాయ సహకారాలు అందిస్తూ ఎపుడూ చిరునవ్వుతో మమ్మల్ని పలకరించే శివ ఈరోజు మా మధ్య లేకపోవడం మాకు చాలా బాధాకరంగా ఉందని ఇప్పటికి ఐదు సంవత్సరాలు అయినా వారు ఇంకా మా కళ్ళముందే ఉన్నట్లు అనిపిస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. శివ ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతున్ని మనసారా ప్రార్థిస్తున్నామన్నారు . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గుంటుపల్లి వేదిక్, శివరాం మిత్రమండలి అధ్యక్షుడు గుంటుపల్లి వంశీకృష్ణ, సోదరుడు శ్రీనివాస్, నేలపాటి కరుణాకర్, కోటపాటి రమేష్, సోమేపల్లి ఆదినారాయణ, మక్కెన వెంకట్రావు, అక్కినేని సుధాకర్, రాజాచౌదరి కాళపనేని, వెంకట్రావు కొమ్మినేని తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజ్ సంక్షేమ సంఘం అధ్యక్షునిగా ఆకుల నరేందర్...



**కూకట్ పల్లి డిసెంబర్ 26 వెలుతురు:**
బాలానగర్ డివిజన్ ముదిరాజ్ సంక్షేమ సంఘం అధ్యక్షునిగా ఆకుల నరేందర్ ముదిరాజ్ ఎన్నికయ్యారు. అధ్యక్ష పదవి కోసం పోటీ పడుతున్న వారిలో ఆకుల నరేందర్ ముదిరాజ్, పంజా రామచందర్ ముదిరాజ్, మురళీ ముదిరాజ్ ఉన్నారు. మొదట ఈ ముగ్గురిలో ఎవరినైనా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం కోసం ప్రయత్నాలు చేయగా ఎవరికీ సఖ్యత కుదరక ఎన్నిక అనివార్యం అయింది. చివరకు పంజా రామచందర్ ముదిరాజ్, మురళీ ముదిరాజ్ మీద పోటీ పడి ఆకుల నరేందర్ ముదిరాజ్ విజయం సాధించారు. వర్కింగ్ ప్రెసిడెంట్ గా బాలింగ్ రాము ముదిరాజ్ ను నియమించారు. ప్రధాన కార్యదర్శిగా పి.రాజు, కోశాధికారిగా విజేందర్ కుమార్ నియమించబడ్డారు. మహిళా ముదిరాజ్ విభాగానికి అధ్యక్షురాలిగా కళకుంట్ల స్వాతి, వర్కింగ్ ప్రెసిడెంట్ గుట్ట తులసి, ప్రధాన కార్యదర్శిగా మునగాల సోని నియమించబడ్డారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ ముదిరాజ్ ల ఐక్యత సంక్షేమానికి కృషి చేస్తానని అన్నారు. అందరినీ కలుపుకుంటూ సంఘం అభివృధికి కృషి చేస్తానని తెలిపారు.

## సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ శ్రేణులు..



**కూకట్ పల్లి డిసెంబర్ 26 వెలుతురు:**
తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేంద్ర రెడ్డి జన్మదినం సందర్బంగా రేవంత్ రెడ్డి సైన్యం వ్యవస్థపాక అధ్యక్షులు పి. ఆర్ నాయుడు ఆధ్వర్యంలో కెపిహెచ్బి కాలనీ రమ్య గ్రౌండ్ వద్ద కాంగ్రెస్ శ్రేణులు ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేసి కేక్ కట్ చేసి అనంతరం వేం నరేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాన్ని అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నళిని కాంత్, మణి గౌడ్, లడ్డు సాయి, కెపిహెచ్బి డివిజన్ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రంగస్వామి, కార్యదర్శి భార్గవ్, శివ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదల జోలికి వస్తే సహించేది లేదు..

## -ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు..

**కూకట్ పల్లి డిసెంబర్ 24 వెలుతురు:**
నిరుపేదల జోలికి వస్తే సహించే ప్రసక్తే లేదని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బేగంపేట్ శ్యామ్ లాల్ బిల్డింగ్ వరకు ఎన్నో సంవత్సరాలుగా ఫుట్ పాత్ లపై డబ్బాలు ఏర్పరచుకొని జీవనం సాగిస్తున్న నిరుపేదల పట్ల ట్రాఫిక్ పోలీసులు, జిహెచ్ఎంసి అధికారులు కనీస సమయం ఇవ్వకుండా డబ్బాలు తొలగించిన నేపథ్యంలో జిహెచ్ఎంసి అధికారులు, ట్రాఫిక్ పోలీసులు, దౌర్భాగ్యమైన చర్యలపై ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే ట్రాఫిక్ ఏసిపితో ఫోన్ మాట్లాడి రోడ్డుపై వ్యాపారం చేసుకొని బ్రతికే నిరుపేదల జోలికి వస్తే సహించే ప్రసక్తి లేదని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఈ కార్యక్రమంలో బేగంపేట్ డివిజన్ కార్పొరేటర్ మహేశ్వరి శ్రీహరి, డివిజన్ అధ్యక్షుడు సురేష్ కుమార్ యాదవ్, రాజయ్య, మాజీమహిళ అధ్యక్షురాలు లక్ష్మీ, పేపర్ శ్రీను, శ్రీశైలం, ప్రవీణ్, గంగారం, సాయి గౌడ్, బీర సామి, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



## వంగవీటి మోహనరంగా ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి..

## కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్...



**కూకట్ పల్లి డిసెంబర్ 26 వెలుతురు:**
సామాజిక ఉద్యమ వీరుడు, రాజకీయ దురంధరుడు వంగవీటి మోహన రంగా ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. వంగవీటి మోహనరంగా వర్ధంతి సందర్బంగా ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మ బండలో డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ తో కలిసి కూకట్ పల్లి జనసేన పార్టీ కాంటెస్టెంట్ ఎమ్మెల్యే ఎం.ప్రేమ్ కుమార్ రంగా విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ కార్యక్రమంలో భాగంగా కాలనీలోని పేదలకు అరటి పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంగా కేవలం ఒక సామాజికవర్గానికి చెందిన నేత మాత్రమే కాదని, బడుగు బలహీన వర్గాల వెన్నంటి ఉండి వారికి అండగా నిలిచారని తెలిపారు.

పేదల సమస్యల పరిష్కారం కోసం పోరాడిన గొప్ప వ్యక్తిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో శివరాజ్ గౌడ్, భాస్కర్, కె.శంకర్, పోశెట్టిగౌడ్, సత్యనారాయణ, మధు, దొరబాబు, రాంబాబు, చక్రవర్తి, ప్రసాద్, టి.కృష్ణ, శ్రీకృష్ణదేవరాయ కాపు సంఘం సభ్యులు, వంగవీటి రంగా అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## స్వయం ఉపాధి పై దృష్టి సారించాలి..

## - వి. జగదీశ్వర్ గౌడ్...



కూకట్ పల్లి డిసెంబర్ 26 వెలుతురు:
స్వయం ఉపాధి పై యువత దృష్టి సారించాలని శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వి. జగదీశ్వర్ గౌడ్ అన్నారు. కూకట్ పల్లి నియోజకవర్గం కూకట్ పల్లి డివిజన్ లోని బాలకృష్ణ నగర్ లో గురువారం వృద్ధి బంకెట్ హాల్ ప్రారంభంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వి జగదీశ్వర్ గౌడ్, కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వర్ రావు తో కలసి గురువారం పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వృద్ధి బంకెట్ హాల్ నిర్వాహకులు గొట్టిముక్కల గౌతమ్, గుత్తికొండ శంకర్ రావు, గుత్తికొండ మురళి లకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ నేటి యువత ప్రభుత్వం పై ప్రభుత్వ ఉద్యోగాల పై ఆదార పడకుండా స్వయం ఉపాధిని పెంపొందించుకోవాలని అన్నారు.

## బంకెట్ హాల్ ని ప్రారంభించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు...



**కూకట్ పల్లి డిసెంబర్ 26 వెలుతురు:**
నియోజకవర్గం పరిధిలోని కూకట్ పల్లి డివిజన్ లోని వడ్డే పల్లి ఎనక్లేవ్ సమీపంలోని బాలకృష్ణ నగర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన వృద్ధి బంకెట్ హాల్ ని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముఖ్యఅతిథిగా హాజరై గురువారం ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా వృద్ధి బంకెట్ హాల్ నిర్వాహకులకు ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, బంకెట్ హాల్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## పిఆర్ టియుటిఎస్ కూకట్ పల్లి మండల శాఖ క్యాలెండర్ ఆవిష్కరణ...



**కూకట్ పల్లి డిసెంబర్ 26 వెలుతురు:**
పిఆర్ టియుటిఎస్ కూకట్ పల్లి మండల శాఖ క్యాలెండర్ ను కూకట్ పల్లి మండల పిఆర్ టి యుటిఎస్ అధ్యక్షులు వెంకట్ , మండల ప్రధాన కార్యదర్శి విట్టల్ ల ఆధ్వర్యంలో గురువారం మేడ్చల్ జిల్లా అధ్యక్షులు రామేశ్వర్ గౌడ్ , ప్రధాన కార్యదర్శి ఆనంద్ రెడ్డి లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ నరేందర్ గౌడ్ , మండల అసోసియేట్ ప్రెసిడెంట్ నాయని చంద్రశేఖర్, మండల వైస్ ప్రెసిడెంట్ వీరేందర్, జిల్లా కార్యదర్శి ప్రదీప్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ షిరిడి సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్



**కూకట్ పల్లి డిసెంబర్ 26 వెలుతురు:**
ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ ఎన్టీఆర్ నగర్ లో స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ నిర్మించిన శ్రీ షిరిడి సాయిబాబా ఆలయంలో గురువారం సందర్భంగా కార్పొరేటర్ ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కార్పొరేటర్ వ్యక్తిగత సహాయకుడు సందీప్ వాళ్ళ నానమ్మ కొండ్రెడ్డి రత్నం ప్రధమ వర్ధంతి సందర్భంగా వారి జ్ఞాపకార్ధం భక్తులకు అన్నసమరాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, సాయిబాబా భక్తులు, స్థానిక వాసులు తదితరులు పాల్గొన్నారు.

## బిసి పొలిటికల్ జెఎసి వనపర్తి జిల్లా అధ్యక్షునిగా తిరుపతయ్య యాదవ్



**వనపర్తి జిల్లా వెలుతురు డిసెంబర్ 26:**
బిసి పొలిటికల్ జెఎసి వనపర్తి జిల్లా అధ్యక్షునిగా పెబ్బేరు మండలం బునాదిపురం గ్రామానికి చెందిన వనం తిరుపతయ్య యాదవ్ గారిని నియమిస్తూ రాష్ట్ర చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు వనపర్తి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాచాల చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా తిరుపతయ్య యాదవ్ మాట్లాడుతూ బీసీలను చైతన్యం చేసి బీసీల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని, బీసీల రాజ్యాధికారం కోసం పాటు పడతానన్నారు. త్వరలో అన్ని గ్రామ, మండల కమిటీలు వేసి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలకు అభ్యర్థులను సిద్ధం చేస్తామని తెలిపారు. నాపై నమ్మకముంచి జిల్లా బాధ్యత అప్పజెప్పిన స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ గారికి ఈ సందర్బంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిసి పొలిటికల్ జెఎసి రాష్ట్ర కార్యదర్శి వెంకటన్న గౌడ్, కొత్తకోట మండల అధ్యక్షుడు అంజన్న యాదవ్, మదనాపూర్ మండల అధ్యక్షుడు మహేందర్ నాయుడు, రాఘవేందర్ గౌడ్, మ్యాదరి రాజు, దేవర శివ, గౌతమ్ శంకర్, మల్లేష్ యాదవ్, వసంత చారి, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించిన ఎమ్మెల్యే కాలె యాదయ్య

**శంకర్ పల్లి వెలుతురు డిసెంబర్ 26**
శంకర్ పల్లి మండలం కొండకల్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించిన స్థానిక శాసనసభ్యులు కాలే యాదయ్య ఈ సందర్భంగా కొండకల్ గ్రామ ప్రజలు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున ఎమ్మెల్యే కాలే యాదయ్య కి ఘన స్వాగతం పలికి, ర్యాలిని నిర్వహించారు. గ్రామంలోని డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ మరియు ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాలకు పూలమాలలు వేసి, కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కొండకల్ గ్రామానికి చెందిన10 మంది కార్యకర్తలు బిఆర్ఎస్ పార్టీ నుండి ఎమ్మెల్యే కాలే యాదయ్య సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# భారతదేశ గొప్ప విప్లవకారుడు మరియు ధైర్యం ఉన్నవాడు సర్దార్ ఉధమ్ సింగ్ జీ



## కొండ విశ్వేశ్వర్ రెడ్డి చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు



**రాజేంద్రనగర్ వెలుతురు డిసెంబర్ 26:**
గురువారం రోజున భారతదేశ గొప్ప విప్లవకారుడు మరియు ధైర్యం ఉన్నవాడు సర్దార్ ఉధమ్ సింగ్ జీ ఆయన అమరవీరుడైన రోజు నివాళులు అర్పించడం జరిగింది. జలియన్ వాళ్ళ బాగ్ మరణకాండ కు ప్రతీకారం తీర్చుకోవడం కై అతను ధైర్యం మరియు త్యాగం విదేశాల భారతీయుల దేశభక్తిని రగిలించింది ఆయన పోరాటంకు దేశం ఎప్పుడు రుణపడి ఉంటుంది అని కొండ విశ్వేశ్వర్ రెడ్డి చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు శిక్షావన అత్తాపూర్ రాజేందర్ నగర్ గురుద్వారా సందర్శించారు ఆయన ఈ రకంగా చెప్పుకొచ్చారు సర్దార్ ఉధమ్ సింగ్ జీ, అమర్ హై ఈ కార్యక్రమంలో తోకల శ్రీనివాస్ రెడ్డి మల్లారెడ్డి బొక్క బాల్ రెడ్డి కొమురయ్య విజయ్ రాజు పైల్వాన్ ఉపేందర్ గురుప్రీత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు

# జహీరాబాద్ లో ఘనంగా సీపీఐ శత జయంతి ఉత్సవాలు

- **ముఖ్య అతిథిగా హాజరైన సీపీఐ జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాలొద్దిన్**

**జహీరాబాద్ వెలుతురు డిసెంబర్ 26:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని తమ్మడ్ పల్లి భారత్ నగర్ లో గురువారం సీపీఐ డివిజన్ కార్యదర్శి కె.నర్సిములు అధ్యక్షత సీపీఐ 100 సంవత్సరాల శత జయంతి సంబరాలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సీపీఐ జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాలొద్దిన్ పాల్గొని సిపిఐ పార్టీ పతాక ఆవిష్కరించడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ ఎర్ర జండా ప్రజల పక్షాన నిలబడుతూ వారి సమస్యలపై అనునిత్యం పోరాడుతూన్న ఏకైక పార్టీ సిపిఐ పార్టీయే అని పేర్కొన్నారు. గతంలో ఎర్ర జండా ఉద్యమములో కామ్రేడ్ రవి, నారాయణరెడ్డి, కామ్రేడ్ బద్దం ఎల్లారెడ్డి, కామ్రేడ్ ముగ్దమ్ మొయినోద్దీన్, కామ్రేడ్ మంజుర్ హైమద్, కామ్రేడ్ పామ్ పాట్కర్ రామారావు పార్టీ ఆశయాలకు కొరకై అమరులైనారని, వారి బాటలోనే నడుస్తూ ప్రజా సమస్యలపై పోరాడుతామని ఆయన అన్నారు. గతంలో దునేవాడిదే భూమిరా అనే నినాదంతో ముందుకు వెళ్లి ఉద్యమాలు నిర్వహించి ఎంతో మంది అమరులై, ఎంతోమందికి ప్రభుత్వాలతో పోరాటాలు నిర్వహించి భూములు పంచిన ఘనత ఎర్ర జండకే దక్కుతుందని పేర్కొన్నారు. లక్షల ఎకరాల



భూములను పంచి ఇండ్ల స్థలలా కొరకై పోరాటాలు చేసి ఇండ్లస్థలాలు ఇప్పించిన ఘనత ఎర్ర జండాదేనని ఆయన అన్నారు. అందుకని యావత్ ప్రపంచ దేశాలు ఎర్ర జండా సంబురాలు జరుపుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ రోజు సీపీఐ 100 సంవత్సరాల శుభ సందర్భంగా సంగారెడ్డి జిల్లాలో రక్త దానం శిబిరాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. 100 సంవత్సరాల సంబరాల సందర్భంగా సీనియర్ కామ్రేడ్ లక్ష్మరెడ్డి, సయ్యద్ మొయినోద్దీన్, సంగప్ప, సయ్యద్ నవాజ్ అల్లి, సూర్య లకు శాలువలతో సన్మానం చేయడాం జరిగింది. త్వరలో రానున్న జహీరాబాద్ స్థానిక ఎన్నికలో, కౌన్సిల్, ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికల్లో పోటీకి సిద్ధం కావాలని కార్యకర్తలకు ఆయన పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరైయ్యారు.

# కొల్లుర్ గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ బూలక్ష్మమ్మ వారి విగ్రహ ప్రతిష్టాపన..

- పాల్గొన్న ఎమ్మెల్యే మాణిక్ రావు...



**జహీరాబాద్ వెలుతురు డిసెంబర్ 26:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం ఝురాసంఘం మండలం కొల్లుర్ గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ బూలక్ష్మమ్మ వారి విగ్రహ ప్రతిష్టాపన ,అమ్మవారికి బోనాల ఊరేగింపు కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు కొనింటి మాణిక్ రావు పాల్గొని అమ్మ వారికి పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు ఝురాసంఘం మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశం, జహీరాబాద్ మండల పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ, మాజీ మండల పార్టీ అధ్యక్షులు బొగ్గుల సంగమేశ్వర్, గ్రామ మాజీ సర్పంచ్ బస్వరాజ్ పాటిల్, మాజీ సర్పంచ్ లు పరమేష్, కిషన్, నాయకులు డాక్టర్ నాగరాజ్, కొల్లూరు గ్రామ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు నర్సిములు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# అంబుజా సిమెంట్ పరిశ్రమ రద్దయినట్లు ప్రకటించాలి

- **బారి యంత్రాలతో పనులు సాగిస్తే సహించేది లేదు**
- **సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పెంటయ్య**



**రామన్నపేట వెలుతురు న్యూస్ డిసెంబర్ 26**
అంబుజా సిమెంటు కాలుష్య పరిశ్రమను రద్దు చేస్తున్నట్టు ప్రభుత్వం వెంటనే ప్రకటించి రామన్నపేట ప్రాంత ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జల్లెల పెంటయ్య డిమాండ్ చేశారు. సిపిఎం కొమ్మాయిగూడెం గ్రామ శాఖ ఆధ్వర్యంలో పరిశ్రమ ప్రతిపాదిత స్థలం గేటు ముందు నిరసన తెలిపి ఈ సందర్భంగా మాట్లాడుతూ ముక్తకంఠంగా ప్రజలు వ్యతిరేక ధోరణితో అభిప్రాయం చెప్పిన అధికారులు ఇప్పటివరకు పరిశ్రమ రద్దుపై ఎలాంటి ప్రకటన చేయకుండా ప్రజలను గందరగోల పరుస్తున్నారని అన్నారు.గత రెండు రోజుల నుండి పెద్ద ప భారీ యంత్రాలతో, వాహనాలతో పనులు జరుగుతున్నాయి. పరిశ్రమను రద్దు చేస్తున్నట్టు ప్రకటించకుండా పనులు ప్రారంభిస్తే సహించేది లేదని వెంటనే ప్రభుత్వం,ప్రభుత్వ అధికారులు చిత్తశుద్ధితో ప్రజలకు హాని చేసే కాలుష్య పరిశ్రమను రద్దుచేసి ఈ ప్రాంత ప్రజలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో మళ్లీ అన్ని గ్రామాల నుండి ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాఖ కార్యదర్శి శానగొండ వెంకటేశ్వర్లు,మాజీ కార్యదర్శి ఎర్ర కాటమయ్య,నాయకులు అంతటి సత్తయ్య,సాగర్ల శేఖర్, అంతటి నర్సింహా,గుణగంటి మల్లేశం, కల్లూరి జంగయ్య,శానకొండ రామచంద్రం,దావనూరి ప్రశాంత్,రేపాక లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

# బడుగు బలహీనవర్గాల అభివృద్ధి కోసం పరితపించిన నాయకుడు వంగవీటి మోహన రంగా...

## - గాలి బాలాజీ..



**కూకట్ పల్లి డిసెంబర్ 26 వెలుతురు:**
బడుగు బలహీనవర్గాల అభివృద్ధి కోసం పరితపించిన మహా నాయకుడు వంగవీటి మోహనరంగా అని టీపిసిసి కార్యదర్శి, కో ఆప్షన్ సభ్యులు గాలి బాలాజీ అన్నారు. విజయవాడ తూర్పు నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు వంగవీటి మోహనరంగా 36వ వర్ధంతి సందర్భంగా గురువారం కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కెపిహెచ్బి కాలనీ టెంపుల్ బస్ స్టాప్ లో రంగా విగ్రహానికి వారు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గాలి బాలాజీ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు కష్టపడ్డ వ్యక్తి, తన మరణానంతరం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కారణమైన వ్యక్తి, బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి నిరంతరం కృషిచేసిన గొప్ప నాయకుడు ఆని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి కాపు సంఘం అధ్యక్షులు మోటపల్లి భరత్, దాసరి రంగారావు, రంగా మోహన్, శంకర్, పి.అర్ నాయుడు, మణి గౌడ్, లడ్డు సాయి, భార్గవ్, శివ, సతీష్, జనసేన సాయి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా మాట్లాడితే సహించేది లేదు..

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు...



**కూకట్ పల్లి డిసెంబర్ 26 వెలుతురు:**
ఆంధ్ర ప్రాంత ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా మంత్రులు, ఎమ్మెల్యేలు మాట్లాడుతున్నారని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ధ్వజమెత్తారు. గురువారం ఆయన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ స్పీకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ తరగతుల్లో నేర్చుకుంది ఇదేనా అని ప్రశ్నించారు. కనీసం ఏం మాట్లాడుతున్నాం అని విజ్ఞత కోల్పోవడం చాలా దురదృష్టకరమని అన్నారు. సినీ పరిశ్రమ ను చెన్నారెడ్డి తమిళ నాడు నుండి హైదారాబాద్ నగరానికి తీసుకొచ్చారు అని గుర్తు చేశారు. హైద్రాబాద్ మహా నగరంలో సినీ పరిశ్రమ ద్వారా లక్షల మంది ఉపాధి పొందుతున్నారని అందరూ మన బిడ్డలే అని దయచేసి ఆంధ్ర తెలంగాణ అనే భావం తేవద్దు అని హితవు పలికారు. హైదారాబాద్ నగర ప్రజలు ప్రశాంతత కోరుకొంటున్నారని నగర ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఏ పార్టీ ఎమ్మెల్యే అయిన మాట్లాడితే ఊరుకునేది లేదు అని ఎమ్మెల్యే కృష్ణారావు హెచ్చరించారు.

# బడుగుల ఆశాజ్యోతి వంగవీటి మోహనరంగా..

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు..



**కూకట్ పల్లి డిసెంబర్ 26 వెలుతురు:**
పేద, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి వంగవీటి మోహన రంగా అని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. గురువారం రంగా వర్ధంతి సందర్భంగా కెపిహెచ్బి కాలనీ టెంపుల్ బస్ స్టాప్ లోని రంగా విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోహన రంగా ప్రజల మనస్సుల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ శ్రీనివాసరావు, శిరీష్ బాబురావు, నియోజక వర్గం కో ఆర్డినేటర్ సతీష్ అరోరా, రంగమోహన్, కూకట్ పల్లి కాపు సంఘము అధ్యక్షుడు యం. భరత్ కుమార్ , పులి మురళి, వల వల నాయుడు, బాలాజీ, నాగేశ్వరావు, పాపారావు , పున్నారావు పార్టీ సీనియర్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీలో ఉత్తమ ఉద్యోగులకు ప్రగతి చక్రం పురస్కారాలు..



**జహీరాబాద్ వెలుతురు డిసెంబర్ 26:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ఆర్టీసీ డిపో నందు గురువారం స్థానిక డిపో మేనేజర్ జాకిర్ హుస్సేన్ ఆధ్వర్యంలో ప్రగతి చక్రం పురస్కారాల అవార్డు ఫంక్షన్ నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో భాగంగా విధులలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసా పత్రాలతో పాటు నగదు పురస్కారం ఇచ్చి సత్కరించడం జరిగింది. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి మొదటి బహుమతిగా 8 వందల రూపాయలు, రెండవ బహుమతిగా 6 వందల రూపాయలు, మూడవ బహుమతిగా 4 వందల రూపాయలు నగదు అవార్డు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ జాకిర్ హుస్సేన్ తోపాటు అసిస్టెంట్ ఇంజనీర్ (ఎం ) తిరుమలేష్, డిసి (ఈ ) గంగమణి, ఏడిసి బుకింగ్ రాజు, పలువురు ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

# అబ్దుల్లా పూర్ మెట్ లో సీపీఐ ఆవిర్భావదినోత్సవం





హయత్ నగర్ జాతీయ రహదారిపై సీపీఐ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు, పార్టీ వందవ వార్షికోత్సవం సందర్భంగా పార్టీ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు,

**వెలుతురు, అబ్దుల్లా పూర్ మెట్, డిసెంబర్ 26:**
భారత కమ్యూనిస్టు పార్టీ వందవ ఆవిర్భావదినోత్సవంసందర్భంగా మెట్ ప్రభుత్వ ( జన్నరుమ్)కాలనీలో సిపిఐ పార్టీ జెండాను రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ముత్యాల యాది రెడ్డి ఎగురవేశారు , అనంతరం ఆయన మాట్లాడుతూ సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో అనేక ప్రజా ఉద్యమాలను నిర్వహించి ప్రజల సమస్యలను పరిష్కరించడం జరిగిందని యాదిరెడ్డి తెలిపారు, అలాగే తెలంగాణ రాష్ట్రంలో ఉన్న అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్ ,ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు సిపిఐ మాజీ కౌన్సిలర్ అజ్మీర హరి సింగ్ నాయక్ ,రంగారెడ్డి జిల్లా ప్రధాన ప్రజానాట్యమండలి ప్రధాన కార్యదర్శి డి వేణుగోపాల చారి, ఏఐటీయూసీ అబ్దుల్లాపూర్మెట్ మండల అధ్యక్షులు కేతరాజు నరసింహ, జన్నురం శాఖ కార్యదర్శి నాగవల్లి యాదగిరి,దాది మల్ల నారాయణ, శ్రీనివాస్ సాగర్, నాగేశ్వరరావు, మహిళా సంఘం నాయకురాలు కామిల్ల చందన, లక్ష్మి, కేతరాజు మంజుల, చీరాల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు,

# బహుజన పుస్తక ప్రపంచ కార్యక్రమంలో పాల్గొన్న చుక్క గిరి

**వెలుతురు, హైదరాబాద్, డిసెంబర్ 26:**




గీతం విశ్వ విద్యాలయం ప్రొఫెసర్ శ్రీధర్ తో కలిసి బహుజన పుస్తక ప్రపంచం లో రాష్ట్ర ఎలక్ట్రిసిటీ కార్మిక సంఘం నాయకుడు చుక్క గిరి పాల్గొన్ని పలు పుస్తకాలను కొనుగోళ్లు చేశారు, ఈ కార్యక్రమంలో విద్యార్థులకు సంబంధించిన పలు పుస్తకాలు మరియు ఇతర విజ్ఞాన వినోద విషయాలు తెలిపే పలు పుస్తకాలను విద్యార్థులకు కొనుగోళ్లు చేశారు, ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ శ్రీధర్, ఇతర సభ్యులు, విద్యార్థులతో కలిసి చుక్క గిరి పాల్గొన్నారు,

# వివాహ వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిషోర్ కుమార్ లు

**వెలుతురు, హైదరాబాద్, డిసెంబర్ 26:**
హైదరాబాద్ మన్నెగూడ వేద కన్వెన్షన్ హాల్లో గురువారం జరిగిన బీఆర్ఎస్ పార్టీ రాష్ట నాయకులు ఒంటెద్దు నర్సింహ రెడ్డి మేనకోడలు వైష్ణవి - సిద్ధార్థ రెడ్డి వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించినమాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి,తుంగతుర్తి మాజీ శాసనసభ్యులు డా.గాదరి కిశోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు, ఈ కార్యక్రమంలో బిఆర్ ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు,



# అమిత్ షా వ్యాఖ్యలను నిరసిస్తూ జహీరాబాద్‌లో భారీ నిరసన ర్యాలీ..

- పార్టీలకు అతీతంగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన..
- అమిత్ షాను మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్






**జహీరాబాద్ వెలుతురు డిసెంబర్ 26:**
బాబాసాహెబ్ అంబేద్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలతో దేశవ్యాప్తంగా ఆగ్రహజ్వాలలు చెలరేగుతున్నాయి. దీనిలోభాగంగా సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో మాల మహానాడు ఆధ్వర్యంలో పార్టీలకు, కుల మతాలకు అతీతంగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం నిరసన ర్యాలీ చేపట్టారు. స్థానిక అంబేద్కర్ భవనం నుండి జాతీయ రహదారి మీదుగా స్థానిక అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహం వద్ద రోడ్డు పై బైటయించి "అమిత్ షా మాఫీ మాంగో " పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం అమిత్ షా దిష్టి బొమ్మను దహనం చేశారు. అనంతరం ర్యాలీగా పోలీస్ స్టేషన్‌కు చేరుకుని అమిత్ షాపై ఫిర్యాదు చేసి కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు వివిధ పార్టీ ప్రతినిధులు మాట్లాడుతూ అమిత్ షా వ్యాఖ్యలు బాబాసాహెబ్ అంబేద్కర్ గౌరవాన్ని కించపరిచే విధంగా ఉన్నాయన్నారు. దీనిపై బీజేపీ తక్షణమే స్పందించి క్షమాపణలు చెప్పాలని, అలాగే అమిత్ షాను మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తాం అని హెచ్చరించారు.రాజ్యాంగ నిర్మాతపై చేసిన వ్యాఖ్యలను దేశ ప్రజలు ఖండిస్తున్నారన్నారు. ఈ నిరసనలో ప్రజా సంఘాల నాయకులు, వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అనుమానాస్పద స్థితిలో ఎస్ఐ సాయికుమార్ మృతి...

- కొల్చారం గ్రామంలో విషాదం

**కొల్చారం, డిసెంబర్ 26 వెలుతురు:-**
సాయికుమార్ చిన్నప్పటినుండి చదువుతోపాటు సామాజిక సేవ చెయ్యాలని ఉద్దేశంతో కొల్చారం గ్రామంలో నెలకొల్పిన సంఘమిత్ర యువజన సంఘంలో తోటి సభ్యులతో కీలక పాత్ర పోషించారు. సాయికుమార్ తన బాబాయ్ లక్ష్మీనారాయణ కానిస్టేబుల్ గా విధులు నిర్వహించడంతో తన బాబాయిని ఆదర్శంగా తీసుకుని ఎస్సై కావాలనే లక్ష్యంతో చదువుకు పేదరికం అడ్డు రాదని చదువుకుంటే ఏదైనా సాధించవచ్చు అనే తపనతో కష్టపడి చదివి ఎస్సై ఉద్యోగానికి ఎంపికయ్యారు. చిన్నకోడూర్, బిబిపేట్, ఎస్సైగా విధులు నిర్వహిస్తూ వృత్తిరీత్యా బదిలిలో భాగంగా ఈమధ్య కాలంలోనే బిక్నూరు మండలానికి బదిలీపై వచ్చిన ఎస్ఐ సాయికుమార్ ఎస్ హెచ్ ఓ గా బాధ్యతలు చేపట్టి బిక్నూర్ పరిసర



ప్రాంతాలలో శాంతి భద్రతల విషయంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంతరించుకున్నారు. గురువారం తెల్లవారుజామున ఎల్లారెడ్డి పెద్ద చెరువులో ఎస్సై సాయికుమార్ మృతదేహం లభ్యం కావడంతో కొల్చారం గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి ఎస్సై సాయికుమార్ మరణ వార్తతో కుటుంబీకులు గ్రామస్తులు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇది ఇలా ఉండగా ఎల్లారెడ్డి పెద్ద చెరువులు ముమ్మర గాలింపుల్లో భాగంగా బిబిపేటలో కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న శృతి, ప్రైవేట్ ఉద్యోగి నిఖిల్, ఎస్సై సాయి కుమార్ మృతదేహాలు లభించడంతో వీరి మృతికి సంబంధించి అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

**- నివాళులర్పించిన కొల్చారం ఎస్సై ముహమ్మద్ గౌస్..**

అనుమాన స్పద స్థితిలో మృతి చెందిన భిక్కనూర్ ఎస్సై సాయికుమార్ మహాదేహానికి కొల్చారం ఎస్సై మొహమ్మద్ గౌస్ పూలమాలతో నివాళులర్పించారు.

# రాష్ట్రంలో జనాభా దామాషా ప్రకారం మంత్రిమండలిలో స్థానం కల్పించాలి

- బీసీలకు 8 మందికి మంత్రి మండలిలో చోటు కల్పించాలి
- తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక జనాభా ఉన్న ముదిరాజులలో వాకిటి శ్రీహరి గారికి మంత్రిగా స్థానం కల్పించాలి
- సామాజిక న్యాయాన్ని తుంగలో తొక్కుతున్న అగ్రకుల రాజకీయ పార్టీలు
- సంచార జాతులకు నామినేటెడ్ పోస్టులలో అవకాశం కల్పించాలి
- బీసీ నేత లింగం గౌడ్ డిమాండ్



**హైదరాబాద్ వెలుతురు డిసెంబర్ 26:**
తెలంగాణ రాష్ట్రంలో మెజార్టీ కులాల ప్రజలకు మంత్రిమండలిలో స్థానం కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి విజ్ఞప్తి చేశారు, తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన ముదిరాజ్ కులానికి మంత్రిమండలిలో స్థానం కల్పించలేదు, ఇప్పటికైనా ముఖ్యమంత్రి గారు స్పందించి ముదిరాజ్ కులానికి చెందినటువంటి మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి గారికి మంత్రి మండలి లో స్థానం కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు, సామాజిక న్యాయం - సమాన వాటా ఇవ్వాలని, బీసీలకు మంత్రిమండలిలో 8 మంత్రి పదవులు ఉండాలి, కానీ ప్రస్తుతం ప్రజా పాలనలో ఇద్దరే బీసీలు మంత్రిమండలిలో ఉన్నారు, కావున ఈ ప్రజా పాలనలో ముఖ్యమంత్రి గారు చొరవ తీసుకొని బీసీలకు జనాభా ధమాషా ప్రకారం మంత్రి మండలిలో సామాజిక న్యాయం అమలయ్యే విధంగా చూడాలని వారు విజ్ఞప్తి చేశారు, రాజ్యాధికారం కల్పించడంలో అన్ని రాజకీయ పార్టీలు ప్రభుత్వాలు బీసీలను మోసం చేస్తున్నాయి అర శాతం,5 శాతం ఉన్నవాళ్లు ముఖ్యమంత్రులు అయితున్నారు కానీ జనాభాలో మెజారిటీ ప్రజలుగా ఉన్నటువంటి బీసీలు నేటికీ ముఖ్యమంత్రులు కాలేకపోతున్నారు, అగ్రకుల పార్టీలు బీసీలను జెండాలు మోషే కాడనే, పార్టీ పదవులలో కిందిస్థాయి పదవులు అప్పజెప్పి రాజ్యాధికారం వాళ్ల గుప్పిట్లో పెట్టుకుని బీసీలను రాజకీయంగా, ఆర్థికంగా, ఎదగకుండా చేస్తున్నటువంటి ఈ రాజకీయ పార్టీలను నమ్మి బీసీలు మోసపోతున్నారు, గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో బీసీలను అణగదొక్కి దొరలు రాష్ట్రాన్ని పాలించారు, అదే కోవలో ప్రజాపాలనని కాంగ్రెస్ ప్రభుత్వం పదవుల పంపకంలో చిన్నచిన్న పార్టీ పదవులు అప్పజెప్పి, నిర్ణయాత్మకమైనటువంటి పదవులను వారి చేతిలో పెట్టుకొని బీసీలను రాజకీయంగా ఎదగకుండా చేస్తున్నారు, కాంగ్రెస్ పార్టీ అధిష్టానం తెలంగాణ పై దృష్టి సారించి సామాజిక న్యాయం అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ డిమాండ్ చేశారు..

# ఖరీదైన కారుకు మంటలు

## 45 నిమిషాలు శ్రమించి మంటలు ఆర్పివేసిన సిబ్బంది

**ముంబై,డిసెంబర్ 26 ( వెలుతురు):**
మహారాష్ట్ర ముంబైలో షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. కోస్టల్ రోడ్‌లో కోట్ల ఖరీదైన లగ్జరీ లాంబోర్గినీ కారు మంటల్లో చిక్కుకుంది. బుధవారం రాత్రి 10:20 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదని అధికారులు తెలిపారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనాస్థలికి చేరుకొని దాదాపు 45 నిమిషాలు శ్రమించి మంటలను ఆర్పివేశారు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు తెలియరాలేదు. గుజరాత్ రిజిస్ట్రేషన్‌తో ఉన్న ఆరెంజ్ కలర్ కారు క్యాబిన్‌లో మంటలు వస్తున్న వీడియోను వ్యాపార దిగ్గజం గౌతమ్ సింఘానియా ఎక్స్ వేదికగా షేర్ చేశారు. ప్రస్తుతం ఈ వీడియో వైరల్ అవుతోంది. ఈ కారు ఖరీదు రూ.9 కోట్లు అని సమాచారం.

# లక్ష్మి నరసింహా స్వామి దేవాలయం లో పూజలు చేసిన ఎంపీ, ఎమ్మెల్యే



**వెలుతురు, యాదాద్రి భువనగిరి, డిసెంబర్ 26:**
యాదాద్రి భువనగిరి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమయిన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి స్వాతి నక్షత్రం సందర్భంగా ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య తో కలిసి భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి గురువార నాడు " గిరి " ప్రదక్షిణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎంపీ లకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి దర్శనం వారు చేసుకున్నారు , ఆలయ అర్చకులు వారికిఈ సందర్భంగా స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు,

# చరిత్ర భావితరాలకు తెలిసి ఉండాలి

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్

**ఆదిలాబాద్ వెలుతురు డిసెంబర్ 26:**
ఘనంగా వీర్ బాల్ దివస్ కార్యక్రమం చరిత్రను కనుమరుగు చేసే విధంగా, చరిత్రను వక్రీకరించే విధంగా సమాజానికి దేశానికి కొంత చేసిన వాళ్లని కొండంత పుస్తకంలో చూయించే విధంగా గత ప్రభుత్వాలు ప్రయత్నాలు చేశారని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ గారు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని శాంతినగర్ లో ప్రగతి విద్యాలయంలో వీర్ బాల్ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. భారతమాత, వీర్ బాల్ చిత్రపటాలకు పూలమాలవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వాస్తవాలు బయటికి రావాలా చరిత్ర ఎప్పుడైతే భావితరాలు తెలుస్తదో, పిల్లలు ఎప్పుడూ తెలుసుకోగలుగుతారో అప్పుడే చరిత్ర సృష్టించడానికి అవకాశాలుంటాయి. తక్కువ వయసులో ఆడుతూ వయసులో.. మత మార్పిడి చేస్తున్నటువంటి వారితో చేసిన ధైర్య సాహసాలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమాలు గ్రామ గ్రామాన జరగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు వేణుగోపాల్ ఆదినాథ్ బ్రహ్మానంద్ రమేష్ సల్ల విజయ్ బాబు తదితరులు ఉన్నారు.



## కడదాక కామ్యూనిస్టుగా బ్రతికిన నిబద్ధత గల వ్యక్తి పొట్లచెర్వు రాములు

- పొట్ల చెరువు రాములు నాలుగో వర్ధంతి సందర్భంగా జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జల్లెల పెంటయ్య



**రామన్నపేట వెలుతురు న్యూస్ డిసెంబర్ 26**

ప్రజల పక్షాన పోరాటమై నిలిచిన నిబద్ధత కలిగిన కమ్యూనిస్టు కార్యకర్త పొట్లచెరువు రాములు అని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జిల్లాల పెంటయ్య అన్నారు. కొమ్మయిగూడెం గ్రామంలో సిపిఎం మాజీ మండల కమిటి సభ్యుడు పొట్లచెరువు రాములు నాలుగో వర్ధంతి సందర్భంగా స్మారక స్థూపానికి జోహార్లు అర్పించి పూలమాల వేసి అనంతరం మాట్లాడుతూ రాములు సిపిఎం కార్యకర్తగా అనుబంధ ప్రజా సంఘాలైన ప్రజానాట్యమండలి,వృత్తి సంఘాల ఉద్యమాల్లో చురుకుగా పాల్గొని కడవరకు నిబద్ధతగా పనిచేశాడని అన్నారు.ప్రభుత్వం అలంబించే ప్రజావ్యతిరేక విధానాపై ఉద్యమాలు నడిపించాడని అన్నారు రాములు మృతి పార్టీ ఉద్యమానికి ప్రజా పోరాటాలకు తీరనిలోటని వారి ఆశయాల కోసం పార్టీ కార్యకర్తల కృషి చేయాలని అన్నారు ఈ కార్యక్రమంలో పార్టీ గ్రామ శాఖ కార్యదర్శి శానకొండ వెంకటేశ్వర్లు,మాజీ కార్యదర్శి ఎర్ర కాటమయ్య, కుటుంబ సభ్యులు పొట్లచెరువు రాధ,గాయత్రి,అంతటి నరసింహ, సాగర్ల శేఖర్,గుణగంటి మల్లేశం, శానకొండ రామచంద్రం, దావనూరి ప్రశాంత్ జల్లెల మల్లేశం కొండగడప సుధాకర్ కొండగడప నవీన్ కొండగడప బిక్షం తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉపాధ్యాయులకు ప్రభుత్వ తరపున గుర్తింపు కార్డులను ఇవ్వాలి..



**తుంగతుర్తి వెలుతురు డిసెంబర్ 26:**

తల్లిదండ్రుల తరువాత మనకు విద్యాబుద్ధులను నేర్పి సమాజంలో మనల్ని మంచి పౌరులు గా తీర్చిదిద్దటం లో ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిది అలాంటి గురువులకు ఈ రోజుకి ప్రభుత్వ గుర్తింపు కార్డులు లేవు అన్ని రంగాల ప్రభుత్వ ఉద్యోగులకు గుర్తింపు కార్డులు ఉన్నట్లుగా ,ఎంతో గౌరవప్రదమైన భాధ్యతాయుతమయిన వృత్తి లో ఉన్న టీచర్స్ కూడా ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇస్తే బాగుంటుంది అని రేఖ బోయలపల్లి తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు రేఖ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్స్ కొనసాగుతున్న వారందందరికీ గురువారం రోజున రేఖ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ రేఖ గారి సౌజన్యంతో కీసర మండల ఉపాధ్యాయులకు గుర్తింపు కార్డులను అందజేశారు .త్వరలో తన సొంత నియోజక వర్గం అయిన తుంగతుర్తి లోని 9 మండలాలో ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్స్ గా కొనసాగుతున్న వారందరికీ కూడా రేఖ ఫౌండేషన్ తరపున ఐడి కార్డులు అందచేయనున్నట్లు రేఖ తెలిపారు ఈ సందర్భంగా వారికి చిరు సన్మానం చేసిన జిల్లా అధ్యక్షులు రామేశ్వర్ గౌడ్ , ప్రధాన కార్యదర్శి ఆనంద్ రెడ్డి ముఖ్య అతిథులు గా పాల్గొన్న పింగిలి శ్రీపాల్ రెడ్డి పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షులు వంగా మహేందర్ రెడ్డి ఎంఎల్సీ అభ్యర్థి మోహన్ రెడ్డి ఎక్స్ ఎంఎల్సీ మండల శాఖ అధ్యక్షులు చీర యాదగిరి, ప్రధాన కార్యదర్శి ఈగ శ్రీనివాస్, రాష్ట్ర, జిల్లా, మండల , ముఖ్య కార్యకర్తలు, పాల్గొన్నారు

## రాజ్యాంగ పరిరక్షణకు ,మత రాజకీయాలకు వ్యతిరేకంగా సమరశీల ఉద్యమాలకు సిద్ధం కావాలి

- సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్



**కరీంనగర్ వెలుతురు డిసెంబర్ 26:**

గురువారం రోజున సిపిఐ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని రామడుగు, దేశారాజుపల్లి, లక్ష్మీపూర్, గుండి, గోపాలరావు పేట గ్రామాల్లో సిపిఐ జెండాలు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సృజన్ కుమార్ మాట్లాడుతూ సిపిఐ పార్టీ 1925 డిసెంబర్ 26 న కాన్పూర్ లో ఆవిర్భవించి నేటితో వంద సంవత్సరాలు అవుతుందని,ఈ వంద సంవత్సరాల వ్యవధిలో కమ్యూనిస్టు పార్టీ ఎన్నో పోరాటాలు త్యాగాలు చేసి ఎన్నో విజయాలను సాధించిందిని, స్వాతంత్ర్యనికి పూర్వం పుట్టి బ్రిటిష్ సామ్రాజ్య వాదులకు వ్యతిరేకంగా పోరాడి దేశ స్వాతంత్ర్యం కోసం వేలాది మంది కమ్యూనిస్టులను త్యాగం చేసిందని, నాడు నేడు అధికారంలో ఉన్న లేకున్నా ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారం కోసం, కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడేది ఎర్ర జెండా మాత్రమేనని అన్నారు.నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్రమోది ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను మరిచి ప్రజా సంక్షేమాన్ని విస్మరించి దేశ సంపదను అదాని అంబానిలకు కట్టబెడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ, కార్మిక హక్కులను కాలరాస్తూ ప్రశ్నించే గొంతులను అణిచి వేస్తున్నారని, ప్రజాస్వామ్యన్ని కూని చేస్తూ భారత రాజ్యాంగాన్ని మార్చడానికి కుట్రలు చేస్తున్నారని ఈ తరుణంలో మనువాదుల ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రతి కమ్యూనిస్టు కార్యకర్త కంకణ బద్దులు కావాలని సృజన్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి గోడిశాల తిరుపతి గౌడ్ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఉమ్మెంతుల రవీందర్ రెడ్డి, సినియర్ నాయకులు గంటె రాజేశం మండల నాయకులు మల్లేశం, కానుకయ్య, నాంపల్లి, రవీందర్, ఆంజనేయులు, రానేష్, హరీష్, రాములు తదితరులు పాల్గొన్నారు.

# మీరిచ్చిన హామీలైన అమలు చేయండి

## మేకపోతుల వెంకటరమణ కేజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షులు

**నల్లగొండ జిల్లా వెలుతురు డిసెంబర్ 26:**

కాంగ్రెస్ పార్టీ కల్లుగీత కార్మికులకు ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీలు ఇకనైనా అమలు చేయాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల వెంకటరమణ అన్నారు.ఈరోజు నల్లగొండలోని దొడ్డి కొమరయ్య భవనంలో ఏర్పాటుచేసిన పత్రికా విలేకరుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఇటీవల సంఘం రాష్ట్ర సదస్సు నిర్వహించి 22 డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చామని, ఏడాది కాలంలో ఎన్నోసార్లు మంత్రులను కలిసి వినతి పత్రాలు ఇచ్చామని అన్నారు. ప్రమాద నివారణకు పదివేల సేఫ్టీ కీట్టులు తప్ప ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వృత్తిలో ప్రమాదం జరిగిన వారికి ఇవ్వాల్సిన ఎక్స్ గ్రేషియా ఏడాది నుండి ఇవ్వడం లేదని మేనిఫెస్టోలో మాత్రం నెల రోజుల లోపు ఇస్తామని చెప్పారన్నారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఆవిష్కరణ చేసిన కాటమయ్య రక్షణ కవచం ఈ ఐదు నెలల కాలంలో పదివేలు మాత్రమే పంపిణీ చేశారని మిగతా వృత్తి చేసే వారందరికీ ఇవ్వాలన్నారు. నెక్లెస్ రోడ్డులోని నీరా కేఫ్, టాడి కార్పొరేషన్ కు అప్పగించాలని, నందనములోని ప్రాజెక్టు ప్రారంభించాలని అన్నారు. ప్రమాదానికి గురయ్యే



వారికి టాడి కార్పొరేషన్ నుంచి ఇచ్చే ఆర్థిక సహాయం నిలుపుదల చేశారని వీటిని వెంటనే కొనసాగించాలన్నారు, ఏజెన్సీ ఏరియాలోని సొసైటీలను పునరుద్ధరించాలని,.ట్యాంక్ బండ్ పై పాపన్న విగ్రహం పెడతామని, జనగామ జిల్లాకు పాపన్న పేరు పెడతామని, వృత్తి పెన్షన్ 4 వేలకు పెంచుతామని ఇచ్చిన హామీలు ఇప్పటికైనా అమలు చేయాలని లేని పక్షంలో భవిష్యత్ లో పెద్ద ఎత్తున ఉద్యమాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు, ఇంకా ఈ సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షులు పి. అచ్చాలుజిల్లా అధ్యక్షులు కొండా వెంకన్న, ఉపాధ్యక్షులు రాచకొండ వెంకన్న, ఉప్పల గోపాల్, నర్సింగ్ సైదులు, కాసాని సత్తయ్య, జెర్రిపోతుల ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

# 100 సంవత్సరాల ఘనచరిత్ర కలిగిన ఎందరో మహానుభావుల త్యాగశీలుల పార్టీ

- పేదల అభ్యున్నతికోసం పోరాడిన పార్టీ సిపిఐ
- సిపిఐ మండల కార్యదర్శి ఊట్కూరినర్సింహ్మా.



**రామన్నపేట వెలుతురు న్యూస్ డిసెంబర్ 26**

సిపిఐ పార్టీ 1925వ సంవత్సరంలో కాన్పూర్ లో ఏర్పాటు చేయబడిందని, 9 మంది కార్యవర్గ సభ్యులతో ఏర్పడిన పార్టీ నేడు దేశవ్యాప్తంగా ఎంతో ఆదరణ పొందిందని అన్నారు..సిపిఐ పార్టీని ఏర్పాటు చేసి 99 సంవత్సరాలు పూర్తి చేసుకొని 100 సంవత్సరాలు నిండుతున్న సందర్భంగా నేడు మండల కేంద్రంలో ఊట్కూరి నర్సింహ్మా సిపిఐ జెండా ఆవిష్కరణ జేసి మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యోద్యమంలో, తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొని ఎందరో యువ కమ్యూనిస్టులు ప్రాణాలను సైతం త్యాగం చేసారని, ఎందరో మహానుభావులు వారి జీవితకాలాన్ని పార్టీ కోసం, పేదప్రజల అభ్యున్నతి కోసం త్యాగం చేసారని అన్నారు. తెలంగాణా మలిదశ ఉద్యమంలో సిపిఐ ప్రముఖ పాత్ర పోషించిందని, 2001 సంవత్సరంలో మొట్టమొదటగా తెలంగాణాకు అన్యాయం జరుగుతోందని తెలంగాణాకు ప్రత్యేక ప్యాకేజి ఇవ్వాలని, లేదా తెలంగాణ ను ప్రత్యేక తెలంగాణ గా మార్చాలని తెలియచేసిన పార్టీ సిపిఐ అన్నారు.సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఎర్ర రమేష్ గౌడ్ మాట్లాడుతూ, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల వారు, ఏఐవైఎఫ్ యువజన సంఘాల వారు ప్రత్యక్షంగా తెలంగాణ ఉద్యమంలో పాల్గొని ఎందరో కేసుల పాలై జైలు జీవితం కూడా గడిపారని తెలియజేసారు, ఎర్రజెండా లేని ఉద్యమం లేదని, పోరాటాల ద్వారానే ప్రజల సమస్యలు పరిష్కారం కాగలవని నిరూపించిన పార్టీ సిపిఐ అన్నారు.ఎన్నో పార్టీలు పెట్టినా వారి స్వలాభాల కోసం పార్టీలు పెట్టారని ఏ పార్టీ కూడా నిలబడలేకపోయిందని అన్నారు.సిపిఐ శతాబ్ధి ఉత్సవాలలో పాల్గొన్న వారు సిపిఐ సీనియర్ నాయకులు బాలగోని మల్లయ్య, భగవంత, గీతపనివారల మండల అధ్యక్షులు గంగాపురం వెంకటయ్య, రచ్చ యాదగిరి, ఊట్కూరి కృష్ణ, పట్టణ కార్యదర్శి శివరాత్రి సమ్మయ్య, ఎర్ర బిక్షపతి, ఆకిటి శంకర్, శ్రీరామోజు నర్సింహ్మా చారి,కాడయ్య, పర్సా సుదర్శన్, కళ్లెం యాదగిరి, ఏనూతుల రమేష్, సిఎచ్ మల్లేష్, పల్లె మల్లేష్, నర్సింహ్మా, ఈసం గాలయ్య, కర్రె మల్లయ్య, యండి దస్తగిరి, గాదే ఊసయ్య, మందడి యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

# సంస్థాన్ లో సిపిఐ శత జయంతి వేడుకలు

**సంస్థాన్ నారాయణపురం వెలుతురు డిసెంబర్ 26 :**

ఉద్యమాల పోరాటాల గడ్డ తెలంగాణ సాయుధ పోరాట వారసత్వాన్ని అందుకొని భారతదేశంలో 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నారాయణపురం మండల కేంద్రంలో అమరవీరులకి శ్రద్ధాంజలి ఘటించరు.పార్టీ కోసం త్యాగలను చేసిన వీరులను గుర్తు చేసుకునారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మునుగోడు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు ఉజ్జిని యాదగిరిరావు పాల్గొన్నారు.99 సంవత్సరాలు పూర్తి చేసుకుని 100 వ సంవత్సరంలో అడుగు పెడుతున్న భారత కమ్యూనిస్టు పార్టీ శత జయంతి వేడుకల సందర్భంగా ఉజ్జిని యాదగిరి రావు మాట్లాడుతూ 1917 మొట్టమొదటి ప్రపంచ యుద్ధం జరిగిన తర్వాత లెనిన్ నాయకత్వంలో ఏర్పడిన భారత కమ్యూనిస్టు పార్టీ అని ,కేరళ రాష్ట్ర ప్రభుత్వం భూ పోరాటాలు నిర్వహించి ఎంతోమంది నిరుపేదలకు బడుగు బలహీన పేద ప్రజలకు వేలాది భూములను పంచి పెట్టిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీది. గ్రామీణ ప్రాంత ప్రజల సమస్యలపై ఎప్పటికప్పుడు పోరాటాలు నిర్వహించిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీది. రాచకొండ ప్రాంతంలో ఫీల్డ్ ఫైరింగ్ వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించి నేల దాంపాడు బుడిగోడు కుంట గాడి కొండ తదితర ప్రాంతాలలో దొరల భూస్వాముల కబంధ హస్తాల కింద నలుగుతున్నటు వంటి భూమిని నాటి మాజీ పార్లమెంట్ సభ్యులు బొమ్మగాని ధర్మ బిక్షం, మునుగోడుమాజీ శాసనసభ్యులు ఉజ్జిని నారాయణ రావు, మాజీ నల్లగొండ పార్లమెంటు సభ్యులు సురవరం సుధాకర్ రెడ్డి నేతృత్వంలో రాచకొండలోని భూములను సైతం హరిజన గిరిజన బీసీలకు అన్ని వర్గాల ప్రజలకు భూ పంపిణీ చెసిన చరిత్ర పార్టీకి ఉన్నది. అదేవిధంగా కోతులాపురం ,అల్లందేవి



చెరువు , జనగాం ,నారాయణపురం లో ఇల్లు లేని నిరుపేదలకు ఇండ్ల పట్టాలను పంచి ఇండ్లను నిర్మించి ఇచ్చారు. రాచకొండ భూ పరిరక్షణ కోసం అనునిత్యం గిరిజన పక్షాన నిలబడి విరోచితమైన పోరాటాలు నిర్వహించిన కామ్రేడ్ గులాం రసూల్ ఉయ్యాల మల్లయ్య కురుమిద్దె లింగయ్య మాజీ ఎంపీపీ ఎల్లంకి శ్రీనివాస్ పోరాటాల వారసత్వంగా ముందుకు సాగుతున్నామని అన్నారు .ఒక వీరుడు మరణిస్తే వేలాదిమంది విప్లవకారులు ఉదయించే సూర్యుని లాగా పుట్టుకొస్తారు అని అన్నారు. ఈ సందర్భంగా నారాయణపురం మొట్టమొదటి గ్రామ సర్పంచి పల్లె లక్ష్మారెడ్డి కుమారుడు పల్లె సీతారాం రెడ్డి మాజీ శాసనసభ్యులు ఊజ్జినియాదగిరి రావు గారి సమక్షంలో సిపిఐ లో చేరడం జరిగింది.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చనగోని గాలయ్య, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు కే శ్రీనివాస్ , సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, చౌటుప్పల మండల కార్యదర్శి పల్లె శేఖర్ రెడ్డి ,మండల సిపిఐ సహయా కారదర్శి చిలువేరు అంజయ్య, మండల కార్యవర్గ సభ్యులు పొట్ట శంకరయ్య, ఉస్మానియా యూనివర్సిటీ ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి మహమ్మద్ రైమాన్, మాజీ సర్పంచ్ ముత్యాల సుగుణమ్మ, అంజయ్య ,మహిళా సమైక్య మండల నాయకులు లింగమ్మ, ప్రజానాట్యమండలి డివిజన్ అధ్యక్షులు కలకొండ సంజీవ, పాండు, సింగపంగా రమేష్, సింగపంగం మల్లయ్య, వీరమల్ల యాదయ్య, భీమనపల్లి గాలయ్య ,మంచాలు సైదులు, మంచాల గాలయ తదితరులు పాల్గొన్నారు.

## ఏబీవీపీ తెలంగాణ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గా కరీంనగర్ జిల్లా వాసి అలివేలి రాజు

**కరీంనగర్ వెలుతురు డిసెంబర్ 26:**

సిద్దిపేట లో జరిగిన అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) 43 రాష్ట్ర మహాసభల్లో కరీంనగర్ జిల్లా శంకరపట్నం కు చెందిన అలివేలి రాజు ను రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఎన్నుకున్నారు . ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షుడు జానారెడ్డి 2025 సంవత్సరానికి గాను ఇట్టి మహాసభలో నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ప్రకటించారు. ఉస్మానియ యూనివర్సిటీకి చెందిన విద్యార్థి నాయకుడు అలివేలి రాజు కి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గా



నియమితులు కావడం పట్ల కరీంనగర్ జిల్లా ఏబీవీపీ శ్రేణులు తో పాటు పలువురు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమితులైన అలివేలి రాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాల పై ,విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం తగిన కార్యాచరణతో ఉద్యమాలు చేపడతామన్నారు. నాపై నమ్మకంతో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బాధ్యతను అప్పగించినందుకు రాష్ట్ర నాయకత్వానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. అలాగే ఏబీవీపీ రాష్ట్ర నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఏబీవీపీ బలోపేతానికి శాయ శక్తుల తగిన కృషి చేస్తానని తెలిపారు.

## చిన్నపిల్లల సురక్ష ఆసుపత్రిను ప్రారంభించిన ఎమ్మెల్యే



ఆదిలాబాద్ వెలుతురు డిసెంబర్ 26:



ఆదిలాబాద్ పట్టణంలోని గర్ల్స్ హై స్కూల్ సమీపంలో ముదర విద్యానగర్ లో చిన్నపిల్లల సురక్ష ఆసుపత్రి ను ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ గురువారం ప్రారంభించారు. ప్రారంభానికి వచ్చిన ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాయాల్ శంకర్ ను డాక్టర్. కే.శివ కుమార్, కుటుంబ సభ్యులు పుష్పగుచ్చం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి ఆసుపత్రి ప్రధాన ద్వారాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే ను, బిజెపి నాయకులు, విద్యానగర్ కౌన్సిలర్ తదితరులను పుష్పగుచ్చం అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు.

## కార్పొరేటర్ రాపర్తి విజయ కుటుంబానికి బిజెపి జాతీయ సీనియర్ నాయకులు మురళీధర్ రావు పరామర్శ



కరీంనగర్ వెలుతురు డిసెంబర్ 26:

బిజెపి జాతీయ సీనియర్ నాయకులు మురళీధర్ రావు గురువారం సాయంత్రం కరీంనగర్ లోని 58వ డివిజన్ కార్పొరేటర్ రాపర్తి విజయ, బిజెపి జిల్లా కార్యదర్శి రాపర్తి ప్రసాద్ లను పరామర్శించారు. కార్పొరేటర్ రాపర్తి విజయ భర్త వెంకటేశం 10 రోజుల క్రితం అనారోగ్యంతో మరణించారు. ఈ నేపథ్యంలో రాపర్తి విజయ నివాసానికి వెళ్లిన మురళీధర్ రావు వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాపర్తి కుటుంబాన్ని పరామర్శించిన వారిలోజిల్లా బిజెపి సీనియర్ నాయకులు దేవేందర్ రావు , సంతోష్ రావు ,సునీల్ రావు ,నర్సింగ్ రావు ,కిషన్ రావు, బిజెపి సీనియర్ నాయకులు కూడా ఓదెలు గారు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లింగంపల్లి శంకర్,బిట్టు,ఎస్సీ మోర్చ జిల్లా నాయకులు సోమిడి వేణు,కట్ట రాజు,సంపత్ చరి, ప్రసాద్, కసికట్టి అరుణ్ తదితరులు ఉన్నారు..

## బంగాళాఖాతంలో బలహీనపడ్డ అల్పపీడనం

- ఉపరితల ఆవర్తనంతో ఈదురుగాలుల ప్రభావం

విశాఖపట్టణం,డిసెంబర్26 వెలుతురు:



బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం.. బలహీనపడి అల్పపీడనంగా మారిందని విశాఖ వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. దీని ప్రభావంతో 1.5 కి.మీ. మేర ఉపరితల ఆవర్తనం ఏర్పడినట్లు పేర్కొన్నారు. అల్పపీడన ప్రభావంతో తీరం వెంబడి గంటకు 65 కి.మీ. వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉందని తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలోని అన్ని పోర్టుల వద్ద మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేసినట్లు చెప్పారు. మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని సూచించారు. వచ్చే 24 గంటలు నెల్లూరు జిల్లాలో భారీ వర్షాలు కురిసే సూచనలున్నాయని పేర్కొన్నారు. రానున్న రెండ్రోజులు రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అల్పపీడనం బలహీనపడినట్టు వాతావరణ శాఖాధికారులు ప్రకటించారు. ఇది ప్రస్తుతానికి బలహీనపడి ఉపరితల ఆవర్తనంగా కొనసాగుతున్నట్టు పేర్కొన్నారు. 24 గంటల్లో ఇది మరింత బలహీనపడబోతోందని తెలిపారు. దీని ప్రభావం ఇంకా తెలుగు రాష్ట్రాలపై ఉంటుందని వాతావరణ శాఖ పేర్కొంది. శుక్రవారం కూడా వర్షాలు కురుస్తాయని చెప్పింది. వర్షాలతోపాటు ఈదురుగాలులు వీస్తాయని జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు సూచనలు చేసింది. బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం కారణంగా శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు వాతావరణం చాలా కూల్‌గా ఉంది. అక్కడక్కడ చిరుజల్లులు పడుతున్నాయి. వ్యవసాయ పనులకు ఆటంకం కలిగిస్తున్నాయి. నెల్లూరు జిల్లాలో పరిస్థితి దారుణంగా ఉంది. ఇక్కడ మోస్తరు వర్షాలతోపాటు గంటలకు 65 కిలోమీటర్ల వేగంతో గాలులు కూడా వీస్తున్నాయి. ముందుజాగ్రత్తగా అన్ని పోర్టుల్లో మూడో నెంబర్ ప్రమాద హెచ్చరికను జారీ చేశారు అధికారులు. మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని హెచ్చరించారు. డిసెంబర్ 27 శుక్రవారం నాడు ప్రకాశం, నెల్లూరు, అనంతపురం, శ్రీ సత్యసాయి, వైఎస్ఆర్,అన్నమయ్య , చిత్తూరు మరియు తిరుపతి జిల్లాల్లోని కొన్ని ప్రదేశాలలో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉంది.తెలంగాణపై కూడా ఉపరితల ఆవర్తనం ప్రభావం గట్టిగానే ఉంది. హైదరాబాద్‌తోపాటు తెలంగాణలోని పలు జిల్లాల్లో చిరుజల్లులు పడుతున్నాయి. దాదాపు అన్ని జిల్లాల్లో ఉష్ణోగ్రతలు దారుణంగా పడిపోయాయి. మరో నాలుగు రోజులు ఇదే పరిస్థితి ఉంటుందని వాతావరణ శాఖాధికారులు హెచ్చరిస్తున్నారు. తూర్పు, ఆగ్నేయ దిశ నుంచి వీస్తున్న శీతల గాలులు తెలంగాణ ఉష్ణోగ్రతలపై పెను ప్రభావం చూపబోతున్నాయి. అందుకే సాధారణ ఉష్ణోగగ్రతలు భారీగా పడిపోతున్నాయి. అంతేకాకుండా చలి తీవ్రత దారుణంగా పెరగనుంది. జనం జాగ్రత్తగా ఉండాలని వాతావరణ శాఖాధికారులు హెచ్చరిస్తున్నారు.

## జిల్లా బిజెపి పార్టీ కార్యాలయం ప్రారంభించిన ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్ వెలుతురు డిసెంబర్ 26:

ఎన్నో సంవత్సరాలగా పార్టీ కార్యకర్తలు కంటున్న కళ ఈ జిల్లా లో పార్టీ కార్యాలయం సొంత భవనం పూర్తి కావాలని కళ నేడు పూర్తయిందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా బిజెపి పార్టీ కార్యాలయాన్ని జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్, నాయకులతో కలిసి ఆదిలాబాద్ జిల్లా బిజెపి పార్టీ కార్యాలయం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ జిల్లాలో పార్టీ కార్యాలయం సొంత భవనం పూర్తి కావాలని ఇప్పటినుంచి కన్న కల ఈరోజు పూర్తయిందన్నారు. జిల్లా పార్టీ కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఎందరో సీనియర్ కార్యకర్తలు ఈ జిల్లాలో భారతీయ పార్టీ ఎదగాలని ఈ రాష్ట్రంలో అధికారంలో రావడం, జిల్లాలో కీలకపాటి పోషించాలని కలలుగన్న ఆ కార్యకర్తల కళ .. మొన్న జరిగినటువంటి శాసనసభ ఎన్నికల్లో నలుగురు శాసనసభ్యులు గెలవడమే కాకుండా,



పార్లమెంట్ ఎన్నికలను రెండు సార్లు గెలవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బ్రహ్మానందం పట్టణ అధ్యక్షుడు లాలమున్న సీనియర్ నాయకులు గందె కృష్ణ గందేవిజయ్. వేణు గోపాల్.



అదీనాథ్. జోగు రవి. సోమ రవి. కృష్ణ యాదవ్ ఆకుల ప్రవీణ్ దినేష్ మాటోలియా మయూర్ చంద్ర విజయ్. రాళ్ల బండి మహేందర్ బాబా రావు పటేల్ రాజన్న దయాకర్ సుభాష్ జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు

# ఆకాంక్షిత జిల్లాల్లో కేంద్ర మంత్రి బండి సంజయ్ పర్యటన

- మధ్యాహ్నం నారాయణపేట, సాయంత్రం కర్నాటకలోని యాద్గిర్ జిల్లాల్లో పర్యటన
- కర్నాటకలో బాలచక్ర గ్రామాన్ని సందర్శించిన బండి సంజయ్
- యాద్గిర్ జిల్లా పార్టీ కార్యాలయంలో నేతలతో భేటీ
- స్థానిక ఎమ్మెల్యే శరణగౌడ నివాసానికి వెళ్లిన బండి సంజయ్
- నేడు రాయచూర్, గద్వాల జిల్లాల్లో కేంద్ర మంత్రి పర్యటన




వెలుతురు తెలంగాణ/కర్నాటక డిసెంబర్ 26:

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ గురువారం రోజున 'సమగ్రతా అభియాన్' లో భాగంగా




తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల్లో నీతి అయోగ్ ఎంపిక చేసిన ఆస్పిరేషనల్(ఆకాంక్షిత) జిల్లా అయిన యాద్గిర్ తోపాటు ఆకాంక్షిత బ్లాక్ లుగా గుర్తించిన నర్వ, బలిచక్ర మండలాలను సందర్శించారు. ఆయా మండలాల్లో విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు, వ్యవసాయం, ఆర్థిక ప్రగతికి సంబంధించి నీతి అయోగ్ ప్రతిపాదించిన అంశాల అమలు కు సంబంధించి కార్యక్రమాల అమలును పరిశీలించారు. తొలుత మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ, కేంద్ర హోంమంత్రిత్వ శాఖతో కలిసి మక్తల్ నియోజకవర్గం నర్వ మండల కేంద్రానికి విచ్చేశారు. ఈ సందర్భంగా వేలాది మంది ప్రజలు, బీజేపీ కార్యకర్తలు బండి సంజయ్ కు అపూర్వ స్వాగతం పలికారు. జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తోపాటు స్థానిక ఎస్పీ, ఉన్నతాధికారులు సంజయ్ కు ఘన స్వాగతం పలికారు. స్థానిక ప్రజలు పూలు చల్లి, మంగళహారతితో బ్రహ్మరథం పట్టారు. అనంతరం స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అధికారులతో కలిసి అంగన్ వాడీ సెంటర్ ను సందర్శించి చిన్నారులతో ముచ్చటించారు. పిల్లలకు అందిస్తున్న పోషకాహారం వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంగన్ వాడీ కేంద్రంలోని గర్భిణీలకు దగ్గరుండి సీమంతం జరిపించారు. పండ్లు, కానుకలు అందించారు. తన రాకకు గుర్తుగా అంగన్ వాడీ కేంద్రంలో మొక్కను నాటారు.

అక్కడి నుండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లిన బండి సంజయ్ వెళ్లి మందులు, వైద్య చికిత్స గురించి అడిగి తెలుసుకున్నారు. రెగ్యులర్ డాక్టర్ లేరని చెప్పడంతో… వెంటనే డాక్టర్ ను నియమించాలని కలెక్టర్ ను, ఫర్నీచర్ తోపాటు మౌలిక సదుపాయాలన్నీ కల్పించాలని కలెక్టర్ ను ఆదేశించారు. అనంతరం బయటకు వచ్చిన సంజయ్ ను స్థానిక ప్రజలు కలిసి మండల కేంద్రానికి రోడ్డు సౌకర్యం లేదని మొరపెట్టుకున్నారు. అక్కడి నుండి స్థానిక పాఠశాలను సందర్శించిన మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులతో ముచ్చటించారు. భోజన ఏర్పాట్లు, వంట శాలపై ఆరా తీశారు. మధ్యాహ్నం భోజనం వండేందుకు వంట పాత్రలు లేవని నిర్వాహకులు చెప్పడంతో వెంటనే వాటిని సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటానని చెప్పారు. అనంతరం డీకే అరుణతో కలిసి బండి సంజయ్ నేరుగా నారాయణపేట జిల్లా కలెక్టరేట్ కు విచ్చేశారు. కలెక్టర్ స్నిగ్ధతో భేటీ అయ్యారు. ఆస్పిరేషనల్ బ్లాక్ గా నర్వ ఎంపికనైందున మండల కేంద్రం రూపురేఖలు మార్చేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని కోరారు.

అక్కడి నుండి నేరుగా కర్నాటకకు బయలుదేరి యాద్గిర్ జిల్లాలో ఆకాంక్షిత బ్లాక్ కింద ఎంపికైన బలిచక్ర తాలుకా కేంద్రానికి వెళ్లారు. యాద్గిర్ జిల్లా కలెక్టర్, ఎస్పీతోపాటు ఉన్నతాధికారులు కేంద్ర మంత్రికి ఘన



స్వాగతం పలికారు. స్థానిక పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించారు. అక్కడున్న ప్రభుత్వ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మమేకమై సరదాగా ముచ్చటించారు. "మీరు పెద్దయ్యాక ఏమవుతారు?"అని ప్రశ్నించారు. చాలా మంది టీచర్, ఆఫీసర్, కలెక్టర్, పోలీస్ అవుతామని బదులివ్వడంతోపాటు లీడర్ కావాలని, ఎమ్మెల్యే కావాలని లేదా? అని అడిగితే.. నేను ఎమ్మెల్యే అవుతా సార్ అంటూ ఒక చిన్నారి లేచి బదులివ్వడంతో అక్కడున్న వాళ్లంతా చప్పట్లు కొట్టారు. అనంతరం స్థానిక పాఠశాలలో నెలకొన్న సమస్యలపై విద్యార్థుల నుండి అడిగి తెలుసుకున్నారు. తాగడానికి మంచి నీరు లేదని, పక్కనున్న కాలేజీకి ప్రహరీ గోడ లేదని, సైన్స్, ఇంగ్లీష్, హిందీ రెగ్యులర్ టీచర్లు లేరని చెప్పడంతో వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని యాద్గిర్ జిల్లా కలెక్టర్ ను కోరారు. మళ్లీ మార్చి లేదా ఏప్రిల్‌లో లో మరోసారి యాద్గిర్ జిల్లాలో పర్యటిస్తానని, అప్పటిలోగా స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని అంతిమంగా ఆకాంక్షిత జిల్లా, బ్లాకుల్లో మార్పు కన్పించాలని అధికారులను కోరారు.



అనంతరం సంజయ్ మాట్లాడుతూ "2018లో మొదటి సారిగా దేశవ్యాప్తంగా 112 ఆస్పిరేషన్ (ఆకాంక్షిత) జిల్లాలను గుర్తించినం. ఈ కార్యక్రమాన్ని మరింతగా క్షేత్ర స్థాయి వరకు విస్తరించాలనే లక్ష్యంతో 2023 జనవరి 7న 500 బ్లాక్/ మండలాలను గుర్తించినం. మన రాష్ట్రంలో 3 జిల్లాలను 'ఆస్పిరేషనల్ డిస్ట్రిక్ట్స్ గా", 10 మండలాలను 'ఆస్పిరేషనల్ బ్లాక్'లుగా గుర్తించి కార్యక్రమాలను ప్రారంభించినం. ఈ జిల్లాలో ఎంపికైన బలిచక్ర మండలంలో కార్యక్రమాల ప్రోగ్రెస్ ఎట్లా ఉందో తెలుసుకుని రావాలని మోదీజీ ఆదేశించడంతో ఇక్కడికి వచ్చిన. ప్రజలతో మాట్లాడిన. సమస్యలను అడిగి తెలుసుకున్న. అంగన్ వాడీ, పీహెచ్ సీ, ప్రభుత్వ పాఠశాలలను సందర్శించిన. అక్కడున్న సమస్యలను పరిష్కరించాలని అధికారులను కోరారు.

ఈ సందర్భంగా కలెక్టర్, ఉన్నతాధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ 'బలిచక్ర కేంద్రంలో గత 3 నెలల్లో యాంటినేటల్ కేర్ (%ూచీజ%) కోసం ఎంత మంది గర్భిణీ(ప్రెగ్నెంట్స్) లను రిజిస్టర్ చేశారు? ఏయే గ్రామాలకు వెళ్లారు? ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఎంత మంది పేర్లను రిజిస్టర్ చేశారు? 2024 ఫస్ట్ త్రైమాసికంలో స్టేట్ యావరేజ్ (88.7 శాతం) ఉంటే ఈ మండలంలో 77.1 శాతం మాత్రమే నమోదైంది. కారణాలేమిటి?"అనే అంశంపై ఆరా తీశారు. దీంతోపాటు " బీసీ, షుగర్ టెస్టుల్లో, పోషకాహారం అందించడంలో, మహిళా సంఘాలకు రివాల్వింగ్ ఫండ్ అందించడంలో కూడా 3 నెలల్లోనే 100 శాతం లక్ష్యాన్ని చేరుకున్నట్లు చూపుతున్నారు. ఎట్లా సాధ్యమైంది? మీరు తీసుకున్న చర్యలేమిటి? అట్లాగే భూసార పరీక్షల శాంపిల్స్ తీసుకోలేదని మీ రిపోర్ట్ లో ఇచ్చారు. కొన్ని బ్లాకుల్లో శాంపిల్స్ తీసుకున్నారు కదా? మీరెందుకు సేకరించలేకపోయారు?" అనే అంశంపై అధికారుల నుండి వివరాలు తీసుకున్నారు.అనంతరంర "సమగ్రతా అభియాన్" కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ ను ఉద్దేశించి నర్వ మండల కేంద్రంలో ప్రజలు తనతో మొరపెట్టుకున్న సమస్యలన్నీ పరిష్కరించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని బండి సంజయ్ సూచించారు. వచ్చే ఏడాదిలో మార్చి లేదా ఏప్రిల్ లో మళ్లీ నర్వాకు విచ్చేస్తానని, ఆలోపు రోడ్డు నిర్మాణంతోపాటు కనీస సౌకర్యాలన్నీ కల్పించాలని చెప్పారు.

అక్కడి నుండి నేరుగా బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి జె.సంగప్పలతో కలిసి యాద్గిర్ లోని బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయాన్ని సందర్శించారు. జిల్లాలో పార్టీ అభ్యున్నతి కోసం చేస్తున్న కార్యక్రమాలపై ఆరా తీశారు. కర్నాటకలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపైనా, గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుపై రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీయాలని కోరారు. తెలంగాణలో తాను అధ్యక్షుడిగా ఉన్న సమయంలో కార్యకర్తలతో కలిసి చేసిన పోరాటాలను ప్రస్తావించారు. ఆ సమయంలో వేలాది మంది కార్యకర్తలపై కేసులు నమోదు చేసి జైలుకు పంపారని, తనపైనా 119 కేసులు నమోదు చేయంతోపాటు రెండు సార్లు జైలుకు పంపారని అన్నారు. మీరంతా ప్రజల పక్షాన పోరాడాలని, కేసులకు వెరవొద్దని సూచించారు. అక్కడి నుండి గురుమిత్కల్ నియోజకవర్గ ఎమ్మెల్యే శరణ గౌడ నివాసానికి మర్యాదపూర్వకంగా వెళ్లారు.

ఇదిలా ఉండగా శుక్రవారం ఉదయం కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కర్నాటకలోని రాయచూర్ జిల్లాలో పర్యటించి ఆకాంక్షిత బ్లాక్ ను సందర్శిస్తారు. అనంతరం జిల్లా కలెక్టరేట్ లో ఉన్నతాధికారులతో సమావేశమై నీతి అయోగ్ ప్రతిపాదిత కార్యక్రమాల అమలుపై సమీక్షిస్తారు. అనంతరం జోగులాంబ గద్వాల జిల్లాలోని గట్టు మండల కేంద్రాన్ని సందర్శిస్తారు. స్థానికులతో సమావేశమై గట్టు మండలంలో ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుంటారు.

# సినిమా వాళ్ళు బెదరించే ప్రయత్నం

● సిఎం తీరుపై మండిపడ్డ హరీష్ రావు



**హైదరాబాద్,డిసెంబర్26 వెలుతురు:** సినిమా వాళ్లను భయపెట్టి సీఎం మంచి చేసుకోకూడదని బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. సంధ్య థియేటర్ ఘటనను ప్రభుత్వం రాజకీయం చేస్తోందని అన్నారు. గురుకులాల్లో మృతి చెందిన వారి కుటుంబాలను సీఎం పరామర్శించిన సందర్భాలు లేవు. రాష్ట్రంలో ఓ సర్పంచి ఆత్మహత్య చేసుకుంటే.. అందుకు కారణమైన సీఎం తమ్ముడిని ఎందుకు అరెస్టు చేయలేదు? చట్టం అందరికీ సమానమన్న సీఎం.. వాళ్ల తమ్ముడిపై చర్యలు ఎందుకు తీసుకోలేదని హరీశ్‌రావు ప్రశ్నించారు. సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో తీవ్రంగా గాయపడి కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ్‌ను గురువారం భారాస నేతలు పరామర్శించారు. ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, వివేకానంద, బండారు లక్ష్మారెడ్డి, సీనియర్ నేతలు ఎర్రబెల్లి దయాకర్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, నవీన్ రావు తదితరులు ఆసుపత్రికి చేరుకుని బాలుడి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు, కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని ప్రకటించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. 'శ్రీతేజ్‌కు మెరుగైన వైద్యం అందిస్తున్నట్టు కిమ్స్ డాక్టర్లు చెప్పారు. బాలుడు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాం. శ్రీతేజ్ తండ్రి భాస్కర్‌కు మనోధైర్యం ఇమ్మని కేసీఆర్ ఆదేశించారు. మృతిచెందిన రేవతి ఆత్మకు శాంతి చేకూరాలని దేవుడిని ప్రార్థిస్తున్నాం.

### అక్రమ అరెస్టులతో రేవంత్‌రెడ్డి పాలన
### రాష్ట్రంలో ప్రజాస్వామ్యానికి భంగం : హరీశ్‌రావు

సీఎంగా రేవంత్‌రెడ్డి అయిన తరువాత నుంచి అక్రమ అరెస్టులు పెరిగాయని, అక్రమ అరెస్టులతో ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తున్నాడని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. బీఆర్ఎస్ సీనియర్ నేత, ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ అరెస్టును సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. ఉదయాన్నే పోలీసులు ఇంటి వద్దకు వచ్చి అక్రమ అరెస్టు చేయడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు కనీస సమాచారం ఇవ్వకుండా, ఎలాంటి నోటీసు లేకుండా అరెస్ట్ చేయడం పూర్తిగా అప్రజాస్వామికమన్నారు. ఇది ఇందిరమ్మ రాజ్యమా.. పోలీస్ రాజ్యమా? అంటూ ఎక్స్ వేదికగా ఫైర్ అయ్యారు. అడిగితే అరెస్టులు.. ప్రశ్నిస్తే కేసులు.. నిలదీస్తే బెదిరింపులు అంటూ విరుచుకుపడ్డారు. ప్రజాస్వామ్య పాలన అని డబ్బా కొడుతూ, రాక్షస పాలన కొనసాగిస్తున్నారన్నారు. సెలవు రోజుల్లో కావాలని బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేస్తూ సీఎం నియంతలా వ్యవహరిస్తున్నారని వ్యాఖ్యలు చేశారు. హోం మంత్రిగా శాంతి భద్రతల నిర్వహణలో విఫలమైన రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ కార్యకర్తలను వేధించడంపైనే దృష్టి పెట్టారన్నారు. ఈ పైశాచిక ఆనందం ఎక్కువ కాలం నిలవదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, మీ పిట్ట బెదిరింపులు, అక్రమ కేసులకు భయపడే వారు మేము కాదని గుర్తుంచుకోండి. తెలంగాణ సమాజమే మీకు తగిన బుద్ధి చెబుతుందని హరీశ్‌రావు ట్వీట్ చేశారు.

# విశాఖ ఉక్కుపై మోడీ సవతితల్లి ప్రేమ

● తక్షణమే సెయిల్‌లో విలీనం చేయాలి

● కర్నాటకపై ఉన్న ప్రేమ విశాఖపై లేదు

● పిసిసి చీఫ్ షర్మిల ఘాటు విమర్శలు



**విజయవాడ,డిసెంబర్26 వెలుతురు:** విశాఖ ఉక్కును ఉద్ధరిస్తున్నామని కేంద్రం చెప్తున్నవన్నీ అసత్యాలేనని, స్టీల్ ఎ÷-లాంట్ మీద కేంద్రానికి ఉండేది ఎన్నటికీ సవతి తల్లి ప్రేమనేనని పిసిసిచీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి విమర్శించారు. మోడీకి కన్నడ ఉక్కు మీదున్న ప్రేమ ఆంధ్రుల హక్కు మీద లేదని తీవ్ర విమర్శలు చేశారు. విశాఖ స్టీల్ ను దివాలా తీయించే ఎత్తుగడలు సాగుతూనే ఉన్నాయని,- మోడీ సన్నిహితులకు పదో పరక కింద అమ్మే కుట్రలు జరుగుతూనే ఉన్నాయన్నారు. ప్రైవేటీకరణ లేదు అంటూనే రూపాయి సహాయం చేయకుండా ప్లాంట్ ను మూసేసే కుట్ర కేంద్రం చేస్తుందన్నారు. కేంద్ర ఉక్కుశాఖ మంత్రి ఊఆ కుమారస్వామి ప్రాతినిధ్యం వహించే రాష్ట్రంలో కర్ణాటక స్టీల్ ప్లాంట్ కి రూ.15వేల కోట్ల సహాయం అందించి ఆ స్టీల్ ప్లాంట్ ను బ్రతికించారని అన్నారు. కేవలం 243 మంది పనిచేసే కర్ణాటక స్టీల్ ప్లాంట్ కు పెద్ద మొత్తంలో నిధులు ఇచ్చిన కేంద్రానికి.. 26 వేల మంది పనిచేసే విశాఖ స్టీల్ ను ఆదుకోవడానికి మనసు లేదని విమర్శించారు. ఇద్దరు ఎంపీలు ప్రాతినిధ్యం ఉండే జెడిఎస్ రూ.15వేల కోట్లు నిధులు రాబట్టుకుంటే.. బిజెపికి ఊపిరి పోసిన టీడీపీ,- జనసేన పార్టీలు మోడీకి సలాం కొడుతున్నాయని.. 18 మంది ఎంపీలు కేంద్రానికి గులాంగిరి చేస్తున్నారని విమర్శించారు. విశాఖ ఉక్కు పరిశ్రమలో జీతాలు ఇచ్చే పరిస్థితి లేదని, ముడిసరుకు కొరతతో ఉత్పత్తి తగ్గిందని, - ప్లాంట్ దివాలా తీసే స్థాయిలో ఉందని, కేంద్రం తక్షణ ఆర్థిక సహాయం ప్రకటించి ఆదుకోవాలని కోరారు. కార్మికులు 1400 రోజులుగా ఉద్యమాలు చేస్తుంటే ముఖ్యమంత్రి చంద్రబాబు మోడీతో మిట్టల్ స్టీల్ గురించి చర్చ చేస్తున్నారని మండిపడ్డారు. -వైజాగ్ స్టీల్ కు కేంద్రం నిధులు ఇవ్వాలని.. ప్లాంట్ ను సెయిల్‌లో వెంటనే విలీనం చేయాలని డిమాండ్ చేశారు. 7 మిలియన్ టన్నుల ఉత్పత్తి ప్రారంభించి.. భవిష్యత్తులో 20 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యం పెంచాలని సూచించారు. - ఇవి సాధించడం చేతకాకపోతే వెంటనే ఔఅం భాగస్వామ్యం నుంచి టీడీపీ, జనసేనలు తప్పుకోవాలని డిమాండ్ చేశారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్

● కేసులతో భయపెట్టలేరని విమర్శలు

● ఇచ్చిన హామీలపై శ్రద్ధ పెట్టాలన్న వేముల



**నిజామాబాద్,డిసెంబర్26 వెలుతురు:** ఏడాది పాలనలోనే కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందని, రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడిందని బాల్కొండ ఎమ్మెల్యే, మాజీమంత్రి వేముల ప్రశాంతరెడ్డి విమర్శించారు. ప్రస్తుతం రాష్ట్రంలో డైవర్షన్ పాలిటిక్స్ నడుస్తున్నాయే తప్ప ఏ రంగం పైనా శ్రద్ధ చూపడం లేదని ధ్వజమెత్తారు. కాంగ్రెస్‌కు సినీ హీరో అల్లు అర్జున్ మీద ఉన్న శ్రద్ధ ప్రజా సంక్షేమంపై లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. రైతు భరోసా రాక, రుణమాఫీ రాక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రాబోయే రోజుల్లో ఈ ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయలేని ప్రభుత్వాన్ని అడుగడుగునా నిలదీస్తున్నందుకే రేవంత్ సర్కారు అక్రమంగా కేసులు పెట్టిస్తున్నదని వేముల మండిపడ్డారు. కేసులతో తమ గొంతు నొక్కలేరని స్పష్టం చేశారు.కేటీఆర్‌పై నమోదు చేసిన కేసు రాజకీయ కక్ష సాధింపులో భాగమేనని గురువారం విమర్శించారు. ఈ రకమైన కాంగ్రెస్ దుశ్చర్యలు బీఆర్ఎస్ నేతల నైతిక స్థైర్యాన్ని దెబ్బతీయలేవని స్పష్టం చేశారు. కేటీఆర్ అంటే రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి వణుకు పుడుతున్నదని, ప్రజా సమస్యలపై ఆయన సాగిస్తున్న పోరాటాలకు భయపడి కేసులతో వేధిస్తున్నదని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ ప్రశ్నిస్తే తట్టుకోలేకపోతున్న కాంగ్రెస్ ప్రభుత్వం దబాయింపు ధోరణితో అక్రమ కేసులు పెడుతున్నదని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వ దుర్మార్గ విధానాలకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ శ్రేణులు పోరాడుతాయని హెచ్చరించారు. ప్రజాస్వామ్యవాదులు అక్రమ కేసులు పెట్టడాన్ని ఖండించాలని ఈజకీయంగా ఎదుర్కోలేని కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్‌ను, కేసీఆర్‌ను లక్ష్యంగా చేసుకుని బనాయిస్తున్న కేసులను ప్రజలు గమనిస్తున్నారు. అసెంబ్లీలో చర్చకు ధైర్యం చేయలేని ముఖ్యమంత్రి.. క్రమ కేసులతో భయభ్రాంతులకు గురిచేయాలని చూడడం రాజకీయ అమాయకత్వం తప్ప మరొకటి కాదు. కేసీఆర్ సైనికులం, తెలంగాణ ఉద్యమ పోరాటం నుంచి పుట్టుకొచ్చిన మమ్మల్ని మీ చిల్లర వ్యూహాలు భయపెట్టలేవు. పోరాటం మాకు కొత్త కాదు. అక్రమ కేసులతో గొంతు నొక్కలేరని హెచ్చరించారు. అధికారంలోకి వచ్చి సంవత్సరం అయినా హామీలు అమలుచేయలేక ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను మళ్లించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నదని అన్నారు.

# తమిళనాడులో అదుపుతప్పిన శాంతిభద్రతలు

● డిఎంకెను గద్దె దించే వరకు చెప్పులు ధరించను

● రాష్ట్ర అధ్యక్షుడు కె. అన్నామలై భీష్మ ప్రతిజ్ఞ



**కోయంబత్తూర్,డిసెంబర్26 వెలుతురు:** తమిళనాడు రాజధాని చెన్నైలోని అన్నాయూనివర్సిటీలో ఓ విద్యార్థినిపై అత్యాచార ఘటన ప్రకంపనలు సృష్టిస్తోంది. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపుతప్పిపోయాయని, దీనికి అధికార డీఎంకే ప్రభుత్వమే కారణమని భాజపా విమర్శలు గుప్పిస్తోంది. ఈ క్రమంలో భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కె. అన్నామలై భీష్మ ప్రతిజ్ఞ చేశారు. డీఎంకే అధికారం కోల్పోయేంత వరకు తాను పాదరక్షలు ధరించబోనని ప్రతినబూనారు. గురువారం కోయంబత్తూర్‌లో విలేకరులతో మాట్లాడుతూ డీఎంకే ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. డీఎంకే ప్రభుత్వాన్ని గద్దెదించే వరకు నేను పాదరక్షలు ధరించను. చెప్పులు లేకుండానే నడుస్తా. ఎన్నికల్లో విజయం సాధించడానికి ఎప్పటిలాగే డబ్బులు ఎరగా చూపం. రూపాయి కూడా పంచకుండా ఎన్నికలకు వెళ్తాం. ఎన్నికల్లో విజయం సాధించేంత వరకు చెప్పులు ధరించను' అని అన్నామలై అన్నారు. అంతేకాకుండా రాష్ట్రంలో చెడు అంతమైపోవాలని కోరుతూ కోయంబత్తూరులోని తన నివాసంలో ఆరు కొరడా దెబ్బలు భరించి... మురుగున్‌కు మొక్కు చెల్లించుకుంటానని అన్నారు. రాష్ట్రంలోని ఆరు మురుగన్ క్షేత్రాలను దర్శించుకునేందుకు 48 గంటలపాటు ఉపవాస దీక్ష చేపడతానన్నారు. మరోవైపు అన్నా యూనివర్సిటీకి చెందిన బాధిత విద్యార్థిని ఫిర్యాదుకు సంబంధించిన 'ఎఫ్ఐఆర్'ను లీక్ చేయడంపై అన్నామలై మండిపడ్డారు. ఆమె వ్యక్తిగత గోప్యతకు భంగం వాటిల్లేలా పోలీసు అధికారుల తీరు ఉందని విమర్శించారు. లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడు జ్ఞానశేఖరన్‌పై రౌడీషీట్ తెరవలేదని, డీఎంకేతో అతడికున్న సంబంధాలే అందుకు కారణమని ఆరోపించారు. పక్కా ప్రణాళిక ప్రకారం కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.

# రేవంత్‌కు సోఫా పంపాల్సిందే

● ఎక్స్ వేదికగా అంబటి సెటైర్లు

**గుంటూరు,డిసెంబర్26( వెలుతురు):**



ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయాలపై తరచూ విమర్శలు చేసే వైసీపీ నేత అంబటి రాంబాబు ఈసారి రేవంత్ రెడ్డిని టార్గెట్ చేశారు. సినీ ప్రముఖులు ఆయనతో భేటీ అయిన టైంలో ఓ సెటైరిక్ పోస్టు పెట్టారు. ఎక్స్ వేదికగా పూర్తి పరిష్కారానికి 'సోఫా' చేరాల్సిందేనంటూ రాసుకొచ్చారు. పుష్ప-2లో 'సోఫా' సీన్స్ ఉంటాయి. తనకు వ్యతిరేకంగా ఉన్న వాళ్లను కొనేందుకు, తనకు అనుకూలంగా పని చేసే వాళ్లకు పుష్పరాజ్ 'సోఫా' పంపిస్తుంటారు. అందులో భారీ స్థాయిలో డబ్బు ఉంచి పంపిస్తుంటారు. అదే అంశాన్ని అంబటి రాంబాబు ప్రస్తావించారు. అంటే డబ్బులు ఇస్తే సినిమా ఇండస్ట్రీ సమస్యలు పరిష్కరిస్తామంటూ అర్థం వచ్చేలా ఆయన ఈ ట్వీట్ చేశారు. సంధ్య థియేటర్ కేసులో మొదటి నుంచి అల్లు అర్జున్‌ను వైసీపీ వెనకేసుకొచ్చింది. అల్లు అర్జున్‌ను అనవసరంగా రేవంత్ ప్రభుత్వం అరెస్టు చేసిందని ఆరోపించింది. ఇందులో ఏపీలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం పాత్ర ఉందని విమర్శలు కూడా చేసింది.

# జొమాటో బాయ్‌ను నిలదీసిన సుమిత్ హర్దియా

● దీపావళి రోజు రాముని వస్త్రాధరణలో డెలివరీ చేస్తారా..?

**న్యూఢిల్లీ, డిసెంబర్ 26 ( వెలుతురు):** దీపావళి రోజున రాముని వేషంలో వస్తారా?.. ఇది శాంటా క్లాజ్ వేషధారణలో ఉన్న ఓ ఫుడ్ డెలివరీ బాయ్‌కి ఎదురైన ప్రశ్న. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో.. క్రిస్మస్ కావడంతో శాంటా క్లాజ్ దుస్తులు వేసుకున్న ఓ జొమాటో డెలివరీ బాయ్ వినియోగధారులకు ఫుడ్ సప్లయ్ చేస్తున్నారు. ఈ క్రమంలో హిందూ జాగరన్ మంచ్ ఇండోర్ అధ్యక్షుడు సుమిత్ హర్దియా అతడిని అడ్డుకున్నారు. మీరు శాంటా క్లాజ్‌లా దుస్తులు ధరించి ఆర్డర్‌ని డెలివరి చేస్తున్నారా అని ప్రశ్నించాడు. దీంతా ఆ ఏజెంట్ అవునని చెప్పాడు. ఇలాగే దీపావళి పండుగ నాడు ఎప్పుడైనా రాముని వేశం వేసుకుని ప్రజల ఇండ్లకు వెళ్లారా అని నిలదీశారు. లేదని, కానీ ఇప్పుడు మాత్రం కంపెనీ ఆదేశాలతోనే ఈ దుస్తులు ధరించాలని, ప్రజలకు సందేశం



ఇవ్వాలని చెప్పిందని డెలివరీ బదులిచ్చారు. అనంతరం ఆ దుస్తులను అతడు విప్పేశాడు. మనం హిందువులం. ఇలాంటి దుస్తులు వేసుకుని పిల్లలకు ఏం సందేశం ఇస్తున్నామని సుమిత్ ప్రశ్నించారు. అలాంటి సందేశం ఏదైనా ఇవ్వాలనుకుంటే శాంటాక్లాస్ దుస్తులు వేసుకోవడం తప్పనిసరా అన్నారు. అలాంటప్పుడు భగత్ సింగ్, చంద్రశేఖర్ ఆజావ్‌లా కూడా దుస్తులు ధరించాలని తెలిపారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతున్నది.

# ఎర్రోళ్లను వెంటనే విడుదల చేయాలి

● ఇంట్లోకి చొరబడి ఎందుకు అరెస్ట్ చేశారు

● బిఆర్ఎస్ నేతలు పల్లె, కేతిరెడ్డిల విమర్శ



**హైదరాబాద్,డిసెంబర్26 వెలుతురు :** విద్యార్థి ఉద్యమ నేత, ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్ అరెస్టను బీఆర్ఎస్ నేత పల్లె రవికుమార్ గౌడ్ తీవ్రంగా ఖండించారు. ఇందిరమ్మ రాజ్యమంటే ప్రజల కోసం పనిచేసే వారి ఇళ్లల్లోకి పోలీసులే దొంగల్లా చొరబడి అరెస్టులు చేయడమా? అని ఆయన ప్రశ్నించారు. సమయం, సందర్భం లేకుండా.. ఎప్పుడంటే ఎప్పుడు అరెస్టులు చేయడం ఏంటని నిలదీశారు. ఎర్రోళ్ల శ్రీనివాస్ విద్యార్థి నాయకుడిగా తెలంగాణ కోసం నిజాయితీ, నిబద్ధతతో కొట్లాడినవాడు. బహుజనుల అభ్యున్నతి కోసం ఆరాటపడే యోధుడు అని రవికుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా సబ్బండ వర్గాలకు చేసిన వంచనను ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నేతలను అరెస్టు చేయడమే ప్రజా పాలననా? ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా అరెస్టు చేయడం ఏంటని, అరెస్టు చేసిన డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు రవి కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఎర్రోళ్ల శ్రీనివాస్ అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నట్లు పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి పేర్కొన్నారు. ప్రజా పాలనలో అర్ధరాత్రి, అపరాత్రి, తెల్లవారకముందే అరెస్టులు చేయడం ఏందీ? అని ప్రశ్నించారు. ఎర్రోళ్ల శ్రీనివాస్ ఏమైనా బందిపోటా? ఉగ్రవాదా? గజదొంగనా? అని నిలదీశారు. ప్రశ్నించే గొంతులను అరెస్టు చేయడమే ప్రజా పాలననా? అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో వ్యవహరించడం ఈ ప్రభుత్వంలో లేనట్టు కనిపిస్తుంది? నిజంగా నేరం చేసి ఉంటే ముందుగా నోటీసులు ఇవ్వండి? అరెస్టు చేయాలంటే అరెస్ట్ వారెంట్ చూయించండి? ఇవేమి లేకుండా ఉగ్రవాది లెక్క తెల్లవారకముందే ఇంటికి వచ్చి పట్టుకెళ్ళడం ఇదెక్కడి ప్రజాస్వామ్యం? ప్రజాస్వామ్యక వాదులందరూ ఖండించాల్సిన అరెస్ట్ ఇది కేతిరెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే ఇచ్చిన హామీలు అమలు చేస్తేలేవని ప్రజల పక్షాన నిలబడితే అరెస్టులు చేయడము ప్రజా పాలనలో కామన్ అయిపోయింది. అరెస్టులతో బెదిరింపులతో ప్రశ్నించే గొంతులను నొక్కలేరు ఇది ప్రజాస్వామ్యం ప్రజాస్వామ్యంలో అన్యాయం జరిగితే ప్రశ్నించే హక్కు ప్రతి ఒక్కరికి ఉంది. తెలంగాణ రాష్ట్రంలో అన్యాయాలు, అక్రమాలు, దోపిడీలు, బ్లాక్‌మెయిల్ దందాలు రాష్ట్రంలో శరమాములైపోయాయి. తస్మాత్ జాగ్రత్తగా ఉండాల్సిన సమయం. ఈ సమయములో ప్రజలంతా ఏకధాటిపై ఉండి అన్యాయం ఎదిరించాల్సిందే. న్యాయం కోసం పోరాడాల్సిందే. ఆ పాత్ర పోషిస్తున్న బీఆర్ఎస్ పార్టీ శ్రేణులపై అక్రమ కేసులు, అరెస్టులు, గొంతు నొక్కడాలు ప్రభుత్వానికి అలవాటుగా మారిపోయింది. అక్రమ అరెస్టులకు భయపడేది లేదు ప్రజల పక్షాన నిలబడతాం.. నిలదీస్తాం.. కొట్లాడుతాం. అరెస్టు చేసిన డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాసులను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాని కేతిరెడ్డి వాసుదేవ రెడ్డి పేర్కొన్నారు.

# టిక్కెట్ల రేట్ల పెంపు సామాన్యులపై భారం కాదా?

● వేలకోట్లు ఆర్జించే సినిమాల కోసం ప్రజలపై భారమా

● సందేశాత్మక సినిమాలను విస్మరించిన చిత్రరంగం

● చిత్రపరిశ్రమ తీరుపై మండిపడ్డ నారాయణ

**అమరావతి,డిసెంబర్26 వెలుతురు:** సాధారణంగా ప్రయోజనాత్మమైన సినిమాలు తీస్తే ప్రజలు ఆదరిస్తారని సీపీఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ అన్నారు. మధ్యమధ్యలో మంచి సందేశాత్మక సినిమాలైనా ఒకోసారి ఆడకపోవడం కారణంగా నష్టాలు రావడంతో నిర్మాతలు ముందుకు రావడంలేదని నారాయణ అన్నారు. వేలకోట్లు లాభాలు ఆర్జించే సినిమాలకు టిక్కెట్లు రేట్లు పెంచి సామాన్యులను గుల్ల చేయడాన్ని నారాయణ తప్పుపట్టారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. కొందరు నిర్మాతలు వందల కోట్లతో చిత్రాలు నిర్మించి, అధికంగా వసూలు చేసే నిమిత్తం ప్రేక్షకులపై భారం వేస్తున్నారని తెలిపారు. ఆ క్రమంలో బ్లాక్‌లో టికెట్లు అమ్మేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. అదే విధంగా ప్రభుత్వాల నుంచి ప్రోత్సాహాలు పొందుతూ కూడా ప్రభుత్వం అనుమతితోనే టికెట్ల ధరలు పెంచడానికి ప్రయత్నిస్తూ ఉంటారన్నారు. ఒకవైపు వేయి కోట్ల పెట్టుబడి పెట్టి రెండు వేల కోట్ల వసూళ్ళతో విజయం సాధించామని గర్వంతో ప్రకటించుకొనే ఈ భారీ చిత్ర నిర్మాతలకు అసలు ప్రాథమికంగా ప్రభుత్వాలు సహాయం చేయడమేమిటి అని ప్రశ్నించారు.



సందేశాత్మక చిత్రాలకు కొంతైనా సహాయం చేయకుండా మొండి చేయి చూపిస్తున్నారని విమర్శించారు. నేర ప్రవృత్తి, హింసాయుత ఇతివృత్తం, అసభ్య వ్యంగ్యార్థ సంభాషణలు కలిగిన సినిమాలను ప్రభుత్వాలెందుకు ప్రోత్సహించాలని నిలదీశారు. భారీ చిత్రాల సినిమా హీరోలు.. సినిమా విడుదల సమయంలో రోడ్ షో చేస్తే తొక్కిసలాట జరగొచ్చు ముందుగా గ్రహించి రోడ్ షో చేయకుండా ఉండేందుకు చర్యలు తీసుకోకుండా ప్రభుత్వం నిరోధించలేక పోయిందని విమర్శించారు. ఎర్రచందన అక్రమ రవాణాలు, వాటి విక్రయం అనేవి పూర్తి చట్టవిరుద్ధమైన చర్యలని తెలిసీ.. వాటిని కథా వస్తువుగా గ్రహించి, దాని చుట్టూతా యువతని మాయచేసి ఆకర్షించే సంభాషణలు, పాటలు, సీన్‌లు, డాన్సులు, అల్లర్లు చేస్తున్నారని మండిపడ్డారు.సాంఘిక బాధ్యతను పక్కనబెట్టి కేవలం ధనార్జనే పరమావధిగా వ్యాపారాలు చేసే బడా నిర్మాతలను ప్రభుత్వాలే టికెట్ ధరల రూపంలో ప్రోత్సహించడం తీవ్రంగా చర్చ చేయాల్సిన విషయమన్నారు. చిత్రంలోని పాటలకున్న సాహిత్యం వాటిని అభినయించే తీరును స్వయానా హీరోయిన్ రష్మికయే ప్రశ్నించిందన్నారు. నిర్మాత వత్తిడి కారణంగా తప్పని స్థితిలో చేశానని అంగీకరించిన విషయం అందరికీ తెలిసిందే అని అన్నారు. పుష్ప హీరోయిన్ ఆవేదన ప్రభుత్వానికి ఆదర్శం కావాలన్నారు. కళారంగం లక్ష్మణ రేఖను దాటకూడదని చెప్పుకొచ్చారు. అదే విధంగా భారీగా ఖర్చు చేసి అనైతిక సినిమాలు తీసి వేలకోట్లు లాభాలార్జిస్తు రాయతీలు కోసం పైరవీలు, ప్రజల మీద భారం పడేట్లు ప్రభుత్వం పాల్పడకూడదని హితవుపలికారు. ఈ నేపథ్యంలో 'ప్రభుత్వానికి సినిమా నాయత్వానికి, దానికి సారథ్యం వహిస్తున్న దిల్ రాజు మధ్య జరుగనున్న చర్చలలో భారత కమ్యూనిస్టు పార్టీ తరపున మేం కోరేదేమంటే. కథా ఇతివృత్తం, సాంఘిక బాధ్యత పోషణ, తెలుగు సమాజం, వాటి కళా విలువల సంరక్షణ వంటి ప్రధాన లక్షణాల ఆధారంగా మాత్రమే ప్రభుత్వాలు ఇదమిద్ధమైన సినిమాను ప్రోత్సహించాలో లేదో నిర్ణయాలు తీసుకునే ఒక సమతూకతో కూడిన వ్యవస్థ కోసం ప్రభుత్వమే సంకల్పించాలి. అదే విధంగా సినిమా నిర్మాణ వ్యవస్థ, ప్రజలు, ప్రభుత్వాలు, పాలనాయంత్రాంగం అన్నీ వారి బాధ్యతలు సమర్థంగా సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకొని అమలుచేయాలని నారాయణ కోరారు.

# ఈ ఏడాదిలో సినీ ఇండస్ట్రీలో విషాదాలు

## చనిపోయిన వారిలో ప్రముఖులు




సంవత్సరం భారతీయ సినీ ఇండస్ట్రీలో పలు విషాదాలు నింపిన విషయం తెలిసిందే. సంగీత దిగ్గజం జాకీర్ హుస్సేన్‌తో పాటు, ప్రజా గాయకుడు గద్దర్, దిగ్గజ దర్శకుడు శ్యామ్ బెనెగల్ వంటి ప్రముఖులు కాలం చేశారు. అయితే ఈ ఏడాది మరణించిన సినీ ప్రముఖులు ఎవరెవరో అనేది ఒకసారి చూసుకుంటే.! దిగ్గజ దర్శకుడు శ్యామ్ బెనెగల్ కూడా.. ఈ ఏడాది మరణించిన ప్రముఖులలో ఒకడు. గత కొన్ని రోజులుగా మూత్రపిండాలకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్న 90 సంవత్సరాల శ్యామ్ బెనెగల్ డిసెంబర్ 23న సాయంత్రం ముంబైలోని వోడ్‌హార్డ్ దవాఖానలో తుది శ్వాస విడిచారు. అంకుర్, భూమిక, జునూన్, కలియుగ్, ఆరోహన్, త్రికాల్, సుస్మాన్, అంతర్‌నాద్, మండి, మంథన్ తదితర అనేక అవార్డు చిత్రాలకు శ్యామ్ బెనెగల్ దర్శకత్వం వహించారు. 1978లో వాణిశ్రీ, అనంతనాగ్‌లతో ఆయన తీసిన ఏకైక తెలుగు చిత్రం అనుగ్రహం 1979 బెర్లిన్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శనకు నోచుకుని విమర్శకుల ప్రశంసలు అందుకుంది. డిసెంబర్ 14న ఆయన మిత్రులు, కుటుంబ సభ్యులతో కలసి తన 90వ పుట్టినరోజును ఘనంగా జరుపుకున్నారు. 1976లో పద్మశ్రీ అవార్డు, 1991లో పద్మ భూషణ్ అవార్డుతో భారత ప్రభుత్వం ఆయనను గౌరవించింది. ఆయన దర్శకత్వం వహించిన విజయవంతమైన చిత్రాలలో మంథన్, జుబేదా, సర్దారీ బేగం కూడా ఉన్నాయి. ఈనాడు సంస్థల అధినేత, మీడియా మొగల్ రామోజీరావు మరణించారు. జూన్ 07న రాత్రి రామోజీ రావు అస్వస్థతకు గురవడంతో కుటుంబసభ్యులు ఆయనను నానక్‌రామ్‌గూడలోని స్టార్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున జూన్ 08న 4.50 గంటలకు తుదిశ్వాస విడిచారు. 1936, నవంబర్ 16న ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా పెదపారుపూడిలో చెరుకూరి వెంకటసుబ్బారావు, సుబ్బమ్మ దంపతులకు రామోజీరావు జన్మించారు. చిననాటినుంచే విలక్షణ, సృజనాత్మకత కలిగిన ఆయన.. ఈనాడు దినపత్రికను ప్రారంభించి సంచలనం సృష్టించారు. 1974, ఆగస్టు 10న విశాఖపట్టణంలో ఈనాడును ప్రారంభించారు. అనంతరం సితార సినీ పత్రిక, ఈటీవీ చానళ్లను కూడా తీసుకొచ్చి మీడియా మహా సామ్రాజ్యాన్ని నిర్మించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఫిల్మ్ సిటీని నిర్మించారు. సినిమా మొత్తాన్ని అక్కడే షూటింగ్ చేసుకునేలా సకల వసతులు కల్పించారు. ప్రపంచ ప్రఖ్యాత తబలా విద్వాంసుడు ఉస్తాద్ జాకీర్ హుస్సేన్ (73) ఈ నెలలోనే కన్నుమూశారు. హృద్రోగ సంబంధ సమస్యలతో రెండు వారాలుగా ఆయన అమెరికా శాన్‌ఫ్రాన్సిస్కోలోని దవాఖానలో చికిత్స పొందుతున్నారు. అయితే డిసెంబర్ 15న అతడి పరిస్థితి విషమించడంతో ఐసీయూలో చేర్చగా తుదిశ్వాస విడిచాడు. భారత శాస్త్రీయ సంగీతంలో జాకీర్ తనదైన ముద్ర వేశారు. తండ్రి వద్దనే సంగీతాన్ని అభ్యసించి ఏడేండ్ల వయసులోనే ఆయన కచేరీలలో తబలా వాయించేవారు. ముంబైలో గ్రాడ్యుయేషన్, జాకీర్ యూనివర్సిటీ ఆఫ్ వాషింగ్టన్ నుంచి సంగీతంలో డాక్టోరల్ డిగ్రీని పూర్తి చేశారు. ఆరు దశాబ్దాల సంగీత ప్రస్థానంలో హుస్సేన్ ప్రతిష్టాత్మకమైన ఐదు గ్రామీ అవార్డులు గెల్చుకున్నారు. పలు భారత, అంతర్జాతీయ కళాకారులతో ఆయన ప్రపంచ వ్యాప్తంగా పలు ప్రదర్శనలు ఇచ్చారు. జాకీర్ హుస్సేన్ 1991లో సంగీత నాటక అకాడమీ అవార్డు పొందారు. 2016లో అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా వైట్‌హౌస్‌కు ఆహ్వానం పొందిన తొలి భారతీయ సంగీతకారుడు హుస్సేనే. ఆయన సేవలకు భారత ప్రభుత్వం1988లో పద్మశ్రీ, 2002లో పద్మ భూషణ్, 2023లో పద్మ విభూషణ్ అవార్డులతో సత్కరించింది. ప్రజా గాయకుడు, రచయిత, యుద్ధనౌక గద్దర్(74) ఈ ఏడాది ఆగస్టులో కన్నుమూశారు. అనారోగ్యంతో అపోలో ఆస్పత్రిలో చేరిన ఆయన.. చికిత్స పొందుతూ ఆగస్టు 6 న తుదిశ్వాస విడిచారు. ప్రజా గాయకుడిగా, రచయితగా, యుద్ధనౌకగా అందరికీ సుపరిచితమైన గద్దర్ అసలు పేరు గుమ్మడి విఠల్ రావు. తెలంగాణ ఉద్యమానికి తన పాటతో ప్రాణం పోసిన యోధుడు గద్దర్. తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని చెబుతూ 'అమ్మా తెలంగాణమా, పొడుస్తున్న పొద్దుమీద.. నడుస్తున్న కాలమా' పాటలతో ఎంతోమందికి స్ఫూర్తి నింపారు. స్వగ్రామానికి వెళ్లి తిరిగొస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ యాక్సిడెంట్‌లో పవిత్ర జయరాం బంధువు ఆపేక్ష, డ్రైవర్ శ్రీకాంత్, సహ నటుడు చంద్రకాంత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అయితే పవిత్ర చనిపోయిన కొన్నిరోజులకే సహ నటుడు చంద్రకాంత్ సుసైడ్ చేసుకొని చనిపోయాడు. ఇంకా మొగిలయ్య, తమిళనటుడు డేనియల్, దర్శకుడు సూర్యకిరణ్, ఉస్తాద్ రసీద్‌ఖాన్,రితురాజ్‌సింగ్, పంకజ్ ఉదాస్, దంగల్ నటి సుహానీ భట్నాగర్, గాయని శారదా సిన్హా, పవిత్ర జయరామ్ తదితరులు మృతి చెందారు.



## ఎల్లమ్మలో నాయికగా సాయిపల్లవి

సినిమాల ఎంపికలో సాయిపల్లవి చాలా సెలెక్టివ్‌గా ఉంటుంది. కథలో కొత్తదనంతో పాటు ఇంట్రెస్టింగ్ ఎలిమెంట్స్ ఉంటేనే అంగీకరిస్తుంది. అందుకే ఆమె ఒప్పుకునే సినిమాల గురించి ప్రేక్షకులు ఆసక్తిని కనబరుస్తారు. ఈ నేపథ్యంలో సాయిపల్లవి తెలుగులో మరో సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే..'బలగం' చిత్రంతో విమర్శకుల ప్రశంసలందుకున్నారు దర్శకుడు వేణు యెల్దండి. ఆయన తన తదుపరి చిత్రంగా 'ఎల్లమ్మ'ను తెరకెక్కించబోతున్నారు. నితిన్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రానికి దిల్‌రాజు నిర్మాత. తెలంగాణ నేపథ్య కథాంశమిది. ఇందులో కథానాయిక పాత్ర చాలా కీలకంగా ఉంటుందని తెలిసింది. ఈ కథ సాయిపల్లవికి బాగా నచ్చడంతో వెంటనే అంగీకరించిందట. అయితే ఈ వార్తలో వాస్తవమేమిటో తెలియాలంటే చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే. ప్రస్తుతం సాయిపల్లవి 'తండేల్' చిత్రంలో నటిస్తున్నది. ఫిబ్రవరిలో ఈ సినిమా విడుదలకానుంది. అనంతరం 'ఎల్లమ్మ' సినిమా పట్టాలెక్కుతుందని సమాచారం.






## నిర్దోషిగా బయటకు వస్తా - జానిమాస్టర్

లైంగిక వేధింపుల కేసులో అరెస్ట్ అయ్యి బెయిల్ మీద బయటకు వచ్చిన కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌పై పోలీసులు కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేశారంటూ వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ వార్తలపై జానీ మాస్టర్ క్లారిటీ ఇచ్చాడు. మీడియాలో వస్తున్న వార్తలు అబద్ధం. న్యాయస్థానంపై నాకు నమ్మకం ఉంది. న్యాయస్థానంలో న్యాయం ఉంది కాబట్టే ఈరోజు ఇలా నేను బయటకు వచ్చి నా పని నేను చేసుకుంటున్నాను అని పేర్కొన్నారు. నా మనసుకు తెలుసు ఏం జరిగిందని.. ఆ దేవుడికి తెలుసు. నా విషయంలో తీర్పును న్యాయం స్థానం నిర్ణయిస్తుంది. న్యాయస్థానం నుంచి నేను నిర్దోషిగా బయటికి వస్తాను. ఆరోజు అందరి ముందుకు వచ్చి మాట్లాడుతాను. నేను ఇప్పుడు నిందితుడిని మాత్రమే. నాకు తెలిసింది ఒక్కటే విద్య. డాన్స్‌తో మిమల్ని ఎంటర్‌టైన్ చేయడం. మీ అందరి దీవెనల వల్లనే నేను ఇప్పుడు ఈ స్థానంలో ఉన్నాను.. మీ అందరిని అలరించడానికి కష్టపడతాను.. మీ ప్రేమ ఎల్లప్పుడూ ఇలానే ఉండాలని కోరుకుంటున్నాను అని ఆయన చెప్పుకొచ్చారు.

## ప్రేక్షకుల ముందుకు వస్తున్న అనగనగా ఒక రాజు

### నవీన్ పొలిశెట్టి ప్రీవెడ్డింగ్ వీడియో రిలీజ్

జాతి రత్నాలు, ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ సినిమాలతో హీరోగా సూపర్ బ్రేక్ అందుకోవడమే కాకుండా.. తన ఫ్యాన్ బేస్‌ను అమాంతం పెంచేసుకున్నాడు నవీన్ పొలిశెట్టి. మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి సినిమా తర్వాత నవీన్‌పొలిశెట్టి కాంపౌండ్ నుంచి వస్తోన్న సినిమాల్లో ఒకటి అనగనగా ఒక రాజు. చాలా రోజుల తర్వాత నవీన్ పొలిశెట్టికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ.. ప్రీ వెడ్డింగ్ వీడియో లాంచ్ చేశారు మేకర్స్. రాజుగారి పెళ్లి విందులో చమ్మక్ చంద్ర అరేయ్ ఇది రాజుగారి పెళ్లి.. గెస్టులందరికీ గోల్డ్ ప్లేట్స్ మాత్రమే పెట్టండి.. అంటూ చెప్పే డైలాగ్స్‌తో మొదలైంది ప్రీ వెడ్డింగ్ వీడియో. అతిథుల్లో ఓ వ్యక్తి ఏంటండి వీళ్లు ప్లేటు గోల్డ్.. స్వీటు గోల్డ్ అంటున్నారు.. ఇదేమైనా మలబార్ గోల్డ్ వాళ్ల పెళ్లా అని అడుగుతుంటే.. మరో వ్యక్తి ఏవండి ఇది మా రాజుగారి పెళ్లండి అని అంటున్నాడు. నవీన్ పొలిశెట్టి ముఖేశ్ అంబానీ కుమారుడు అనంత్ అంబానీ వెడ్డింగ్ క్యాసెట్ చూస్తూ.. ముఖేశ్ అంబానీకి ఫోన్ చేసి.. ముఖేశ్ మామయ్యా ఈవెంట్‌కు వచ్చిన సెలబ్రిటీల ఫోన్ నంబర్లు పెట్టు చెబుతా.. ఈ ఇయర్ అంతా అంబానీ పెళ్లి.. వచ్చే ఏడాదంతా రాజుగారి పెళ్లి అంటున్నాడు. జాతి రత్నాలు హీరో స్టైల్ ఆఫ్ హ్యూమర్ టచ్‌తో సాగుతున్న వీడియో సినిమాపై సూపర్ హైప్ క్రియేట్ చేస్తోంది. సితార ఎంటర్‌టైన్ మెంట్స్ నిర్మిస్తున్న ఈ మూవీలో మీనాక్షి చౌదరి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో వస్తోన్న ఈ చిత్రాన్ని కో ప్రొడ్యూస్ చేస్తుంది. మిక్కీ జే మేయర్ మ్యూజిక్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నాడు.




## క్రైమ్ థ్రిల్లర్‌గా వస్తున్న నాని

నాని కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'హిట్: ది థర్డ్ కేస్'. సక్సెస్‌ఫుల్ 'హిట్' సినిమా ఫ్రాంచైజీలో వస్తున్న మూడో చిత్రమిది. శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి ప్రశాంతి తిపిర్నేని నిర్మాత. శ్రీనిధిశెట్టి కథానాయిక. ప్రస్తుతం కశ్మీర్‌లో చిత్రీకరణ జరుపుకుంటున్నది. క్రైమ్ థ్రిల్లర్‌గా తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో నాని.. అర్జున్ సర్కార్ అనే పవర్‌ఫుల్ పోలీసాఫీసర్‌గా కనిపించనున్నారు. బుధవారం క్రిస్మస్ సందర్భంగా కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో నాని ట్కస్టైలిష్ లుక్స్‌తో కనిపిస్తున్నారు. కశ్మీర్ షెడ్యూల్‌లో యాక్షన్ ఘట్టాలను తెరకెక్కిస్తున్నామని, ఇవి సినిమాలో హైలైట్‌గా నిలుస్తాయని మేకర్స్ తెలిపారు. వచ్చే ఏడాది మే 1న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సాను జాన్ వర్గీస్, సంగీతం: మిక్కీ జే మేయర్, రచన-దర్శకత్వం: శైలేష్ కొలను.




## తెలుసు సినీ పరిశ్రమను ప్రపంచస్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యం - దిల్‌రాజ్



టాలీవుడ్ సినీ ప్రముఖులతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ అనంతరం ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు మీడియాతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ.. తెలుగు సినీ పరిశ్రమను ప్రపంచస్థాయికి తీసుకువెళ్లడమే లక్ష్యంగా ఈ భేటీ జరిగినట్లు ఆయన తెలిపాడు. హైదరాబాద్‌ను ఇంటర్‌నేషనల్ ఫిలిం హబ్‌గా మార్చడానికి కృషి చేస్తాం. తెలంగాణ సామాజిక కార్యక్రమాల్లో ఫిలిం ఇండస్ట్రీ నుంచి సహకారం ఉండాలని ప్రభుత్వం కోరింది. డ్రగ్స్, గంజాయి లాంటి అవగాహన కార్యక్రమాల్లో ఇకనుంచి నటీనటులు పాల్గొంటారు. బెనిఫిట్ షో, టికెట్ల రేట్ల పెంపు అంశం అనేది చాలా చిన్న విషయం. ఆ రెండింటికి పెద్దగా ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం లేదు. కొన్ని ఘటనల వలన ప్రభుత్వానికి సినీ పరిశ్రమకు గ్యాప్ వచ్చినట్లు ప్రచారం జరిగింది అది నిజం కాదు. టాలీవుడ్ అభివృద్ధిపై 15 రోజుల్లో నివేదిక ఇస్తాం అంటూ దిల్ రాజు చెప్పుకోచ్చాడు.

## అటకెక్కిన ఆరు గ్యారంటీలు : కేటీఆర్

**హైదరాబాద్, డిసెంబర్ 26 ( వెలుతురు):**



ఆరు గ్యారంటీలు ప్రకటించి గద్దెనెక్కిన సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీలను కూడా అటకెక్కించారని మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. బీఆర్ఎస్ సీనియర్ నేత, ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా పనిచేసిన ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను అక్రమంగా అరెస్టుచేయడం దుర్మార్గమైన చర్య అని కేటీఆర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో దళిత, బహుజన వర్గాలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు కోసం బీఆర్ఎస్ తరఫున ప్రశ్నిస్తున్నందుకే ఎర్రోళ్లపై కక్షగట్టి అక్రమ కేసులతో వేధించాలని చూస్తున్నారు. కనీసం నోటీసు కూడా ఇవ్వకుండా తెల్లవారుజామున ఎర్రోళ్ల ఇంటికి వెళ్లి వారి కుటుంబసభ్యులను భయభ్రాంతులకు గురిచేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఇందిరమ్మ రాజ్యంలో ఆరు గ్యారెంటీలను అటకెక్కించి, ఏడో గ్యారెంటీగా ఎమర్జెన్సీని ముఖ్యమంత్రి అమలుచేస్తున్నారు. ప్రజల్లో వెల్లువెత్తుతున్న వ్యతిరేకతను తట్టుకోలేక.. నిర్బంధం, అణచివేతతో బీఆర్ఎస్ గొంతునొక్కే విఫల యత్నం చేస్తున్నారు. రోజురోజుకూ పెరిగిపోతున్న నేరాల నియంత్రణలో పూర్తిగా చేతిలెత్తేసి, ప్రధాన ప్రతిపక్షాన్ని ఎలా నియంత్రించాలనే దానిపైనే సర్వశక్తులు ఒడ్డుతున్నారు. అక్రమంగా అరెస్టుచేసిన ఎర్రోళ్ళ శ్రీనివాస్ ను వెంటనే విడుదల చేయాలి. తప్పుడు కేసులతో రాజకీయ ప్రత్యర్థులను భయపెట్టాలని చూసే విష సంస్కృతికి చరమగీతం పాడాలి. బీఆర్ఎస్ పార్టీకి కేసులు కొత్తకాదు, అరెస్టులు అంత కన్నా కాదు.. ఆత్మగౌరవ పోరాటాలతో సాధించుకున్న తెలంగాణలో ఇలాంటి బెదిరింపు చర్యలకు భయపడే వారెవరూ లేరంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

## విషమంగా మంద జగన్నాథం ఆరోగ్య పరిస్థితి

**హైదరాబాద్, డిసెంబర్ 26 ( వెలుతురు):**

నాగర్‌కర్నూల్ మాజీ ఎంపీ మంద జగన్నాథం ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నది. రెండు రోజుల క్రితం గుండెపోటు రావడంతో ఆయన కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉందని డాక్టర్లు వెల్లడించారు. దీంతో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తోపాటు పలువురు రాజకీయ ప్రముఖులు పరామర్శించారు. 1996లో ఆయన తొలిసారిగా టీడీపీ తరఫున నాగర్‌కర్నూల్ ఎంపీగా విజయం సాధించారు. 1999, 2004లో జరిగిన ఎన్నికల్లో తెలుగు దేశం టికెట్‌పై విజయం సాధించారు. ఆతర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆయన 2009 ఎన్నికల్లో అదే నియోజకవర్గం నుంచి ఎంపీగా గెలుపొందారు. 2014లో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆ ఎన్నికల్లో పోటీచేసి ఓడిపోయారు. 2019 ఎన్నికల్లో ఆయనకు టికెట్ దక్కలేదు. ఈ నేపథ్యంలో 2022, జూలై 1న ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా అప్పటి సీఎం కేసీఆర్ ఆయనను నియమించారు. 2023 నవంబర్ 17న బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. అయితే నాగర్‌కర్నూల్ టికెట్ దక్కకపోవడంతో బీఎస్పీ తీర్థం పుచ్చుకున్నారు.

## బీఆర్ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్ అరెస్టు

**హైదరాబాద్, డిసెంబర్ 26 ( వెలుతురు):**



బీఆర్ఎస్ సీనియర్ నేత, ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అరెస్టు సమయంలో దురుసుగా ప్రవర్తించారంటూ ఎర్రోళ్ల శ్రీనివాస్‌పై పోలీసులు కేసు నమోదుచేశారు. ఈనేపథ్యంలో గురువారం ఉదయం నోటీసులు ఇచ్చేందుకు మారేడ్‌పల్లిలోని ఆయన నివాసానికి టాస్క్‌ఫోర్స్ పోలీసులు చేరుకున్నారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున్న శ్రీనివాస్ నివాసానికి చేరుకున్నారు. పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీంతో ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకుని మాసబ్‌ట్యాంక్ పీఎస్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అన్యాయంగా, అక్రమంగా అరెస్టు చేస్తున్నదని విమర్శించారు. ప్రశ్నించిన వారిని కాంగ్రెస్ సర్కార్ వేధిస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. 14 ఏండ్లపాటు ఉద్యమంలో పాల్గొన్నానని, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా పనిచేశానని చెప్పారు. తెల్లవారుజామున వచ్చి ఇంటి డోర్లు కొట్టడమేంటని ప్రశ్నించారు. ప్రభుత్వం కుట్రపూరితంగా కేసులు పెడుతున్నదని మండిపడ్డారు. ఎన్నికేసులు పెట్టినా, ఎంత నిర్బంధం విధించినా ప్రశ్నిస్తూనే ఉంటానని స్పష్టం చేశారు.

# హిమాచాల్, కాశ్మీర్‌లపై మంచుదుప్పటి

- మంచు కారణంగా జాతీయ రహదారుల మూసివేత
- ఉత్తరాది రాష్ట్రాల్లో పెరిగిన చలిగాలులు

**న్యూఢిల్లీ,డిసెంబర్26 వెలుతురు:**



హిమాచల్‌ప్రదేశ్, జమ్ముకాశ్మీర్, ఉత్తరాఖండ్‌లపై దట్టమైన మంచు దుప్పటి పరుచుకుంది. దట్టమైన మంచుతో పలు జాతీయ రహదారులను మూసివేసినట్లు అధికారులు ప్రకటించారు. హిమాచల్‌ప్రదేశ్‌లో మూడు జాతీయ రహదారులతో పాటు సుమారు 266 రహదారులు మూసివేయబడ్డాయి. మూసివేసిన 266 రహదారుల్లో సిమ్లాలో 123, లాహౌల్‌లో 36, స్పితి, కులులో 25 ఉన్నాయి. 173 ట్రాన్స్‌ఫార్మర్‌లకు అంతరాయం ఏర్పడిందని, దీంతో రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సరఫరాపై తీవ్ర ప్రభావం పడిందని తెలిపింది. హిమాచల్‌ప్రదేశ్‌లో తీవ్రమైన చలి పరిస్థితుల కారణంగా భారత వాతావరణ విభాగం (ఐఎండి) 'ఆరెంజ్' అలర్ట్ జారీ చేసింది. దట్టమైన పొగమంచు ఉండే అవకాశం ఉందని, కొన్ని ప్రాంతాల్లో వారాంతంలో వర్షం, మంచు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో భారీ హిమపాతం కురిసింది. త్యుని-చక్రతా-ముస్సోరి జాతీయ రహదారిపై 30 కి.మీ మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. రాష్ట్రంలోని ధరణాధర్-కోటి కనసర్ రహదారిపై భారీ మంచుతో ఢిల్లీ నుండి వచ్చిన ఇద్దరు పర్యాటకులు చిక్కుకుపోయారని స్థానిక మీడియా తెలిపింది. ఉత్తర భారతదేశంలోని అనేక ప్రాంతాల్లోనూ దట్టమైన మంచు కమ్మేసింది. జమ్ముకాశ్మీర్‌లోని శ్రీనగర్‌లో కనిష్ట ఉష్ణోగ్రత మైనస్ 7 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయింది. ఇకపోతే చలి తీవ్రతతో ఉత్తర భారతం గజగజలాడుతోంది. ఉష్ణోగ్రతలు దారుణంగా పడిపోతున్నాయి. కశ్మీర్‌లోని పలు ప్రదేశాలు చలికి అల్లాడిపోతున్నాయి. జలాశయాలు గడ్డకట్టుకుపోయాయి. నీటి సరఫరా గొట్టాల్లో నీరు గడ్డకట్టేస్తోంది. శ్రీనగర్‌లో మైనస్ 7.3 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. రాబోయే రెండ్రోజుల్లో ఇది మరో 2-3 డిగ్రీల వరకు తగ్గిపోతుందని వాతావరణ విభాగం అంచనా వేసింది. కశ్మీర్‌లో అత్యంత చల్లగా ఉండే 40 రోజుల కాలం ఈ నెల 21న ప్రారంభమైంది. అప్పటి నుంచి కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా ఉంటున్నాయి. అమర్‌నాథ్ యాత్రకు బేస్‌క్యాంపు అయిన పహాల్గామ్‌లో మైనస్ 8.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత ఉంది. రాజస్థాన్‌లోని అనేక ప్రాంతాలను దట్టమైన పొగమంచు కమ్మేస్తోంది. పశ్చిమ రాజస్థాన్‌లోని పలు ప్రాంతాలకు అత్యంత చల్లని రోజుగా బుధవారం నిలిచిపోయింది. పంజాబ్, హరియా ణాల్లోనూ శీతల గాలులు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. దిల్లీని పొగమంచు కప్పేసింది. దిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతాల్లో బుధవారం తెల్లవారుజామున 9.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మంచు దట్టంగా కురుస్తూ.. 100 మీటర్ల దూరంలో ఉన్న వాహనాలు కూడా కన్పించని పరిస్థితి నెలకొంది. దీంతో పలు విమానాలు, రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం వాటిల్లింది. వాయు నాణ్యతా సూచీ (ఏక్యూఐ) 334గా నమోదైంది.

# కేడర్‌ను కాపాడుకునే యత్నం

- కూటమి ప్రభుత్వం విఫలం అయ్యిందన్న ప్రచారం
- కొత్త ఎత్తులతో ప్రజల్లోకి వెళ్లేలా వైకాపా అడుగులు

**అమరావతి,డిసెంబర్26 వెలుతురు:**




ఆంధ్రప్రదేశ్‌లో ఆరు నెలల క్రితం జరిగిన ఎన్నికల్లో వైఎస్ఆర్‌సీపీ ఘోరంగా పరాజయం పాలయ్యాక ఇప్పుడు మళ్లీ తమదే అధికారం అంటూ..ఆ పార్టీ నేతలు బల్లగుద్ది చెబుతున్నారు. పార్టీ అధినేత కూడా కూటమి ప్రభుత్వానికి కాలంచెల్లిందని విమర్శలుచేస్తున్నారు. ఆరునెలల్లోనే ప్రభుత్వం అప్రతిష్టను మూటకట్టుకుం దని, అన్నిరంగాల్లోనూ విఫలంఅయ్యిందని విమర్శలుచేస్తోంది. జనవరి నుంచి నియోజకవర్గాల బాట పట్టాలని వైసీపీ అధినేత జగన్ నిర్ణయించుకున్నారు. దీనికి తగ్గట్టుగానే కేడర్, లీడర్‌లను సమాయత్తం చేసేందుకు అదిగో ఎన్నికలు అన్నట్టు ప్రచారం చేస్తోంది. జమిలి ఎన్నికల బిల్లు పార్లమెంట్‌లో ఉంది. దీనిపై జేపీసీ స్టడీ చేస్తోంది. అది వచ్చే పార్లమెంట్ సమావేశాలకు ఆమోదం పొందుతుంది. అది అమోదం పొంది అమల్లోకి వస్తే మాత్రం 2027లోనే ఎన్నికలు వస్తాయని వైసీపీ చెబుతోంది. అధినేత నుంచి గల్లీ లీడర్ వరకు అంతా అదే ప్రచారం చేస్తున్నారు. దీనికి చాలా కారణాలు ఉన్నాయి. 2024 ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన షాక్ నుంచి ఇంకా చాలా మంది వైసీపీ నేతలు తేరుకోలేక పోతున్నారు. అలాంటి తీర్పు ఎలా ఇచ్చారనే మధనపడుతున్నారు. మరికొందరు కూటమి పార్టీల్లో ఏదో పార్టీలో చేరిపోవాలనే ఆలోచన చేస్తున్నారు. ఇప్పటికే చాలా మంది ఆ పని చేశారు కూడా. కొన్ని నియోజకవర్గాల్లో ఇన్చార్జ్‌లు లేకపోవడంతో ఎవరితో నడవాలో తెలియని పరిస్థితిలో కేడర్ ఉంది. ఇలాంటి స్థితిని హ్యాండిల్ చేయలేకుంటే పార్టీకి భారీగా డ్యామేజ్ తప్పదని గ్రహించిన వైసీపీ ఇదిగో ఎన్నికలు అంటూ ప్రచారం చేస్తోంది. ఒక వేళ 2027లో ఎన్నికలు జరిగితే ఇంకా మూడేళ్లే నాలుగేళ్లే ఉందని నేతలంతా జనంలో ఉంటారని వైసీపీ ఎ÷-లాన్. కేడర్‌లో కూడా ఉత్సాహం ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో 151 అసెంబ్లీ స్థానాలతో దేశ చరిత్రలోనే అతి పెద్ద విజయాన్ని అందుకున్న ఆ పార్టీ ఐదేళ్లు తిరిగే సరికి 11 స్థానాలకు పరిమితం అయింది. ఈ షాక్‌లో ఉన్న కేడర్‌ను, పక్క పార్టీల వైపు చూస్తున్న లీడర్‌ను తమతో ఉంచుకునేందుకు ఎన్నికల పాట అందుకుంది. జమిలీ ఎన్నికలు 2027లోనే వస్తాయని అప్పటి కూటమిపై వ్యతిరేకత తీవ్ర స్థాయిలో ఉంటుందని నూరి పోస్తోంది. దీన్నే జనంలోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తోంది. కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో పగ్గాలు చేపట్టి ఆరు నెలలు అవుతోంది.

గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను క్రమంగా అమలు చేస్తూ వస్తోంది. మరోవైపు పారిశ్రామికవేత్తలను రాష్ట్రంవైపు తిప్పుకునేందుకు పాట్లు పడుతోంది. అమరావతిని పట్టాలు ఎక్కిస్తోంది. హామీల అమలు విషయంలో మాత్రం కాస్త తడబాటు ఉంది. దీన్నే వైసీపీ తమకు అనుకూలంగా మార్చుకుంటోంది . ప్రజల్లో వ్యతిరేకత మరింతగా పెంచేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఈ మధ్య కాలంలోనే రైతులకు సంబంధించిన ధాన్యం కొనుగోలు సరిగా జరగడం లేదని ధర్నాలు చేపట్టింది. విద్యుత్ ఛార్జీలపై కూడా నిరసనలు చేసేందుకు సిద్ధమైంది. ఇలా వివిధ సమస్యలు ప్రజల్లోకి తీసుకెళ్తూనే... గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన నగదు బదిలీ పథకాలను గుర్తు చేస్తోంది. ఇప్పుడు వాటిని కూటమి ప్రభుత్వం ఆపేసిందన్న ప్రచారానికి తెరతీసింది. అందుకే అప్పట్లో జగన్ ఉండి ఉంటే అనే ప్రచారం తీసుకొచ్చింది. అది పెద్దగా వర్కౌట్ కాలేదు. నియోజకవర్గాల పునర్విభజన కంటే ముందే ఎన్నికలు వస్తాయని ప్రచారం చేస్తే పార్టీ మారే వారి ఆలోచన కూడా మార్చవచ్చని చెబుతున్నారు. కూటమి హౌస్‌ఫుల్ అయినందున వైసీపీ నుంచి దూకేందుకు సిద్ధంగా ఉన్న వాళ్లు తగ్గుతారని ఎ÷-లాన్. ఇలా నలువైపులా ఆలోచించిన వైసీపీ 2027లోనే ఎన్నికలు రాబోతున్నాయని కచ్చితంగా వైసీపీ అధికారంలోకి వస్తుందని ప్రచారం చేస్తోంది. ఇప్పటి వరకు ఈ ప్రచారం ఎంపీలు, కింది స్థాయి నాయకులు మాత్రమే చేస్తూ వచ్చారు. ఇప్పుడు ఏకంగా అధ్యక్షుడు జగన్ అందుకున్నారు. పులివెందులలో పర్యటించిన జగన్ 2027లో ఎన్నికలు వస్తాయని వైసీపీ అధికారంలోకి వస్తుందని అన్నారు. అమలు చేయలేదని హామీలు ఇచ్చిన ఇప్పుడు ప్రజల వ్యతిరేకత ఎదుర్కొంటున్న చంద్రబాబు సర్కారుకి గుణపాఠం తప్పదని హెచ్చరించారు. పులివెందుల పర్యటనలో భాగంగా ఆయన కడప నేతలు, కార్పొరేటర్ల, కీలక నేతలతో సమావేశమయ్యారు. జిల్లా, రాష్ట్ర రాజకీయాలు, పార్టీ బలోపేతంపై చర్చించారు. కష్టాలు శాశ్వతం కావని.. పార్టీని అంటిపెట్టుకున్న వాళ్లకు భవిష్యత్‌లో గుర్తింపు ఉంటుందని జగన్ అన్నారు. ఇలాంటి టైంలో వ్యక్తిత్వాన్ని అమ్ముకోకూడదని నేతలకు సూచించారు. దేశ చరిత్రలోనే ఎవరూ చేయని విధంగా సంక్షేమ కార్యక్రమాలు చేశామని అన్నారు. కేవలం అబద్దాలు చెప్పలేకపోవడంతోనే ప్రతిపక్షంలో కూర్చున్నా మన్నారు జగన్. ప్రజలు వాస్తవాలు తెలుసుకుంటారని గత ప్రభుత్వంతో ఈ ప్రభుత్వం పని తీరును పోల్చి చూస్తారని అన్నారు. 2027లో జరిగే ఎన్నికల్లో కచ్చితంగా వైసీపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

# కామారెడ్డి జిల్లాలో కలకలం

- ముగ్గురు పోలీస్ సిబ్బంది అనుమానాస్పద మృతి
- చెరువులో మృదేహాల గుర్తింపు..ముమ్మర దర్యాప్తు

**కామారెడ్డి,డిసెంబర్26 వెలుతురు:**



పోలీస్ శాఖలో తీవ్ర కలకలం రేగింది. ఒకే రోజు ముగ్గురు సిబ్బంది అదృశ్యం కాగా ఇద్దరు చెరువులో విగతజీవులుగా కనిపించారు. ఓ ఎస్సై, లేడీ కానిస్టేబుల్ సహా కంప్యూటర్ ఆపరేటర్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భిక్కనూరు ఎస్సై సాయికుమార్, బీబీపేట ఠాణాలో పనిచేస్తోన్న కానిస్టేబుల్ శ్రుతి, బీబీపేట సహకార సంఘంలో ఆపరేటర్‌గా పని చేస్తోన్న నిఖిల్ అనే యువకుడు ఒకేసారి అదృశ్యం కావడంతో సర్వత్రా ఆందోళన నెలకొంది. సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువు ఒడ్డున వారి వస్తువులు కనిపించడంతో పోలీసులు బుధవారం రాత్రి గాలింపు చేపట్టారు. అర్ధరాత్రి సమయానికి శ్రుతి, నిఖిల్ మృతదేహాలు లభ్యమయ్యాయి. అటు, జిల్లా ఎస్పీ సింధుశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఎస్సై ఆచూకీ కోసం గాలించగా కొద్దిసేపటి తర్వాత ఎస్సై మృతదేహం లభ్యమైంది. గాంధారి మండల కేంద్రానికి చెందిన శ్రుతి బీబీపేటలో పని చేస్తుండగా.. మెదక్ జిల్లాకు చెందిన సాయికుమార్ గతంలో బీబీపేట ఎస్సైగా పని చేసి బదిలీపై భిక్కనూరు వచ్చారు. ఎస్సై అక్కడ పని చేసిన సమయంలోనే వీరిద్దరికీ పరిచయం ఏర్పడిందని పోలీసులు భావిస్తున్నారు. వీరి ఆత్మహత్యకు గల కారణాలేంటి.? అసలేం జరిగింది.? అనే దానిపై ఆరా తీస్తున్నారు. భిక్కనూరు ఎస్సై సాయికుమార్ సెల్‌ఫోన్ బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి స్విచ్ఛాఫ్ రావడంతో పోలీసులు ఆయన కోసం ఆరా తీయడం ప్రారంభించారు. అటు, బీబీపేట ఠాణాలో పనిచేస్తోన్న లేడీ కానిస్టేబుల్ శ్రుతి బుధవారం ఉదయం విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్నట్లు స్టేషన్‌లో చెప్పి బయటకు వచ్చారు. మధ్యాహ్నం అయినా కూతురు ఇంటికి రాకపోవడంతో ఆందోళనకు గురైన తల్లిదండ్రులు బీబీపేట పోలీసులకు సమాచారం ఇచ్చారు. వీరు గాంధారి మండలం గుర్జాల్‌లో ఉంటున్నారు. అయితే, శ్రుతి స్టేషన్ నుంచి ఎప్పుడో వెళ్లిపోయినట్లు పోలీసులు తెలపడంతో పేరెంట్స్ అధికారులను సంప్రదించారు. ఫోన్ సిగ్నల్ ఆధారంగా సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువు వద్ద ఉన్నట్లు గుర్తించారు. ఎస్పీ ఆధ్వర్యంలోని బృందాలు వెంటనే అక్కడికి చేరుకున్నాయి. బుధవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో చెరువు వద్ద కానిస్టేబుల్ శ్రుతి సెల్‌తో పాటు బీబీపేటకు చెందిన నిఖిల్ సెల్ కూడా దొరికింది. అలాగే, భిక్కనూరు ఎస్సై సాయికుమార్‌కు చెందిన చెప్పులు, నిఖిల్ చెప్పులు కనిపించాయి. అనుమానంతో చెరువులో గాలించగా లేడీ కానిస్టేబుల్, కంప్యూటర్ ఆపరేటర్ శ్రుతి మృతదేహాలు లభ్యమయ్యాయి. ఎస్సై ఫోన్ స్విచ్ఛాఫ్ అని వస్తుండడంతో ఆయన ఆచూకీ లభించలేదు. ఏం జరిగి ఉంటుందన్నది అంతుచిక్కడం లేదు. ముగ్గురూ కలిసి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఎస్సై సాయికుమార్ మృతదేహం సైతం లభ్యం కావడంతో ఏం జరిగిందనే దానిపై ఆరా తీస్తున్నారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICCATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com